29 . 11. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శనివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 179 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## గెలుపే లక్ష్యం అభివృద్ధి ధ్యేయం కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచన

పంచాయతీ ఎన్నికల్లో భాజపా బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తల కృషి చేయాలి

గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పార్టీ పనిచేస్తుంది

అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

## గోవాలో 77 అడుగుల శ్రీరాముడి కంచు విగ్రహం

- ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆవిష్కరణ



## పంచాయితీ ఎన్నికలకు
# లైన్ క్లీయర్




ఈ దశలో స్టే విధించలేమని స్పష్టీకరణ

తామే ఎన్నికలు నిర్వహించాలని.. స్టే ఎలా విదిస్తాం

పిటిషనర్‌ను ప్రశ్నించిన ధర్మాసనం

**హైదరాబాద్, నవంబర్28(వెలుతురు):** పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలని కోరుకుంటున్నారా..? అని పిటీషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో- 46పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తామే చెప్పినట్లు హైకోర్టు గుర్తు చేసింది. గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్ఎంసీ ఎలక్షన్‌ను రద్దు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలపగా.. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఈసీ అడ్వొకేట్ చెప్పుకొచ్చారు. అయితే, ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని మరోసారి స్పష్టం చేసింది. తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించి, తామే స్టే ఎలా ఇస్తాం. అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. అందుకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. సబ్ కేటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం హుకుం జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై

## పంచాయితీ ఎన్నికలపై సిఎం ఫోకస్

- 1నుంచి రేవంత్ జిల్లాల పర్యటన



**హైదరాబాద్,నవంబర్28( వెలుతురు):** పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో సిఎం

## కో..అంటే కోకాపేట .. కోట్లల్లో ఎకరం..

తాజాగా ఎకరం 151 కోట్లకు అమ్మకం

నియోపోలీస్ ప్లాట్ల వేలంలో రికార్డుస్థాయి ధరలు




## ఉడుపితో అనుబంధం విడదీయరానిది

- లక్ష కంఠ భగవద్గీత పఠనంలో మోడీ




## కెసిఆర్ దొంగదీక్షలతో తెలంగాణ రాలే

ఉనికి కోసం దీక్షాదివస్ పేరుతో డ్రామాలు

సోనియా దయవల్లనే తెలంగాణ సాకారం

ఎస్సీ,ఎస్టీ, బిసి విద్యార్థుల త్యాగాలు మరువలేనివి

బిసి రిజర్వేషన్ల అంశం ముగియలేదు

మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్,నవంబర్ 28( వెలుతురు):** తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దీక్ష కారణంగానే తెలంగాణ రాలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధినేత్రి

## కామారెడ్డిలో కవిత రైల్వే రోకో

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు డిమాండ్
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- కాళేశ్వరంతోనిజామాబాద్‌కు ఒరిగిందేమీ లేదని వ్యాఖ్య
- నిజాం సాగర్ పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి
- జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయాలి
- కామారెడ్డి పర్యటనలో జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్



**కామారెడ్డి,నవంబర్28( వెలుతురు):** కామారెడ్డిలో తెలంగాణ జాగృతి కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈక్రమంలో నిరసన చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అడ్డుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్‌రోకో నిర్వహించారు. కవిత పట్టాలపై బైఠాయించి ఆందోళన చేశారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే క్రమంలో

## హిల్ట్ పాలసీ పై బహిరంగ చర్చకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సిద్ధమా..

హిల్ట్ పాలసీపై బహిరంగ చర్చకు సవాల్ విసిరిన బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 28:** హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ ఫర్మేషన్ (%ఎ×యా%) పాలసీ ప్రతిపక్షాలకు అర్థం కాలేదనడం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి దివాళాకోరుతనానికి నిదర్శనం అని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విధానంలో పారదర్శకత ఉంటే, దానిపై చర్చించేందుకు అసెంబ్లీని ఎందుకు సమావేశపరచడం లేదని అన్నారు. హిల్ట్ పాలసీ



అత్యంత పారదర్శకంగా ఉందని, ఎలాంటి కుంభకోణానికి అస్కారం లేదంటున్న మంత్రి ఉత్తమ్ గారు, ఈ విధానంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు . ఓపెన్ డిబేట్ కు మంత్రి సిద్ధపడితే శనివారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీ మీడియా పాయింటులో జర్నలిస్టుల

# అమరావతి పునర్నిర్మాణం సంతోషదాయకం

- అమరావతి నిర్మాణం అంటే ఒక యజ్ఞం
- రాజధాని నిర్మించిడం మూమూలు విషయం కాదు
- రాజదానిలో బ్యాంకులన్నీ ఒకేచోటకు రావడం సంతోషం
- రైతులకు అండగా కార్యకలాపాలు సాగాలని ఆర్థికమంత్రి ఆకాంక్ష
- అమరావతిలో పలు బ్యాంకులకు నిర్మలాసీతారామన్ శంకుస్థాపన

## ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పనితీరు అద్భుతం

- మోడీ అందతో అమరావతి పునర్నిర్మాణం
- గత పాలకుల విధ్వంసంతో ఆగిపోయిన రాజధాని
- బ్యాంకింగ్ రంగ సంస్థల రాకతో ఆర్థిక పరిపుష్టి
- వేలాదిమందికి ఉద్యోగావకాశాలకు ఆస్కారం
- రాయలసీమకు వృధాజలాలలు తరలిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

గత పాలకుల విధ్వంసంతో ఆగిపోయిన అమరావతి రాజధాని పనుల్ని ప్రధాని మోదీ పునఃప్రారంభించారని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాలను త్యాగం చేసిన రైతులకు ధన్యవాదాలు. ప్రపంచంలో స్ఫూర్తిదాయకమైన ల్యాండ్ పూలింగ్ విధానంలో భూముల పొందిన ప్రాంతం అమరావతి అని గుర్తు చేశారు. రూ.15 వేల కోట్లను రాజధాని పునర్నిర్మాణానికి కేటాయించారు.







**అమరావతి,నవంబర్28( వెలుతురు):** రాజధానిలో 25 బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్,



నారాయణ హాజరయ్యారు. రాజధాని సీడ్ యాక్సెస్ రహదారి పక్కన సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మొదటి బ్లాక్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలా సాతీరామన్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి రీస్టార్ట్ చేయటం సంతోషం. దేశంలో ఒక కొత్త రాజధాని నగరం నిర్మించటం సామాన్యమైన విషయం కాదు. నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీ కూడా సహకరిస్తున్నారు. అమరావతి నిర్మాణం అంటే ఒక యజ్ఞం లాంటింది. ఇంత పెద్ద నగరానికి ఆర్థికంగా భరోసా ఉండాలన్న నిర్ణయంతోనే ఇవాళ పీఎస్‌యూ సంస్థలు ప్రధాన కార్యాలయాలు వస్తున్నాయి. 5 ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థలు ఇక్కడ ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఫైనాన్షియల్ డిస్టిక్ట్‌లో ఒకే చోట


## రైతుల త్యాగం.. అమరావతి

వైసిపి విధ్వంసక ధోరణితో రైతుల మృతి

విశాఖ ప్యాలెస్ కట్టుకుని ఊరేగాలనుకున్న జగన్

మూడు రాజధానుల డ్రామాతో ఒక్క ఇటుకా పేర్చలేదు

కార్యక్రమంలో మంత్రి లోకేశ్ విమర్శలు



## అభివృద్ధి కనిపించేలా కూటమి కృషి

ఆర్థిక సంస్థలు ఒకేచోటకు రావడం శుభపరిణామం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి



## గెలుపే లక్ష్యం అభివృద్ధి ధ్యేయం కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచన

**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 28:**

పంచాయతీ ఎన్నికల్లో భాజపా బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తల కృషి చేయాలని గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పార్టీ పనిచేస్తుందని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జైనథ్ బోరజ్ మండలాలా సమావేశం నిరాల గార్డెన్ శుక్రవారం జరిగిన సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు మాట్లాడుతూ గ్రామాల్లో జరిగి ఏ అభివృద్ధి పనులైన కేంద్రానికి సంబంధించిన నిధులతోనే చేపట్టడం జరుగుతుందని అన్నారు. గత ఎమ్మెల్యే ఎలక్షన్ ల సమయంలో తనను నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించారాని ఇప్పుడు బీజేపీ బలపరిచిన అభ్యర్థులను సైతం నిండు మనసుతో ఆశీర్వదించి, గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రం ద్వారా నిర్వహించే ఉపాధి హామీ పథకం తో సిసి రోడ్లు, మురికికాలువలు, స్మశాన వాటికలు, కమ్యూనిటీ హాల్ లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కావున బీజేపీ అభ్యర్థులను గెలిపించి, మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరుణాకర్ రెడ్డి. విజయ్.రాందాస్. అశోక్ రెడ్డి. ముకుంద. రమేష్. సన్నీ. రాకేష్ రెడ్డి. రాకేష్. మహిళా మోర్చా నాయకురాలు దివ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయితీ ఎన్నికలకు లైన్ క్లియర్

అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ గురువారం వెనుకబడిన కులసంఘాలు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాయి. అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కేటాయించాలని పిటిషనర్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. బీసీలలో ఏబీసీడీ వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఈక్రమంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎన్నికల ప్రక్రియ మొదలైనందున ఈ దశలో స్టే విధించలేమని తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎందుకు సవాల్ చేస్తున్నారని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

## గోవాలో 77 అడుగుల శ్రీరాముడి కంచు విగ్రహం

**గోవా,నవంబర్28( వెలుతురు):**

దక్షిణ గోవా కనకోన పట్టణంలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్టగాలి జీవోత్తం మఠం లో ఏర్పాటు చేసిన 77 అడుగుల ఎత్తైన శ్రీరాముని కంచు విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆవిష్కరించారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. సాధువులు, సంతులతో తనకున్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రజలు తమ సంస్కృతితో మమేకమయ్యేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. మఠం 550వ వార్షికోత్సవంపై ఆర్గనైజేషన్ కమిటీ జాయింట్ కన్వీనర్ ఎస్ ముకుంద్ కామత్ మాట్లాడుతూ, 15,000 మంది ఈ ఈవెంట్‌లో పాల్గొంటున్నారని చెప్పారు. శంకర్ మహదేవన్, అనూప్ జలోటా తదితర ప్రముఖ కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్టగాలి జీవోత్తం మఠం తొలి సారస్వత బ్రాహ్మణ్ వైష్ణవ మఠమని పీఎంఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ గోవాలోని పార్టగాలిలో మఠం ప్రధాన కార్యాలయం ఉంది. 13వ శతాబ్దంలో జగద్గురు మధ్వాచార్యులు స్థాపించిన ద్వైత సిద్ధాంతాన్ని ఈ మఠం అనుసరిస్తుందని పేర్కొంది.

## ఉడుపితో అనుబంధం విడదీయరానిది

**బెంగళూరు,నవంబర్28( వెలుతురు):**

ఉడుపి రావడం తనకు చాలా ప్రత్యేకమైంది అని ప్రధాని మోడీ అన్నారు. కర్ణాటకలోని ఉడుపిలో మోడీ పర్యటించారు. అంతకముందు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల నుంచి ప్రజలు పూల వర్షం కురిపించారు. అనంతరం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠానికి వచ్చారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొన్నారు. జగద్గురు శ్రీ శ్రీ సుగుణెళింద్ర తీర్థ స్వామీజీ విశ్వగీత పర్యాయ.. ప్రధాని మోడీని సత్కరించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఉడుపి జనసంఘ్, భారతీయ జనతా పార్టీకి సుపరిపాలన నమునాకు కర్మభూమిగా పేర్కొన్నారు. 1968లో ఉడుపి ప్రజలు జనసంఘ్ నుంచి వీఎస్.ఆచార్యను మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నుకున్నారని గుర్తుచేశారు. ఉడుపిలో కొత్త పాలనకు ప్రజలు పునాది వేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, సన్యాసులు, పండితులు, వివిధ రంగాలకు చెందిన పౌరులతో భగవత్ గీతను ఏకగ్రీవంగా పారాయణం చేయించారు. ఇక ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లలు దగ్గర నుంచి చిత్రాలను సేకరించాలని భద్రతా సిబ్బందిని, పోలీసు సిబ్బందిని మోడీ కోరారు.

## పంచాయితీ ఎన్నికలపై సిఎం ఫోకస్

మరోమారు జిల్లాల్లో పర్యటించి పార్టీ అభ్యర్థలను గెలిపించేందుకు ప్రచారం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. మొత్తం ఆరు రోజుల పాటు సీఎం జిల్లాల టూర్ కొనసాగనుంది. ఆరు రోజులు ఆరు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించనున్నారు. సీఎం రేవంత్ పర్యటన షెడ్యూల్ ఇలావుంటి. డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెం, 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్, 4న ఆదిలాబాద్, 5న నర్సంపేట, 6న నల్గొండ జిల్లా దేవరకొండలో పర్యటించనున్నారు. తెలంగాణలో త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. మొదటి విడత వచ్చే నెల డిసెంబర్ 11, రెండో విడత డిసెంబర్ 14, మూడో విడత డిసెంబర్ 17న ఉంటుంది. అయితే, ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేపట్టనున్నారని తెలుస్తోంది. తాజాగా, సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.

## హిల్ట్ పాలసీ పై బహిరంగ చర్చకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సిద్ధమా..

సమక్షంలో చర్చకు తాను సిద్ధం అని తెలిపారు. లేదంటే డేట్, టైమ్, వేదికను మంత్రిగారు ఖరారు చేసినా తనకు అభ్యంతరం లేదన్నారు. ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమే అని సవాల్ విసిరారు. హిల్ట్ పాలసీ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని, దీనిపై గతబీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే చర్చ జరిగిందంటున్న మంత్రి ఉత్తమ్ ... బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని, అక్రమాలను ఆదర్శంగా తీసుకుంటున్నారా. బీఆర్ఎస్ హయాంలో పారిశ్రామిక భూముల బదలాయింపులలో జరిగిన తప్పిదాలను బయటపెడుతామని మీ క్యాబినెట్ సబ్ కమిటీ సహచరులైన భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు మాట్లాడారు కదా, మరి ఎందుకని బయటపెట్టడం లేదు. బీఆర్ఎస్ పెద్దలతో మీకున్న మ్యాచ్ ఫిక్సింగ్ ఏంటి అని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకే పరిశ్రమలను నగరం బయటకుపంపుతున్నట్లు మంత్రి ఉత్తమ్ చెప్పారు. సరే, పరిశ్రమలను ఎక్కడికి తరలిస్తున్నారో, వారికి ఎక్కడ భూములను కేటాయించారో ఎందుకని చెప్పడం లేదన్నారు. పరిశ్రమలకు చెందిన 9,292 ఎకరాల భూముల్లో నిర్మాణాలు చేసుకోవచ్చంటూ, వాటిని ఆ ల్యాండ్ ఓనర్లకే అడ్డికి పావుశేరు ధరలకే ఎందుకు కట్టబెడుతున్నారు. రూ 6 లక్షల30 వేల కోట్ల విలువైన భూములను కేవలం రూ. 5 వేల కోట్లకే కట్టబెట్డడం కుంభకోణం కాక మరేంటని ప్రశ్నించారు. రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల కుంభకోణంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సహా మొత్తం క్యాబినెటుకు, కాంగ్రెస్ హైకమాండ్ పెద్దలకు భాగస్వామ్యం ఉంది. కాంగ్రెస్ సర్కార్ చేస్తున్నది ల్యాండ్ కన్వర్షన్ కాదు, ల్యాండ్ లూటీకి పాల్పడుతోంది. రాష్ట్రాన్ని ల్యాండ్ లూటీ మాఫియా రాజ్యమేలుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ల్యాండ్ లూటీ మాఫియా డాన్ లా, మంత్రులు ల్యాండ్ లూటీ గ్యాంగ్ స్టర్లుగా వ్యవహరిస్తున్నారు. హిల్ట్ పాలసీలో ఎలాంటి అవినీతి లేదంటున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డి గారిని ఒప్పించి తక్షణమే అసెంబ్లీని సమావేశపరచాలి. అసెంబ్లీలో చర్చించిన తర్వాతే హిల్ట్ పాలసీని అమలు చేయాలి. ఈ పాలసీని అమలు చేసేందుకు జారీ చేసిన జీవో-27ను తక్షణమే రద్దు చేయాలి. లేదంటే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ పాలసీ రద్దుకు భారీ ఉద్యమం చేపడతామని మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

## కో..అంటే కోకాపేట .. కోట్లల్లో ఎకరం..

**హైదరాబాద్,నవంబర్28( వెలుతురు):**

భూమిలో బంగారం పండుతుందని అంటుంటారు. కానీ భూములు బంగారమయ్యాయని ఇప్పుడు నిరూపితం అయ్యింది. హైదరాబాద్ లో భూముల విలువ బంగారాన్ని మించి పెరిగిపోయి రికార్డు సృష్టిస్తున్నాయి. కోకాపేట్ పరిసర ప్రాంతాల్లో కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఈ వేలంలో కోకాపేట నియోపోలీస్ భూములు రికార్డు స్థాయి ధర పలికాయి. రెండో విడత వేలంలో ఎకరాకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా.. 151 కోట్ల రూపాయలు పలికి హెచ్ఎండిఎకు కోట్లు కురిపించాయి. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేటలో భూములు.. కో అంటే కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో కోకాపేటలోని నియోపోలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈ-వేలంలో ఎకరం రూ.151.25 కోట్ల రికార్డు ధర పలికింది. నియోపోలిస్‌లోని ప్లాట్ నంబర్ 15, 16లోని 9.06 ఎకరాలను ప్రభుత్వం వేలం వేయగా.. రూ.1,353 కోట్లు ఆదాయం లభించింది. హైదరాబాద్ కోకాపేట్ లో ఉన్న భూముల రెండో విడత ఈ-వేలం శు క్రవారం ముగిసింది. నియోపోలిస్ దగ్గర ఉన్న ప్లాట్ నెంబర్ 15 లో ఎకరానికి 151 కోట్ల 25 లక్షలు పలికిన ఎకరం ధర పలికి రికార్డు సృష్టించింది. అదే విధంగా ప్లాట్ నెంబర్ 16 లో ఎకరం ధర 147 కోట్ల 75 లక్షలు పలికింది.రెండో విడత వేలంలో భాగంగా 9.06 ఎకరాల భూమిని వేలం వేసిన ఊఓఆం .. 1,3 కోట్ల 52 లక్షల ఆదాయాన్ని పొందింది. ఎ÷-లాట్ నెంబర్ 15 లో 4.03 ఎకరాలకు గాను 609 కోట్ల 55 లక్షలు పొందినట్లు ఊఓఆం అధికారులు తెలిపారు. అదే విధంగా ఎ÷-లాట్ నెంబర్ 16 లో 5.03 ఎకరాలకు గాను 743 కోట్లు పొందినట్లు పేర్కొన్నారు. నవంబర్ 25న జరిగిన మొదటి విడత వేలంలో రికార్డు స్థాయిలో ఎకరానికి 137.25 కోట్లు పలికిన సంగతి తెలిసిందే.. కోకాపేట నియోపోలిస్ లో 29 ఎకరాలతో పాటు మూసాపేట దగ్గర ఉన్న 16 ఎకరాల భూములకు వేలం వేసేందుకు సిద్ధమైంది హెచ్ఎండీఏ.డిసెంబర్ 3, 5 తేదీల్లో మిగతా ఎ÷-లాట్లకు ఈ వేలం జరగనుంది. కోకాపేట్ నియోపోలీస్ ప్లాట్లకు ఎకరానికి 99 కోట్లు, కోకాపేట గోల్డెన్ మైల్ ప్లాట్లకు 70 కోట్లు, మూసాపేట్ ప్లాట్ల కు 75 కోట్ల చొప్పున ప్రారంభ ధరను నిర్ణయించింది హెచ్ఎండీఏ. కోకాపేటలోని నియోపోలిస్ లేఅవుట్‌లో ప్లాట్లను కొనుగోలు చేసే వారికి ఆకాశమే హద్దుగా ఎన్ని ఫ్లోర్లయినా నిర్మించుకునేందుకు అనుమతులు ఇస్తారు. ఈ లేఅవుట్‌లో అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. దాదాపు 300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.40 ఎకరాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించారు. ఇందులో సైక్లింగ్ ట్రాక్స్, 45 మీ. వెడల్పైన రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలను కల్పించారు. అలాగే కమర్షియల్, రెసిడెన్సీ, ఎంటర్‌టైన్‌మెంట్‌ల అవసరాలకు భవనాలు నిర్మించుకునేందుకు అనుమతించనున్నారు.

## కెసిఆర్ దొంగదీక్షలతో తెలంగాణ రాలే

సోనియా తీసుకున్న నిర్ణయం వల్లనే తెలంగాణ సాకారమయ్యిందన్నారు. అంతేగానీ కెసిఆర్ దొంగ దీక్షలతో కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. శు క్రవారంఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదన్నారు. దీక్ష పేరుతో కేసీఆర్ ఎనిమిది రోజులు ఫ్లూయిడ్స్ తీసుకున్నారని.. దీక్ష పేరుతో కేసీఆర్ నాటకం చేశారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ ఇచ్చిన రిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామని పీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు వచ్చింది ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థులు పోరాటాన్ని కొనసాగించారని అప్పటి సంగతులను గుర్తుచేశారు. విద్యార్థుల ఆవేదన చూసి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కిరోసిన్ పోసుకున్న హరీష్ రావుకి అగ్గిపెట్టె దొరకలేదా అని ప్రశ్నించారు. ఫ్లూయిడ్స్ తీసుకుని ఐరోమ్ షర్మిల 16 ఏండ్లు దీక్ష చేశారన్నారు. ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్ కోట్లాది రూపాయలతో దీక్షా దివాస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం దీక్ష చేసినట్లు కేసీఆర్ నాటకం ఆడారని.. ఇప్పుడు దీక్షా దివాస్ పేరుతో మళ్ళీ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దీక్షా దివాస్‌ను పక్కన పెట్టి సోనియా గాంధీకి పాలాభిషేకాలు చేయాలని హితవుపలికారు. తెలంగాణలో కేసీఆర్, ఆయన పార్టీకి నూకలు చెల్లిపోయాయని భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమని కేసీఆర్‌కు అర్థమైందని.. అందుకే ఆయన బయటకు రావడం లేదంటూ కామెంట్స్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మహేష్ గౌడ్ స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కోర్టుకు వెళ్తామన్నారు. ఇంద్రా సహానీ, కృష్ణమూర్తి కేసులను ఛాలెంజ్ చేస్తామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశం ముగిసిపోలేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపు కోసం బీజేపీ అడ్డు పడుతోందని ఆరోపించారు. ఈ విషయంపై బీసీ నాయకులు.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్ళి ప్రశ్నించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడాలని ఎంపీలకు విన్నవించినట్లు తెలిపారు. హిడ్మా, గణపతి ప్రజాసేవ కోసం త్యాగం చేశాని పీసీసీ చీఫ్ అన్నారు. లొంగిపోదామని వచ్చే మావోయిస్టులకు అవకాశం ఇవ్వాలన్నారు. లొంగిపోదాం అనుకునే మావోయిస్టులు తెలంగాణకు రావచ్చని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం పేరుతో విషం నింపుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో చిచ్చు పెట్టినన్ని రోజులు ఇండియా ముందుకు పోదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

# కామారెడ్డిలో కవిత రైల్వే రోకో

తోపులాట జరిగి ఆమె చేతికి స్వల్ప గాయమైంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శుక్రవారంకామారెడ్డిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైలు రోకో నిర్వహించారు. ఆమెతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు రైలు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవితను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. అనంతరం వారు ట్రాక్‌పై కూర్చొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు అప్రమత్తమైన కామారెడ్డి పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి జాగృతి నేతలను అక్కడ నుంచి తప్పించే ప్రయత్నం చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో కవితను అరెస్ట్ చేశారు. ఈ పెనుగులాటలో కవిత చేతికి స్వల్ప గాయమైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం 17 శాతం రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం దారుణమన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీలు అడ్డుకుంటూ కుట్రలు చేస్తున్నాయని కవిత ఆరోపించారు. ఇకపోతే కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఒరిగిందేమీ లేదని విమర్శలు చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూడికతీతను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాంసాగర్ టూరిజం, కౌలాస్ కోట ఓ స్పాట్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. మొంథా తుఫానుతో జిల్లాలో పత్తి రైతులు నష్టపోయారని చెప్పుకొచ్చారు. జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జిన్నింగ్ మిల్ కోసం జాగృతి పోరాటం చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పేరుతో డబ్బులు తీసుకోవద్దని సూచించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి ఆయా సమస్యలపై పార్టీలను ప్రశ్నించాలని సూచించారు. రోడ్ల కోసం ఆందోళన చేస్తుంటే జుక్కల్ ఎమ్మెల్యే యువకుల మీద కేసులు పెట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. యువతపై నమోదైన కేసులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్ వెంటనే ఉద్యోగులను తిరిగి స్వస్థలాలకు పంపించాలని సూచించారు. గొర్రెల కోసం డీడీలు కట్టి చాలా మంది అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. అర్హులకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. ఆటోవాళ్లకు వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## మెట్రో ప్రయాణికులకు శుభవార్త

**- స్టేషన్లలో వస్తువుల స్టోర్‌కు స్మార్ట్ లాకర్లు**

**హైదరాబాద్,నవంబర్28( వెలుతురు):**

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పింది. ప్రయాణంలో భాగంగా మోసుకెళ్లాల్సిన అవసరం లేదు అనుకునే సమాన్లను మెట్రో స్టేషన్లలోనే స్టోర్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది . అన్ని మెట్రో స్టేషన్లలో స్మార్ట్ లాకర్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా ముందుగా ఏడు స్టేషన్లలో స్మార్ట్ లాకర్లను శుక్రవారం ప్రారంభించింది. హైదరాబాద్ నగరంలోని ఏడు మెట్రో స్టేషన్లలో ఆన్-డిమాండ్ స్మార్ట్ స్టోరేజ్ లాకర్ల సౌకర్యంను ప్రారంభించింది. హైదరాబాద్ మెట్రో స్టేషన్లలో ప్రయాణికులకు సౌకర్యం పెంచటంతో పాటుగా యుటిలిటీ ఆధారిత సేవలను విస్తరించడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణిస్తున్నారు. హెల్మెట్లు, సామాను, షాపింగ్ బ్యాగులు, బ్యాక్‌ప్యాక్‌లు సహా ఇతర వ్యక్తిగత వస్తువులను సురక్షితంగా భద్రపరచడం దీని ఉద్దేశం. దీంతో ప్రయాణికులు ఎలాంటి ప్రయాస లేకుండా ప్రశాంతంగా ప్రయాణించే అవకాశం కలుగుతుంది. స్మార్ట్ లాకర్స్ ప్రారంభ కార్యక్రమం ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో జరిగింది.




టక్కీట్ స్మార్ట్ లాకర్లు సౌకర్యవంతమైన స్టోరేజ్ అనుభవాన్ని అందిస్తాయి. ప్రయాణికులు మూడు విధాలుగా కేవలం 30 సెకన్లలోపు స్మార్ట్ లాకింగ్ చేయవచ్చు. తొలుత స్మార్ట్ లాకర్ల సేవలు 7 స్టేషన్లలో లభ్యమవుతున్నాయి. అవి: మియాపూర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఎల్ బి నగర్, ఉప్పల్, పరేడ్ గ్రౌండ్, హై-టెక్ సిటీ.

## మహానటి సావిత్రి 90వ జయంతి వేడుకలు

**డిసెంబర్ 1నుంచి 6 వరకు రవీంద్రభారతిలో నిర్వహణ**

**హైదరాబాద్,నవంబర్28( వెలుతురు):**

మహానటి సావిత్రి 90వ జయంతి సభలను నిర్వహించబోతున్నట్లు ఆమె కూతురు విజయ చాముండేశ్వరి ప్రకటించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో డిసెంబర్ 1 నుంచి 6 వరకు 'సావిత్రి మహోత్సవ్' పేరిట ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రముఖ కళా సంస్థ 'సంగమం' ఫౌండేషన్‌తో కలిసి నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో సావిత్రి గారి సినిమాల ప్రదర్శన, పాటల పోటీలు ఉంటాయి. డిసెంబర్ 6న జరిగే సావిత్రి 90వ జయంతి సభలో 'మహానటి' చిత్ర దర్శక నిర్మాతలైన నాగ్ అశ్విన్, ప్రియాంకా దత్, స్వప్నాదత్, 'సావిత్రి క్లాసిక్స్' పుస్తక రచయిత సంజయ్ కిషోర్, ప్రచురణకర్త బొల్లినేని కృష్ణయ్యని ప్రత్యేకంగా సత్కరించనున్నారు. మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సభకి భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నారు. చలన చిత్ర ప్రముఖులు ఆత్మీయ అతిథులుగా విచ్చేయనున్నారు.

# ఇమ్రాన్ మరణవార్త పుకార్లు మాత్రమే

**- తాలిబన్ ప్రభుత్వం కుట్ర అన్న ఇమ్రాన్ సన్నిహితుడు**

**ఇస్లామాబాద్,నవంబర్28( వెలుతురు):**

పాకిస్తాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ మరణ పుకార్లు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ క్రమంలో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఆయన సహచరుడు ఫవాద్ చౌదరి కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ నేషనల్ మీడియా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫవాద్ చౌదరి మాట్లాడుతూ.. ఇమ్రాన్ మరణ పుకార్లు తాలిబన్ల కుట్ర అని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఆఫ్ఘన్ తాలిబాన్ చీఫ్ ముల్లా హైబతుల్లా హత్యకు గురయ్యారని పాకిస్తాన్ మీడియా కథనాలు ప్రచురించింది. దీనికి కౌంటర్‌గా ఇమ్రాన్‌ను జైల్లో చంపేశారంటూ ఇప్పుడు ఆఫ్ఘాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని అన్నారు. ఇమ్రాన్ ఖాన్ మరణంపై ఊహాగానాలు ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మధ్య తప్పుడు సమాచార ఎదురుకాల్పుల్లో భాగమని స్పష్టం చేశారు. అయితే షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఇమ్రాన్ ఖాన్‌కు భయపడుతోందని అన్నారు. జైల్లో ఆయన ధైర్యంగా ఉన్నారని.. జైలు అధికారులు కూడా ఇమ్రాన్ మరణ పుకార్లను ఖండించారని గుర్తు చేశారు. పాకిస్తాన్ ప్రభుత్వం ఇమ్రాన్ ఖాన్‌కు భయపడుతోంది కాబట్టే ఆయన ఫోటోలు విడుదల చేయడం లేదని ఎద్దేవా చేశారు. పాకిస్తాన్?లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా ఇమ్రాన్ ఖాన్ గత



ఎన్నికలలో సాధించిన దానికంటే ఎక్కువ సీట్లు సాధిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉన్న ఇమ్రాన్ ఖాన్ కొన్ని వారాల నుంచి బయటికి కనిపించడం లేదు. భద్రతా కారణాలు చెబుతూ జైలు అధికారులు అతని కుటుంబీకులను కూడా కలవనివ్వడం లేదు. దీంతో వారం ప్రారంభంలో ఆఫ్ఘనిస్తాన్ టైమ్స్ సహా ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన అనేక సోషల్ మీడియా హ్యాండిల్స్ రావల్పిండిలోని అడియాలా జైలులో ఇమ్రాన్ హత్యకు గురయ్యారని పేర్కొన్నాయి. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఈ కుట్రకు కుట్ర పన్నారని ఆరోపించారు. ఇమ్రాన్ ఖాన్ చనిపోయాడంటూ ఒక ఫొటోను కూడా విడుదల చేశాయి. దీంతో పీటీఐ కార్యకర్తలు, ఆయన కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఇమ్రాన్ ను చూపించాలని అడియాలా జైలు ముందు ఆందోళనకు దిగారు.

## టీపీసీసీ డాక్టర్ సెల్ రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ప్రకటించిన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్




**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 28:**
రాష్ట్ర వైస్ చైర్మన్, జనరల్ సెక్రటరీలతో పాటు ఐదు జిల్లాల చైర్మన్లను మరియు ఇతర కీలక పదవులకు సంబంధించిన నియామక పత్రాలను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అందచేశారు. మిగతా జిల్లా , రాష్ట్ర స్థాయి కమిటీల నియామకాలను కూడా త్వరలో ప్రకటించనున్నట్లు టీపీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్ డా. రాజీవ్ తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి బీద ప్రజలని సేవలు అందిస్తున్న డాక్టర్స్ కి శుభాభినందనలు డాక్టర్ కి సమాజంలో ప్రత్యేక స్థానం నేను కూడా డాక్టర్ కావాలని అనుకున్నాను. పరిస్థితుల వల్ల కాలేకపోయా నేటి సమాజంలో డాక్టర్ వృత్తికి ప్రయారిటీ చదువుకున్న వాళ్ళు రాజకీయాల్లో కి వస్తే క్వాలిటీ డెవలప్మెంట్ తయారవుతుంది డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ఒక రూపాయి డాక్టర్ గా ఫేమస్ డాక్టర్స్ కి ప్రజలకి సేవ చేసుకునే అవకాశం గత ప్రభుత్వం వైద్యరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆరోగ్య మెరుగు కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలను మెచ్చుకొని ఇంత మంది డాక్టర్లు కాంగ్రెస్ కుటుంబంలో భాగం కావడం సంతోషంగా ఉందని పీసీసీ చీఫ్ తెలిపారు. సమాజంలో డాక్టర్ల పాత్ర గొప్పదని, రోగాన్ని నయం చేయడంతో పాటు సమాజంలో ఉన్న సమస్యలను తొలగించడంలో డాక్టర్లు భాగం కావాలని మహేష్ గౌడ్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరోగ్య శాఖలో వేలాది ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తుచేశారు. డాక్టర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి వైద్యులు ప్రభుత్వానికి సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ మెడికల్ , హెల్త్ విభాగం కమిటీల నియామకాలు, ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసే దిశలో ఒక మంచి నిర్ణయమని, వైద్య రంగంలో నిర్మాణాత్మక ఆలోచనలతో పనిచేయడానికి అవకాశమిచ్చినందుకు కాంగ్రెస్ పార్టీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సలహాలు, సూచనలతో వైద్య రంగంలోని అన్ని విభాగాల సిబ్బంది సంక్షేమం కోసం త్వరలోనే ప్రణాళిక రూపొందిస్తామని డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ తెలిపారు.

## అంబర్పేట్ అలికేఫ్ చౌరస్తాలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసిన నివాళులు అర్పించిన కిషన్ రెడ్డి



**బషీర్ బాగ్ వెలుతురు 28 నవంబర్ :**
అంబర్పేట్ అలీ కేఫ్ చౌరస్తాలో జ్యోతిరావు పూలె వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ , మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బిజెపి ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ బిజెపి 42 శాతం రిజర్వేషన్ కు అనుకూలంగా ఉంది బిసి ని ప్రధానిగా చేసిన ఘనత బిజెపికి దక్కింది ఓట్లు దండుకోవడం కోసమే మభ్యపెడుతున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ 42 శాతం అమలు చేయకుండా చేతులు ఎత్తేసింది కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలోనైనా బీసీని ముఖ్యమంత్రి చేసిందా చెప్పాలి జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం ఆయన చూపిన బాటలో నడుస్తాం

## మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి ని ఘనంగా నిర్వహించిన సుందరయ్య విజ్ఞాన కేంద్రం



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 28:**
సమాజంలో సమానత్వం, విద్య ,మహిళా సాధికారత, అణగారిన వర్గాల కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం సెక్రటరీ వినయ్ కుమార్, భూపతి వెంకటేశ్వర్లు, ఇందిర, రజిత, కవిత, మరియు నియో కర్సర్ విద్యార్థులు నర్మద, రమ్య, రవళిక, శివ పార్వతి, ప్రశాంతి, సింధు ప్రియా తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల విలీనానికి బిజెపి వ్యతిరేకం: రామ్

**హైదరాబాద్,నవంబర్28( వెలుతురు):**
జీహెచ్ఎంసీలో పలు మున్సిపాలిటీలను విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు వెల్లడించారు. మున్సిపాలిటీ విలీనం అశాస్త్రీయంగా ఉందన్నారు. మజ్లిస్ పార్టీకి లబ్ది చేకూర్చేందుకే మున్సిపాలిటీలను విలీనం చేస్తున్నారని ఆరోపించారు. విలీనంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఏ ప్రాతిపదికన విలీనం చేస్తున్నారో చెప్పాలన్నారు. శివారు మున్సిపాలిటీల తీరు అధ్వాన్నంగా ఉందని, ఇప్పుడు మరింత అధ్వాన్నంగా మారగలదని అన్నారు.

# మేడారం జాతరకు విస్తృత ఏర్పాట్లు

**- యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులను పూర్తిచేస్తాం : మంత్రి పొంగులేటి**

**- మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీతక్క, కొండా సురేఖ, ఎంపీ బలరాం నాయక్**



**మేడారం / హైదరాబాద్ వెలుతురు నవంబర్ 28:**
ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం ఆదివాసీ గిరిజన జాతరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని మేడారంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేపట్టామని వీటిని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. మేడారం జాతర నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి







శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ ( సీతక్క), దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సీతక్క, ఎంపీ బలరాం నాయక్ తదితరులతో కలిసి వివిధ నిర్మాణ పనులను పరిశీలించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు అనుగుణంగా ఆదివాసీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ ఇలవేల్పులు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలున్న ప్రాంగణాన్ని లక్షలాది భక్తులు దర్శించుకునేందుకు వీలుగా మేడారంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రోడ్ల నిర్మాణ పనులు, డివైడర్లు, ప్లాంటేషన్ తదితర పనులు పూర్తి కావడానికి 24 గంటలు నిరంతరం పనిచేయాలన్నారు. పెరుగుతున్న భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని గద్దెల వద్ద భక్తుల కెపాసిటీ 3వేల నుంచి 10వేలకు పెంచుతున్నట్లు తెలిపారు. ప్రయాణంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా మేడారానికి వచ్చే ప్రధాన రహదారిలో మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కోట్లాది మంది భక్తివిశ్వాసాలతో ముడిపడిఉన్న ఈ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ముందస్తు మొక్కులు చెల్లించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను పూర్తిచేస్తామన్నారు. కోట్లాది భక్తులు వచ్చే జాతర ప్రాశస్త్యానికి తగ్గట్లు భారీ ఎత్తున స్వాగత తోరణాల నిర్మాణంతో పాటు గద్దెల వద్దకు భక్తులు సులువుగా చేరుకోవడం.. గద్దెల దర్శనం, బంగారం (బెల్లం) సమర్పణ.. జంపన్న వాగులో స్నానాలు ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రధానంగా గుడి ప్రాంగణంలో చేస్తున్న అభివృద్ధి పనులను,జంపన్న వాగు, స్తూపం నుండి బస్టాండ్ వరకు జరిగే రోడ్ల విస్తరణను పరిశీలించారు. జంపన్న వాగు అభివృద్ధి , సుందరీకరణ ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు మేడారం అభివృద్ధి పనుల్లో గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ఎటువంటి భంగం కలగకుండా ప్రతి నిర్మాణం, ప్రతి కట్టడాన్ని పూర్తిగా ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా, మేడారం జాతర పూజారులు, ఆదివాసీ పెద్దల సూచనలతో చేపడుతున్నామని చెప్పారు రెండేళ్లకోసారి జరిగే మహా జాతరతో పాటు ఏడాది పొడవునా అన్ని రోజుల్లో మేడారం వచ్చి గద్దెలను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోందని భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కెఎస్ శ్రీనివాసరాజు, ఆర్ %డ%బి ఈ ఎన్ సీ మోహన్ నాయిక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానొత్ రవి చందర్ , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి , రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి మనోజ్ కుమార్ , మండల మాజీ అద్యక్షులు జాలపు అనంత రెడ్డి , జిల్లా నాయకులు , మండల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సినిమాలోని పాత్రల భావోద్వేగాలు, మానసిక సంఘర్షణలను విశ్లేషించిన “దిస్ టెంప్టింగ్ మ్యాడ్‌నెస్” చిత్ర బృందం

**- జ్ఞాపకాలు, స్త్రీ ద్వేషం, మనుగడ, వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన తీరును చర్చించిన చిత్ర బృందం**

**- బాధ, దృక్కోణం, ఈ కథ ఈ రోజు ఎందుకు ముఖ్యమైందనే అంశాలపై ఆసక్తికర సంభాషణ**




**హైదరాబాద్ వెలుతురు 28 నవంబర్ 2025:**
దిస్ టెంప్టింగ్ మ్యాడ్‌నెస్ చిత్ర బృందంతో ఐఎఫ్ఎఫ్ఐ వేదికగా జరిగిన విలేకరుల సమావేశం ఈ చిత్రంలోని పాత్రల మానసిక స్థితిని, సాన్నిహిత్యాన్ని, చాలా కాలం పాటు నిలిచి పోయే వాటి సంభాషణల్లోని సత్యాలను ప్రతిబింబించింది. దర్శకుడు జెన్నిఫర్ మోంట్‌గోమెరీ, నిర్మాత ఆండ్రూ డేవిస్, నటులు సూరజ్ శర్మ, జెనోబియా ష్రాఫ్‌లు మాట్లాడుతూ... జ్ఞాపకాలు, భావోద్వేగాలు, వాస్తవిక ఘటనల ఆధారంగా రూపొందించిన ఈ బాధాకరమైన కథను తెరకెక్కించడంలో వారి అనుభవాలను వివరించారు. జెన్నిఫర్ మాట్లాడుతూ... “ఒక నిజమైన కథ, దురదృష్టం నిండిన జీవితంలోని కథ నుంచి ఈ కథ ప్రేరణ పొందింది.” అన్నారు. కథనం గురించి మాట్లాడటం కూడా కష్టమని చెబుతూ... వర్ణించడానికి మాటలు కూడా సరిపోని భావాలను ఎన్నో సినిమా అందించగలదని ఆమె స్పష్టం చేశారు. “వాస్తవ సంఘటనల భారాన్ని ప్రేక్షకులు అర్థం చేసుకోవడానికి తగిన వేదికను మేం ఇవ్వాలనుకున్నాం.” అని వ్యాఖ్యానించారు. ఆండ్రూ మాట్లాడుతూ... నిజ జీవిత గాయాన్ని స్వీకరించడంలో ఉన్న సవాలును ప్రతిబింబించారు. వాస్తవ కథను చెప్పడం బాధ్యతతో కూడుకున్నదని ఆయన పేర్కొన్నారు. “కథకులుగా, మేం ఒక సంఘటనను తిరిగి చెప్పడం మాత్రమే కాదు. అర్థం, వివరణ, సమాధానం లేని ప్రశ్నలకు సమాధానం కనుగొనడానికి ప్రయత్నిస్తున్నాం. అదే మా నిజమైన పని.” అని వివరించారు. నటుడు సూరజ్ శర్మ మాట్లాడుతూ... ఈ చిత్రం తనకు కేవలం మరొక ప్రాజెక్ట్ మాత్రమే కాదు, ఇది వ్యక్తిగత అనుబంధం గలది అన్నారు. ఈ అనుభవాన్ని “చాలా మందికి వర్తించేది” గా అభివర్ణిస్తూ... మానసిక, భావోద్వేగ వేధింపుల భయంకరమైన ప్రాబల్యం గురించీ ఆయన ప్రస్తావించారు. “ప్రపంచంలో పదకొండు శాతం మంది మహిళలు సమస్యను ఎదుర్కొంటు న్నారు... భారత్ లో ఈ సంఖ్య ఇంకా ఎక్కువ. చర్చను ప్రారంభించే చిత్రంలో భాగం కావడం చాలా ముఖ్యం అనిపించింది.” అన్నారు. తన స్నేహితుడి సోదరి... వేధింపులను భరించడాన్ని, ఆ పరిస్థితి నుంచి బయటపడటానికి సహాయం చేయడానికి ముందుకు వచ్చిన తన జీవితంలోని ఒక క్షణాన్నీ ఆయన పంచుకున్నారు. “ఈ చిత్రం నిజంగా బాధిత మహిళలకు నివాళి” అని ఆయన అన్నారు.

## హనుమంతరావు గారి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే గారి 135వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు

**బషీర్ బాగ్ వెలుతురు 28 నవంబర్:**
మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా అంబర్ పేట్ అలీ కేఫ్ చౌరస్తా వద్ద జ్యోతి రావు పులే విగ్రహానికి నివాళులు అర్పించిన పొన్నం ప్రభాకర్ వి హనుమంతరావు మేయర్ విజయలక్ష్మి రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ డిసిసి అధ్యక్షులు మోత రోహిత్ పూలే వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేసారు బీసీ వెల్ఫర్ %డ% రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జ్యోతి రావు పులే 135వ సంవత్సరాలు పూర్తి అయినా ఇంకా చరిత్రలో ప్రజల మధ్యలో ఉన్నారంటే ఆయన చూపిన సంస్కరణలు, ఆయన మార్గమే అందరికీ ఆదర్శం.మహాత్మా జ్యోతిరావు పూలే సమస్యలన్నిటికీ పరిష్కారం విద్యనే బలహీన వర్గాల బిడ్డలు , ముఖ్యంగా స్త్రీలు చదువుకోవాలని నినాదం ఇచ్చిన వ్యక్తి బలహీన వర్గాలు సమాజంలో అందరితో సమానంగా నిలబడాలన్న దానికి విద్య ముఖ్యం. ఈ మధ్య కుల సర్వే లో నివేదిక పరిశీలిస్తే ఉన్నత స్థానాల్లో ఉన్న కుటుంబాలు పరిశీలిస్తే డబ్బున్న ,భూమి ఉన్న అవేమీ కాదు విద్యా ఉన్న కుటుంబాలే ఉన్నత స్థాయిలో ఉన్నాయి అని అన్నారు. వి హనుమంతరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం విద్యా, ఉపాధి, రాజకీయ లలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం.. మన



ప్రాథమిక హక్కు ఆర్టికల్ 14 లో కూడా బలహీన వర్గాలకు అన్యాయం చేయమని అయన అన్నారు తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు తీసుకోవడం లో ఏమైనా లోపాలు ఉంటే చెప్పండి బీసీ సంఘాల నాయకులను కోరుతున్న మీ పోరాటం ఉద్యమాలు బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లకు అడ్డంపడుతున్న పార్టీలను నిలదీయాలి దేశం లో %××ు% లాంటి కేంద్ర సంస్థల్లో కూడా27 శాతం రిజర్వేషన్లు రావడానికి దేశ వ్యాప్తంగా బలహీన వర్గాల ఎంపీలను కూడగట్టుకొని సాధించిన వ్యక్తి హనుమంతరావు బీసీ లకు అన్యాయం చేస్తే ఊరుకోమ్ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ వెల్ఫేర్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమతరావు , రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ,ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్ ఆర్ లక్ష్మణ్ యాదవ్ అప్సర్ యూసుఫ్ జాయి పి నారాయణస్వామి పులి జగన్ గరిగంటి రమేష్ దిడ్డి రాంబాబు టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్ పీ రామ్మోహన్ కృష్ణ గౌడ్ గడ్డం శ్రీధర్ గౌడ్ కోట అనిల్ రావుల సుధాకర్ సి సుధాకర్ మహేష్ గౌడ్ ఫరీద్ భాయ్ షేక్ జమీర్ అజ్జు భాయ్ అలిమ్ శోకత్ బాయ్ బ్లాక్ ప్రెసిడెంట్ ఠాకూర్ హరి తిలక్ సింగ్ కోట్ల కిరణ్ సునీల్ గౌడ్ సందీప్ హాజీ మోసిన్ సమీయుల్లా మహిళా నాయకులు దేవి హర్షయ శాంతమ్మ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు

# సంపాదకీయం.. పత్తి రైతులపై నిబంధనల కత్తి !

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు చిత్తవుతున్నారు. రైతులు ఆనందంగా తమ పంటలను అమ్ముకున్నామన్న భరోసాలో లేరు. ధాన్యం ఏదైనా దైన్యంగానే గడుపుతున్నారు. ముఖ్యంగా తెల్లబంగారం పండిస్తున్న రైతులు తెల్లమొహం వేయాల్సి వస్తోంది. పత్తి కొనుగోలులో రైతులకు సిసిఐ నిబంధనలు తీవ్ర ప్రతిబంధకం గా మారాయి.అమెరికా టారిఫ్ యుద్ధం నేపథ్యంలో భారత రైతుల ప్రయోజనాలను ఎట్టిపరిస్థితుల్లో కాపాడి తీరుతానని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ పత్తిపై దిగుమతి సుంకాన్ని 11 శాతం నుంచి సున్నాకు తగ్గించడం రైతుకు చివరి శరాఘాతమైంది. దీని ఫలితంగా అమెరికా, బ్రెజిల్ నుంచి విదేశీ పత్తి వరదలా వచ్చిపడుతుంటే స్వదేశీ పత్తి ధర లేక వెలవెలబోతున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోళ్ల సమస్యపై పూర్తి అలసత్వం చూపుతున్నాయి. సీసీఐ రెండుసార్లు టెండర్లు పెడితే మిల్లుల యాజమాన్యాలు ఎగ్గొట్టాయి. దాంతో విధిలేక మూడోసారి పిలవాల్సి వచ్చింది. వీటన్నిటి ఫలితంగా సిరులు తెస్తుందనుకున్న తెల్ల బంగారం రైతుల నడ్డి విరుస్తోంది. ఆశలు కోల్పోయిన పత్తి రైతులు పంటలను తగులబెడుతున్నారు. అన్నిరకాలుగా ఆశలు అడుగంటడంతో పత్తి రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి వచ్చింది. ప్రైవేటు వ్యాపారుల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపే ప్రేమలో లేశమైనా రైతుల మీద చూపితే ఈ పరిస్థితి వచ్చేది కాదు. పత్తి విక్రయానికి అనేక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇ-క్రాప్‌లో నమోదు నమోదై ఉండాలి. దీంతోపాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీప కొనుగోలు కేంద్రంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకొని వెళ్లాలి. ఎనిమిది శాతం నుంచి 12 శాతం



తేమ ఉంటే మూడు కేజీలు తరుగు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. 12 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనాలన్న నిబంధన రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎకరాకు గరిష్టంగా 12 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మొత్తం దిగుబడిలో సగం కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉన్నా కనీస మద్దతు ధర రూ.8,110 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. అంతే కంటే ఎక్కువగా తేమ శాతం ఉంటే కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టి తీసుకురావాలని అధికారులు తెగేసి చెప్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ప్రస్తుతం మంచు కురుస్తున్నందున 15 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేదని చెప్తున్నారు. పత్తి కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలనే నిబంధనను రద్దు చేయాలని కోరుతున్నారు. ఇలా రైతన్నలను అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలతో మభ్య పెట్టడం తప్ప క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకోవడం లేదు.. ఏ సాయం అందకపోయినా, సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని, ఆరుగాలం కష్టపడి పంట పండించి అమ్ముదామని మార్కెట్‌కు పోతే కొనేవారు కరువు. దీని ఫలితంగా అన్నదాతలు, మరీ ముఖ్యంగా పత్తి రైతులుచిత్తవుతున్నారు. మద్దతు ధర అస్థిరంగా ఉండటం, ప్రకటించిన ధర కూడా ఇవ్వకపోవడం రైతులపాలిట శాపంగా మారుతున్నది. ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి, అటు కేందప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరి కారణంగా పత్తి రైతు పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. పత్తి కొనుగోలు విషయంలో రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ అడుగడుగునా కొర్రీలు వేస్తున్నది. గతేడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 కాగా రైతుకు దక్కింది రూ.5,500 మాత్రమే. అంటే రూ.2,000 కోత కింద పోయింది. ఈ ఏడాది మద్దతు ధర రూ.8,100కు పెంచినట్టు చెప్తున్నప్పటికీ రైతు చేతికి వచ్చేది రూ.6,000 మాత్రమే. సీసీఐ స్వయంగా మద్దతు ధర పూర్తిగా చెల్లించనప్పుడు ప్రైవేటు వ్యాపారి మాత్రం ఎలా చెల్లిస్తాడని రైతులు వాపోతున్నారు. గతంలో పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకల నివారణకు సీసీఐ ప్రవేశపెట్టిన నిబంధనలపై జిన్నింగ్ మిల్లులు తీవ్రంగా ప్రతిఘటిస్తుండటంతో పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు ఏర్పడ్డాయి. టెండర్ల ప్రక్రియకు బ్రేకులు పడి పత్తి రైతు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాడు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో విలవిలలాడుతున్న పత్తి రైతుకు యాప్ రూపంలో మరో గండం వచ్చిపడింది. కపాస్ కిసాన్ యాప్ ద్వారానే కొనుగోళ్లు జరుపుతామని సీసీఐ షరతు పెట్టింది. చాలామంది రైతుల వద్ద ఇప్పటికీ స్మార్ట్ ఫోన్లు లేవు. పైగా రాష్ట్రమంతటా, ముఖ్యంగా పత్తిరైతులు ఎక్కువగా ఉండే ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సరైన మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేదు. దీంతో రిజిస్ట్రేషన్ నుంచి అమ్మకం దాకా సమస్యలు వెన్నాడాయి. యాప్ కనెక్ట్ కాకపోతే ప్రైవేటు వ్యాపారులే గతి అనే పరిస్థితి నెలకొన్నది. ఈలోగా వానలు, వరదలు ముంచెత్తడంతో పత్తిబేళ్లు తడిసి అసలుకే ఎసరు వస్తున్నది. ఇంకోవైపు ఎకరాకు సగటున 13 క్వింటాళ్లు కొంటామన్న సీసీఐ చివరి నిమిషంలో చెప్పాపెట్టకుండా ఎకరాకు 7 క్వింటాళ్లకు తగ్గించడంతో రైతుల నెత్తిన పిడుగుపడింది. తేమ శాతం ఎక్కువగా ఉందనో, రంగు మారిందనో ఇష్టారాజ్యంగా ధర చెల్లిస్తున్నారు. ఇప్పుడు 12 శాతం ఉంటేనే నాసిరకం అంటూ ధర తగ్గిస్తున్నారు. పంట దిగుబడి సమయంలో, మార్కెట్‌కు తరలించే సమయంలో వర్షాలు, తుఫానులు రావడం తెలిసిందే. తద్వారా తేమశాతం కొంచెం పెరగడమూ సహజమే. ఈ నేపథ్యంలో రైతు పట్ల కనీస సానుభూతితో వ్యవహరించ కుండా కొర్రీలతో చుక్కలు చూపించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ఇతర రాష్ట్రాల్లోనూ యాప్ కారణంగా పత్తి రైతులు యాతనలు పడ్డారు. పంజాబ్ రైతులైతే ఈ యాప్ తమకొద్దని తిరస్కరించారు. ఈ క్రమంలో దేశంలో పత్తి మార్కెట్ తీవ్రమైన కుదుపులు ఎదుర్కోవడం కారణంగా పత్తి పండించే రైతులకు శరాఘాతంగా మారింది. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి, దేవీయంగా పత్తి రైతులను ప్రోత్సహించాల్సి ఉంది.

# ఎన్నికల్లో బీసీలకు శుద్ధ హామీల తో ఓట్లు హక్కులకు మాత్రం పంగనామాలు!



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

స్వాతంత్ర్యం వచ్చిన 78 సంవత్సరాలు పూర్తయిన తరువాత కూడా ఈ దేశంలో బీసీల పరిస్థితి ఎంత వెనుకబడి ఉందో చూసినా, పాలకుల నిస్పృహ ఎంత లోతుగా ఉందో స్పష్టంగా తెలుస్తుంది. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కనీసం తమ జనాభాకు తగిన గుర్తింపు కూడా రాలేదు. రిజర్వేషన్ల విషయంలోనూ, కుల భవనాల విషయంలోనూ, అభివృద్ధి అవకాశాల విషయంలోనూ బీసీలు నేటికీ న్యాయం కోసం వేచి చూస్తూనే ఉన్నారు. పేదవాడి జీవితం ప్రభుత్వాలకు ప్రాధాన్యం అయితే, బీసీల జీవితం కూడా అదే ప్రాధాన్యం కలిగి ఉండాలి. కానీ జరిగినది ఏమిటంటే బీసీలను ఆచారాలు, వృత్తులు, కులాల పేర్లతో విభజించి ఓటు బ్యాంకులుగా మార్చారు. వాళ్ల అభివృద్ధి, గౌరవం, హక్కుల సంగతులు ఎవరి రాజకీయ అజెండాలోనూ స్థిరంగా ఉండలేదు. 78 సంవత్సరాల కాలంలో కేంద్రం అయినా, రాష్ట్రాలు అయినా బీసీల కోసం చేసిన పని ఏది పెద్దదిగా చెప్పుకోగలమో అన్న ప్రశ్నకు సరైన సమాధానం కూడా లేదు. బీసీలకు కేంద్ర రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో లేవు. 27% రిజర్వేషన్ పేరుతో ఇస్తున్నదంతా వారి జనాభాలో అరకొర. బీసీలు 50% దాటిన సమాజం కాగా రిజర్వేషన్లు మాత్రం సగానికి కూడా చేరు అవ్వలేదు. ఇది న్యాయం కాదు, ఇది స్పష్టమైన రాజకీయ దోపిడీ. పెద్ద పెద్ద కమిషన్లు వేశారు, నివేదికలు సమర్పించారు, కానీ అమలులో మాత్రం పాలకులు వెనుకంజ వేశారు. 50% క్యాపింగ్ అనే పేరుతో బీసీల ఆశలు అణచివేశారు. ఈ దేశ రాజకీయాల్లో బీసీలను ఎన్నికల సమయంలో గుర్తుపెట్టుకుని, తరువాత వారి ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. కేవలం రిజర్వేషన్లు మాత్రమే కాదు, కులాల సామాజిక అస్తిత్వానికి, గౌరవానికి, సంస్థీకరణకు అవసరమైన కుల భవనాలు కూడా చాలా బీసీ కులాలకు నేటికీ లేవు. గ్రామం, మండలం, పట్టణం, జిల్లా,ఎక్కడ చూసినా తమకంటూ ఒక సమావేశం పెట్టుకోవడానికి, సమస్య చెప్పుకోవడానికి, కార్యచరణలు తీర్మానించడానికి భవనం లేకపోవడం దుర్మార్గమైన చర్యలు కావా ఇది అన్యాయం కాదా. కొన్ని కులాలకు భవనాలు ఉన్నా, వందలాది బీసీ కులాలు నేటికీ ప్రభుత్వ దృష్టికి కనిపించకుండా ఉన్నాయంటే ఇది ప్రభుత్వాల పాత్ర ఎంత బలహీనమో, ఎంత అసమానతను కొనసాగించిందో తెలిపే సాక్ష్యం.బీసీల్లోనే అత్యంత వెనుకబడిన వర్గాలైన ఎంబీసీల పరిస్థితి చెప్పాలంటే అది మరింత బాధాకరం. వీరికి ప్రత్యేక రిజర్వేషన్లు కూడా లేవు, ప్రత్యేక బోర్డులు సైతం ఉన్నప్పటికీ నిధులు లేని అలంకార సంస్థలుగా మిగిలిపోయాయి. ప్రభుత్వాల్లో, శాసనసభల్లో, కీలక పదవుల్లో ఎంబీసీల ప్రాతినిధ్యం దాదాపు శూన్యం. వాళ్లు ప్రభుత్వ ప్రాధాన్యంలోకి రాకపోవడానికి కారణం ఒకటేఎంబీసీలు సంఘటితం కాలేదు. సంఘటితం కావడానికి భవనాలు, సంస్థలు, శక్తివంతమైన బోర్డులు కావాలి. కాని ప్రభుత్వాలు అందుకు ఆసక్తి చూపలేదు.బీసీలనుబలహీనంగా,విభజించబడినట్లుగా ఉంచడమే ప్రభుత్వాలకు రాజకీయంగా లాభదాయకం. దేశంలో దళితులకు, గిరిజనులకు అందినట్లుగా బీసీలకు రాజ్యాంగబద్ధ హోదాలో శక్తివంతమైన కార్పొరేషన్ కూడా లేదు. ఉన్న బీసీ కార్పొరేషన్లు అర కొరక లోన్లు మాత్రమే. బీసీలు ఆర్థికంగా, విద్యా పరంగా, సామాజికంగా ఎదగాలంటే బలమైన సంస్థలు కావాలి. కానీ బీసీల పేరుతో వచ్చిన బడ్జెట్ కూడా చాలా రాష్ట్రాల్లో ఇతర కార్యక్రమాలకు మళ్లించబడుతుంది. బీసీలు ఎంత పెద్ద వర్గమో తెలిసినా, వాళ్ల కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం ప్రభుత్వాలకు ఒక రాజకీయ రిస్క్‌గా మారింది. ఎందుకంటే బీసీల అభివృద్ధి అంటే వారి రాజకీయ చైతన్యం పెరగడం. అది పాలక వర్గాలకు పెద్ద ప్రమాదం.78 ఏళ్లలో బీసీలు మోసం ఎదుర్కొన్నది బీసీ జనగణన జరగకపోవడం. 1931 తర్వాత ఈ దేశంలో బీసీల నిజమైన జనాభా లెక్కించలేదు. లెక్కలు లేకపోతే హక్కులు ఎలా వస్తాయి? రిజర్వేషన్లు ఎలా పెరుగుతాయి? బడ్జెట్ ఎలా నిర్ణయిస్తారు? ఇదే ప్రశ్న బీసీల మనసులో సంవత్సరాలుగా మండుతోంది. ప్రతి ఎన్నికల సీజన్‌లో బీసీ జనగణన చేస్తామని చెప్పి, తరువాత అధికారంలోకి వచ్చాక ఫైళ్లను పక్కన పడేస్తారు. ఇదే భారత రాజకీయ వ్యవస్థ బీసీలపై చేసిన అత్యంత పెద్ద అన్యాయం. బీసీ, ఎంబీసీ, సమాజం 78 సంవత్సరాలుగా మౌనం పాటిస్తూ ఓర్పుతో బీసీ సమాజం బతుకుతుంది . వృత్తులు మార్చుకుంది, విద్య కోసం పోరాటం చేశారు , ఉద్యోగాల కోసం కష్టపడ్డారు , దేశానికి బీసీ రైతులు అన్నం పండించారు. బీసీ సమాజం దేశం కొరకై శ్రమిస్తూనే ఉన్నారు . కానీ బీసీ సమాజానికి తమకంటూ గౌరవం రాలేదు. బీసీలు సృష్టించిన సంపదను పాలక వర్గాలు అనుభవించాయి, కానీ బీసీల హక్కులను మాత్రం ఎప్పుడూ అగ్రవర్ణాల పెట్టుబడిదారులు అడ్డుకుంటున్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రతివర్గానికీ సమాన హక్కులు. కానీ ఈ దేశ ప్రజాస్వామ్యం బీసీలకు మాత్రం అక్షరాలా అసంపూర్ణం.బీసీల సమస్యలు, వారి వేదనలు, వారి ఆశలు ఇవన్నీ ఇకపై మాటల్లో కాదు చర్యల్లో రావాల్సిన సమయం వచ్చింది. బీసీలకు జనాభా ఆధారిత రిజర్వేషన్లు ఇవ్వాలి. ప్రతి కులానికి కుల భవనం నిర్మించాలి. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లను శక్తివంతం చేయాలి. ఎంబీసీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. అలాగే తెలంగాణ ప్రభుత్వంలో బీసీ,లకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి. ఇక గత పాలకులు తెలంగాణలో బీసీ సమాజం రాజకీయంగా, సామాజికంగా ఎంత పెద్ద శక్తి ఉన్నా, వారి సమస్యలు మాత్రం శాసనసభల్లో, ప్రభుత్వ ప్రణాళికల్లో, బడ్జెట్లలో పేజీల రూపంలో కనిపించినప్పటికీ అమలు దశలో ఎప్పటికీ నిర్లక్ష్యానికి బలైనారు. ఎన్నో దశాబ్దాలుగా తమ కులాల పురోగతి, విద్య, ఉపాధి పరంగా ఆశలు పెట్టుకున్న బీసీలకు గత ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలు మాటల్లో ప్రకాశించాయి గానీ పనుల్లో మాత్రం చీకటిగానే మిగిలిపోయాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీల ఆత్మగౌరవాన్ని రాజ్యాంగబద్ధంగా పెంచాలన్నది, ప్రభుత్వాల బాధ్యత. కానీ గత బిఆర్ఎస్ పది సంవత్సరాల్లో పరిస్థితులు చూస్తే అవమానకరంగా బడ్జెట్ కేటాయింపులు , ఈ రాష్ట్రంలో బీసీల పేరుతో ఎన్నో ప్రకటనలు చేసి, అవి పూర్తయ్యేలోపే ప్రభుత్వాలు మారిపోయాయి , నాయకులు మారతారు, ప్రాధాన్యతలు మారతాయి. కానీ మారని ఒకే విషయం బీసీల నిరీక్షణ, నిరాశ, నెవ్వెరపాటు.బీసీ ఆత్మగౌరవ భవనాలు కూడా అలాంటి నిర్లక్ష్య దశలోనే చిక్కుకుపోయాయి. 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం శాసన సభలో, ప్రజలకు ఇచ్చిన మాటల్లో ఘనంగా ప్రకటించిన ఈ ప్రాజెక్టు బీసీ కులాల వారికి ప్రతిష్టాత్మకమైన ఆలోచన. ఎన్నో దశాబ్దాలుగా నిలిచిపోయిన తమ కులాల సంఘాలకు సొంత స్థలం, శిక్షణ కేంద్రాలు, సమావేశ భవనాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక నిర్మాణాలు ఉంటాయని విన్న బీసీలు ఆశతో ఉప్పొంగిపోయారు. ఇక మన రాష్ట్రంలో సుమారు 56 శాతం జనాభా కలిగిన వర్గానికి ఇలాంటి ఆత్మగౌరవ భవనాలు నిర్మించడం నిజంగా అవసరమే, కానీ ప్రభుత్వ ధర్మం కూడా. బీసీల సంఘాలు, వృత్తులు, కులాల తమతమ కార్యక్రమాలు నిర్వహించుకునే ప్రత్యేక ప్రదేశాలు ఉండాలి అనేది ఎంతో కాలంగా పెంచుకున్న కల. ఆ కల నిజమవుతుందని భావించిన నుం2014నుండి 2023 వరకు, ఆపై ప్రభుత్వం మారిన తర్వాత 22 నెలలు ఈ మొత్తం కాలంలో జరిగిందేమిటంటే కేవలం శంకుస్థాపనలు, ప్రకటనలు, భూములపై కాగితపు పనులు మాత్రమే.

బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం సుమారు 87.3 ఎకరాల భూమి కేటాయించామని, 95.2 కోట్లు కూడా ఆమోదించామని చెప్పినప్పటికీ ఈ సంఖ్యలు కేవలం బడ్జెట్ పుస్తకాల్లోనే నిలిచిపోయాయి. ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో 22 భవనాలు, కోకాపేట్లో 13 భవనాలు, మేడిపల్లి, ఫిర్జాదిగూడ, గిర్మాపూర్, బాటసింగారంలో ఒక్కో భవనం చొప్పున నిర్మించాలని నిర్ణయించినా, చివరికి ఆ భూములు ఎక్కడ కనిపించడం లేదు. కొన్ని చోట్ల భూములు నిజంగానే ఉన్నాయేమో కానీ పనికొచ్చే స్థితిలో లేవని బీసీ సంఘాలు వాపోతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో ప్రభావశీల నాయకుల కులాలకు అత్యుత్తమ భూములు అందించగా, చిన్న తరగతి బీసీ కులాలను వరదల్లో మునిగిపోయే ప్రాంతాల్లోకి, రహదారి కూడా సరిగా లేని ప్రాంతాల్లోకి నెట్టేశారు అనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఒకేసారి ప్రభుత్వం 41 కులాలకు భవనాలు ఇస్తామని ప్రకటించినా, అమలు దశలో మాత్రం బీసీ కులాల మధ్యే ఒకలా తేడాలు చూపడం కూడా వారు తీవ్రంగా ప్రశ్నిస్తున్న అంశమే.2023 ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం 41 భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినప్పటికీ, అవి పూర్తిగా ఎన్నికల ప్రచారానికి భాగమేనని నేటి పరిస్థితులు నిరూపిస్తున్నాయి. శంకుస్థాపనలు ఘనంగా జరిగాయి, బోర్డులు పెట్టారు, మీడియా కవరేజ్ ఇచ్చారు. కానీ ఆ బోర్డుల దగ్గరికి నేడు వెళితే దుమ్ము, పిచ్చి మొక్కలు, మురుగునీళ్లు పందులతో కనిపిస్తున్నాయి, ఒక పక్కన పొలాలు, గుంతలు, పెంకులు తప్ప ఇంకేం కనిపించడం లేదు. ప్రభుత్వం మారగానే ఆ భవనాలపై పూనుకున్న వేడి పూర్తిగా చల్లారిపోయింది. అంటే బీసీల ఆత్మగౌరవం ఓట్ల కోసం అనే ప్రాజెక్టు రాజకీయ ప్రయోజనాల కోసం చేసిన మాయలా? బీసీలే ప్రశ్నిస్తున్నారు, “శంకుస్థాపన చేసిన రోజే తిరిగి చూడని ప్రభుత్వాలు బీసీ ఎంబీసీ ఇంకెంత కాలం మమ్మల్ని మభ్యపెడతారు? అని బీసీ సమాజానికి అనుమానం వస్తుంది ,ఇక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మరింత విచిత్రంగా మారింది. కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే బీసీ ఆత్మగౌరవ భవనాలపై పునఃసమీక్ష చేస్తామని, అనుమానాస్పద అంశాలను శుద్ధి చేస్తామని చెప్పారు. కానీ 22 నెలలు గడిచినా ఒక్క భవనం నిర్మాణం కూడా ప్రారంభం కాలేదు. నిధుల విడుదల జరగలేదు. ఫైళ్లు పక్కన పెట్టబడ్డాయి. పునఃసమీక్ష అనే పేరుతో ప్రాజెక్టును పూర్తిగా నిలిపివేశారనే అభిప్రాయం బీసీ సంఘాల్లో విపరీతంగా పెరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అవినీతి పేరుతో నిత్యం విమర్శించినా, అవినీతిలో ఉన్నదేది, సరిచేయాల్సినదేది చెబుతూ చర్యలు తీసుకుంటున్నట్టు కనిపించడం లేదు. బీసీ భవనాల్లో అవినీతి ఉంటే దర్యాప్తు చేసి ప్రాజెక్టును పరిశుభ్రం చేసి పూర్తి చేయాలి. గాని బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన మొత్తం ప్రాజెక్టును నిలిపివేయడం అంటే బీసీలను రాజకీయంగా తక్కువ అంచనా వేయడమే కాదా?తెలంగాణ బడ్జెట్ ప్రతి సంవత్సరం రెండు లక్షల కోట్లకు పైబడి ఉండగా బీసీ భవనాలకు అవసరమైన 100 కోట్ల రూపాయలు కేటాయించడం ప్రభుత్వానికి అంత కష్టం ఎలా అవుతుంది? రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో బీసీల ఓట్లను తమ జేబులో వేసుకునేందుకు పలు హామీలు ఇస్తాయి. బీసీ విజన్ , బీసీ గర్వం, బీసీ అభివృద్ధి, బీసీ పథకాలు అంటూ పెద్ద పెద్ద పదాలు వాడతారు. కానీ ఎన్నికలు ముగిసిన రెండు సంవత్సరాలు దాటిన ఆ హామీలు ఎక్కడో మాయమైపోతాయి. ఒక సామాజిక వర్గం మీద ఇంతటి నిర్లక్ష్యం ఉండటం విచారకరం. ముఖ్యంగా తెలంగాణలాంటి రాష్ట్రంలో బీసీలు అన్ని వృత్తుల్లో, అన్ని రంగాల్లో శ్రమతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిన వర్గం. వారికి కేటాయించిన హక్కులను, గౌరవాన్ని, గుర్తింపును చిన్నచూపు చూడడం అంటే ప్రజాస్వామ్యాన్ని చిన్నచూపు చూడడమే.ఈ ఆత్మగౌరవ భవనాలు కేవలం ఇటుకలు, ఇంజనీరింగ్ ప్లాన్లుగా ఉండవు. ఇవి గుర్తింపు కేంద్రాలు.

ఒక కులం తమ గతాన్ని, తమ వృత్తిని, తమ చరిత్రను దాచుకునే, అభివృద్ధి చేసుకునే ప్రదేశం. రజక , ముదిరాజ్ , కమ్మరి, వాల్మీకి బోయ,శాలివాహన,నభాస్,మేదరి,మేర, వడ్డెర,గంగపుత్ర,కచ్చి,లోధా,భుంజ్వా,దేవాంగ, పట్కరి,జాంద్ర,నీలి,పూసల,యెల్లపు,మున్నూర్ కాపు యాదవ, కురుమ,ఆరె కటిక,పెరిక ,సగర/ ఉప్పర, దూదేకుల,గాండ్ల, బొందిలి, నయాబ్రాహ్మణ, మాల, మదిగ, గౌడ, వీరభద్ర, పూసల యాదవ%ా% ప్రతి బీసీ, ఎంబీసీ, కులానికి తమ ప్రతిష్ఠ కోసం ఒక స్థలం అవసరం. బీసీ కులాలు తమ సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, చైతన్య సభలు నిర్వహించుకునే ప్రదేశాలు లేకపోవడం అసలు సమస్య. ఇలాంటి సందర్భంలో ప్రభుత్వం ప్రకటించిన బీసీ భవనాలు ప్రారంభమైతే, ఆ సమాజం ఎదుగుదలకు అవి కేంద్రాలుగా మారేవి. ఒక రాష్ట్రంలో వృత్తి ఆధారంగా జీవించే వందలాది కులాలకు ఒక కేంద్రం నిలువడం అంటే ఆ వర్గానికి ప్రభుత్వ గుర్తింపు, గౌరవం లభించడం. కానీ ఆ అవకాశం బీసీలకు ఇప్పటికీ దూరంగానే కనిపిస్తోంది.ప్రతి ఎన్నికల సమయంలో “42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి” అనే నినాదం గట్టిగా వినిపిస్తుంది. కానీ రిజర్వేషన్ ఒకపక్కని ఇవ్వకుండా పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్ ఇస్తానన్న కాంగ్రెస్ నా అతిలేదు నా గతి లేదు %ా% కానీ కనీసం బీసీ కులాల పేరుతో నిర్మించాలని నిర్ణయించిన భవనాలైనా పూర్తి చేయండి అని బీసీ సంఘాలు అడుగుతున్నారు. ప్రభుత్వానికి ప్రజల నమ్మకమే ప్రధాన బలం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అంటే ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం. నేడు బీసీలకు ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టబడట్లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వమూ తన వాగ్దానాన్ని పూర్తిగా నెరవేర్చకుండా 10 సంవత్సరాలు పంగనామాలు పెట్టింది . కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తోంది. ఇరుపార్టీలూ బీసీల గుండెల్లో అదే గాయం పెట్టాయి“మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు” అనే బాధ కుల సంఘాలకు ఉన్నాయి.రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఈ ఎన్నికల్లో బీసీల ఓటు ఎంత ప్రభావం చూపుతుందో ఇద్దరు పెద్ద పార్టీలు గణాంకాలు వేసుకుని తెలుసుకుంటాయి. బీసీల ఓటు ఆకర్షించడానికి కొత్త హామీలు రావచ్చు. కానీ బీసీలు గతంలో ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోని ప్రభుత్వాలను ఎవరైనా నమ్ముతారా? బీసీ సంఘాలు ఇప్పటికే గట్టిగా చెబుతున్నాయిగత ప్రభుత్వానికి వచ్చిన గతే ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ఈ ప్రభుత్వానికీ తప్పదని.

ఓటు రూపంలో ఇచ్చే తీర్పు ఎవరికీ తప్పించుకోలేనిదని ఎవరూ మరిచిపోవద్దని చెప్తున్నారు.బీసీ ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలంటే ప్రభుత్వం పెద్దగా చేయాల్సిందేమీ లేదు. ఇప్పటికే ఉన్న భూములను సక్రమంగా పరిశీలించి, పనికి పనికిరాని ప్రాంతాలను తొలగించి, నిధులను తక్షణమే విడుదల చేస్తే రెండు సంవత్సరాల్లోనే ఇవన్నీ పూర్తిచేయడం సాధ్యమే. కానీ చేసేందుకు సంకల్పం కావాలి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనే బాధ్యత ఉండాలి. ప్రాజెక్టులను రాజకీయ దృక్కోణంలో కాకుండా సామాజిక దృక్కోణంలో చూడగల దూరదృష్టి కావాలి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆ లక్షణాలు స్పష్టంగా కనిపించడం లేదు.బీసీల ఆత్మగౌరవం రాజకీయాల కాటుకగా మారకూడదు. అది ఒక సమాజం యొక్క చరిత్ర, కృషి, జీవనశైలి, వృత్తి, సంస్కృతికి ప్రతీక. ఆ ప్రతీకను కాపాడటం ప్రభుత్వపు కర్తవ్యం. శంకుస్థాపనలతో ఆత్మగౌరవం రాదు. పూర్తయ్యే భవనాలే బీసీలకు గౌరవాన్ని తెస్తాయి. ఈ వర్గం కోసం నిజమైన పని చేయాలంటే ఆయా భవనాలను యుద్ధ ప్రాతిపదికన తీసుకుని పూర్తి చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం బీసీలను ఎప్పటికీ మౌనంగా చూస్తూ ఉండకూడదు. వారు ఒక పెద్ద సమాజం. వారి శక్తి రాజకీయాలకు బలం. వారి ఓటు ప్రభుత్వాల భవితవ్యాన్ని నిర్ణయిస్తుంది.ఈ రాష్ట్రంలో బీసీలు ఎవరి వద్దా బిచ్చం అడుగుటకు రాలేదు. తమ హక్కులను, గౌరవాన్ని, తమ కులాల పురోగతిని కోరుకుంటున్నారు. రేవంత్ ప్రభుత్వం మరియు బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలనిఆ బాధ్యతను గుర్తించి వెంటనే బీసీ భవనాల నిర్మాణాన్ని పునరుద్ధరించాలి. కాగితాల గదిలో ధూళిపడిన ఫైళ్లను వెలికి తీసి, బడ్జెట్‌లో నిధులను విడుదల చేసి, ప్రతి నియోజకవర్గంలో నిర్మాణ పనులు మొదలుకావాలి. ఇలాచేస్తేనే బీసీ సమాజం నమ్మకం తిరిగి వస్తుంది. లేదంటే ప్రభుత్వం ఎంత పెద్ద హామీ చెప్పినా ప్రజలు నమ్మే రోజులు పోయాయి. నమ్మకం వచ్చినప్పుడు నేతలకు మద్దతు వస్తుంది. నమ్మకం కోల్పోతే అధికారమే కోల్పోతారు అనేది నగ్నసత్యం.

## మంచాలలో సోమవారం రోజు జరిగే అయ్యప్ప మహాపాడి పూజకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని ఆహ్వానించిన మంచాల అయ్యప్ప స్వాములు



**మంచాల వెలుతురు నవంబర్ 28:**
మంచాల మండలం కేంద్రంలో డిసెంబర్ 1వ తేదీ సోమవారం రోజు దండేటికార్ శర్వంజి ఫంక్షన్ హాలో జరిగే అయ్యప్ప స్వాముల మహా పాడి పూజ కార్యక్రమానికి రావాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నివాసానికి వెళ్లి అయ్యప్ప స్వాముల మహాపడిపూజకు ఆహ్వానించిన మంచాల మాజీ ఎంపీటీసీ ఎడ్మనరేందర్ రెడ్డి గురుస్వామి రావుల శ్రీనివాస్ మంచాల గ్రామ అయ్యప్పస్వాములు ఈకార్యక్రమంలో అయ్యప్ప సాములు రాంరెడ్డి కన్నెస్వామి అభిషేక సాయినాధ్ సాయి అర్జున్ సాయికిరణ్ రెడ్డి సాయిరెడ్డి భరత్ శివ యశ్వంత్ సురేష్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలు పూలే స్ఫూర్తితో రాజ్యాధికారం సాధించుకోవాలి

**- బిసి విద్యార్థి జేపీసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామిగౌడ్**



**వెలుతురు, హైదరాబాద్ నవంబర్ 28 :**
మహాత్మ జ్యోతిబా పూలే తన జీవి తాంతం బడుగు బలహీన వర్గాల కోసం పని చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని బిసిలు పూలే స్ఫూర్తితో రాజ్యాధికారం సాధించుకోవాలని బిసి విద్యార్థి జేపీసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి గౌడ్ అన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ముందు బిసి వి ద్యార్థి జేఏసీ ఆధ్వ ర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే 135వ వర్ధంతి సందర్భం గా బిసి విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి గౌడ్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొల్లెపల్లి స్వామి గౌడ్ మాట్లా డుతూ మహాత్మ జ్యోతిబా పూలే జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చి భవితరా నికి అందించాలన్నారు. పార్లమెంటులో, ఇటు అసెంబ్లీలో మహాత్మ జ్యోతి బాపూ లే విగ్రహాన్ని ప్రతిష్టించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కా ర్యక్రమంలో బహు జన స్టూడెంట్ ఫెడరే షన్ రాష్ట్ర అ ధ్యక్షులు బోరెల్లి సురేష్, అరవింద్, నాగరాజు,లక్ష్మణ్, విగ్నేష్, సుభాష్, శ్రీశైలం, శ్రీకాంత్, సైదులు, మహే ష్, రాజేష్, కౌశిక్, నిఖిల్, వెంకటేష్, జి తేందర్, చందు, రఘు, మధు, శివ తది తరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ బ్యాంక్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో రిటైల్ క్రెడిట్ ఔట్రీచ్ ప్రోగ్రాం కోటిలో నిర్వహించారు



**బషీర్ బాగ్ వెలుతురు 28 నవంబర్ :**
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో, సెంట్రల్ ఆఫీస్ ముంబై నుండి వచ్చిన కార్పొరేట్ క్రెడిట్ జనరల్ మేనేజర్ శ్రీ A.D. శ్రీనివాస్ పర్యవేక్షణలో క్రెడిట్ రిటైల్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నారెడ్కో డైరెక్టర్ శ్రీ సాసన్ సిద్ధార్థ ప్రధాన అతిథిగా హాజరయ్యారు. అలాగే హైదరాబాద్ జోన్ DZH M.V.S. ప్రసాద్, రీజినల్ హెడ్ DGM D.K. బరన్వాల్ గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని SVM గ్రాండ్, కోటిలో నిర్వహించారు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన GM A.D. శ్రీనివాస్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యంత పోటీ పడే వడ్డీ రేట్లతో, జీరో ప్రాసెసింగ్ ఫీజు, ప్రీపేమెంట్ ఛార్జీలు లేకుండా రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన ఆటోమోటివ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్ వంటి వాహన డీలర్లు, అలాగే అండ్రోమెడా, స్టార్ గ్రూప్‌ల వంటి DSAs ను కూడా ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే బిల్డర్స్, సన్‌రైజ్ బిల్డర్స్ వంటి ప్రముఖ నిర్మాతలతో వ్యక్తిగతంగా వన్-ఆన్-వన్ మీటింగ్‌లు నిర్వహించారు. కొత్త కస్టమర్లతో కూడా వ్యక్తిగతంగా మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. రిటైల్ ప్రోడక్ట్‌లపై సమగ్రంగా వివరిస్తూ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చూపించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా కస్టమర్లకు చెక్కులు మరియు సంశన్ లెటర్లు అందజేశారు. రుణ ప్రాసెసింగ్‌లో పూర్తిగా పారదర్శకత పాటిస్తూ, TAT (Turn Around Time) ని కచ్చితంగా అనుసరిస్తామని కస్టమర్లకు హామీ ఇచ్చారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే గారి 135వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన అంబర్ పెట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**బషీర్ బాగ్ వెలుతురు 28 నవంబర్ :**



అంబర్‌పేట్ లోని అలీ కేఫ్ చౌరస్తా వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే గారి 135వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ మరియు గోల్నాక కార్పొరేటర్ శ్రీమతి దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో సమానత్వం,విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం జ్యోతిరావు పూలే చేసిన అపార సేవలను స్మరించుకుంటూ,ఆయన విప్లవాత్మక ఆలోచనలను నేటి యువతకు చేరవేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

## మంచాలలో మహాత్మ జ్యోతిరావు పూలే 135 వర్ధంతి వేడుకలు

**- మహాత్మ జ్యోతిరావు పూలే అడుగు జాడల్లో నడవాలి**
**- ఎంఎస్ పి జిల్లా అధ్యక్షుడు రావు గళ్ళబాబు ప్రజా సంఘాల అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్**



**మంచాల వెలుతురు నవంబర్ 28:**
మంచాల మండలం మహాత్మాజ్యో తిరావుపూలే 135వ వర్ధంతి వేడు కలు మంచాల మండల కేంద్రంలో ప్రజా సంఘాల అధ్యక్షులు కంబాలపల్లి భాస్కర్ గారి అధ్వర్యంలో వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు కార్యక్రమానికి ముక్య అతిధులుగా ఎంఎస్ పి జిల్లాఅధ్యక్షులు రా వుగల్ల బాబు పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతు సామాజిక వైకాళికుడు మానవాలి చేత మహాత్మ అని పి లిపించుకున్న మహానీయుడు అగ్ర హారంలో బంధీగా ఉన్న అక్షరాన్ని అందరికి అందించిన మహోన్నతు డుమహిళా హక్కులు కూడా మానవ హక్కులేనని నినాధించ భార్యాను తానా పోరాటంలో భాగం చేసి పోరాటం చేసిన మానవత్వపు యో ధుడు,సామాన్యుల వేతలను సమా జానికి చూపిన సంగసంకర్త సామాజి క అంతరాలపై థాన కాలంతోగులాం గిరి రాశి మహా యుద్ధమే నడిపిన మహాత్ముడు సత్యశోధక సమాజం ద్వార థాన సర్వస్వం సమాజఅభ్యు న్నతి కోసమేధా ధరపో సిన యుగ పురుషుడు త్యాగశీలి మహాత్మాజ్యోతి రావు పూలేఅనేక సంఘర్షణలతో కుడిన నేటి సమాజానికి ఒక ఆశయ రూపకంగా నిలిచిన మహనీయుడు అన్యాయాలను ఆధిపత్యాన్ని ఎదిరించి అట్టడుగు వర్గాలను హక్కున చేర్చుకొని అక్షర యుద్ధం నడిపిన మహాత్ముడా అందుకో మా ఉద్యమ జోహార్లు.నేడు పూలే గారు 135 వ వర్ధంతి సందర్భంగా వారిని స్మరిస్తు ఘననివాళ్ళు అర్పిస్తున్నాం మీరు చూపిన మార్గంలో నడుస్తాం మీరు కలలు గన్న సమాజ నిర్మాణం కోసం శ్రమిస్తాం ఈ కార్యక్రమంలో రావుల సాయి కిరణ్ గుడ్డిమల్ల చంద్రయ్య జె ఏ సి నియోజకవర్గ ఉపాధ్యక్షులు పల్లాటి యాదయ్య ఎం ఎస్ పి నాయకులు కాళ్ల జంగయ్య తిప్పాయిగూడ మాజి సర్పంచ్ చివిరాల పాండు వీరేశం గౌడ్ వాస్పరి కుమార్ నూతనగంటి సైదులు తధితరులు పాల్గొన్నారు

## సంఘ సంస్కర్త బడుగుల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే 135 వర్ధంతి సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళి

**- మహాత్మ జ్యోతిబాపూలే కి భారతరత్న ప్రకటించాలి.**
**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 28:**
సంఘసంస్కర్త బడుగుల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే 135వ వర్ధంతి సందర్భంగా ఓయు లోని పులే అంబేద్కర్ స్టడీ సెంటర్లో ఆయన విగ్రహానికి ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ మహారాష్ట్రలో మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన జ్యోతిబాపూలే వర్ణ వ్యవస్థలో అణగారిన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలను స్వయంగా చూసి వారి ఎదుగుదలకు విద్య సరైన ఆయుధమని భావించి పాఠశాలలు నెలకొల్పారని,స్త్రీ విద్యను ప్రోత్సహించారని,బాల్య వివాహలను వ్యతిరేకించి,వితంతు పునర్వివాహానికి నాంది పలికారని అన్నారు.స్వయంగా పూలే అతని భార్య సావిత్రిబాయి పూలేకు పాఠాలు నేర్పించి పూణేలో అణగారిన వర్గాల బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పారని అన్ని వర్గాల వారికి విద్య,ఉపాధి,రాజకీయాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారని,సత్యశోధక్ సమాజ్ ఏర్పాటు చేసి అణగారిన,నిమ్న వర్గాల వారిని అక్కున చేసుకున్నారని,పూలే దంపతులు వారి జీవితాన్ని నిమ్న వర్గాల వారికే అంకితం చేశారని అన్నారు. జ్యోతిబాపూలే కి భారతరత్న ప్రకటించాలని లింగం గౌడ్ కేంద్ర ప్రభుత్వం ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంచాల సతీష్ తెలంగాణ స్టేట్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ వలిగొండ నరసింహ తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు రవికిరణ్ బండి నరేష్ ఎంఎస్ఎఫ్ కోఆర్డినేటర్ బుర్ర శాంతి కుమార్ బీసీ జేఏసీ కాంపాటి వెంకట్ హరీష్ దూడ వంశీ రామంజి బోనాల నరేష్ స్నేహితు తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ పార్టీ మంచాల మండలం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం

**- బీసీ రిజర్వేషన్ పై నమ్మించి బీసీల గొంతు కోసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి**
**- రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్**







**మంచాల వెలుతురు నవంబర్ 28:**
మంచాల మండలం కేంద్రంలో దం డేటి కార్ శర్వంజి ఫంక్షన్ హాలో మంచాల మండలం బి ఆర్ఎస్ పా ర్టీ మండల అధ్యక్షుడు చీరాల రమే ష్ ప్రధాన కార్యదర్శి బహుదూర్ నా యక్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎ న్నికల సన్నాహక సమావేశం నిర్వ హించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మె ల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి భువనగి రి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లే ష్ బిఆర్ ఎ స్ పార్టీ రాష్ట్ర నాయకు డు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి హాజరయ్యారు ఈసందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి క్యామ మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తాంఅని మాయ మాటలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలకు 17 శాతం రిజర్వేషన్ కల్పించి బీసీలను న మ్మించి గొంతు కోసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు వాగ్దానం చేసిన ఆరోగ్యా రంటీల సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది అన్నారు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలి అన్నారు మంచాల మండలంలోని టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో మన అభ్యర్థుల గె లుపు కోసం సైనికుల పనిచేసి గత పదేండ్ల పాలనలో మన ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు గడపగడ పకు వెళ్లి ప్రజలకు పూర్తిగా వివరించాలి మన అభ్యర్థుల గెలుపుకోసం అలుపెరుగని ప్రచారం చేసి అధిక స్థానాలు కైవసం చేసుకుని మంచాల మండలంలో టిఆర్ఎస్ పార్టీ సత్తాచాటాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పులచంద్రయ్యమా జీ వైస్ చైర్మన్ రవి మంచాల సహకారసంఘం మాజీ చైర్మన్.లు మొద్దు సికిందర్ రెడ్డి బుస్సు పుల్లారెడ్డి బి అర్ ఎస్ పార్టీ సీని యర్ నాయకు డు అండెం విష్ణువర్ధ న్ రెడ్డి మాజీ ఎంపీపీ జాటోత్ నర్మదా మాజీ ఎంపీటీసీలు నర్సింగ్ అనిత వెంకటేష్ గౌడ్ మైలారం మంజుల ప్రభాకర్ ముదిరాజ్ బిఆర్ఎస్ పార్టీ మంచాల మండలం యూత్ అధ్యక్షుడు బద్రీ నాథ్ గుప్తా మంచాల మండలం ఎస్సీసెల్ అధ్యక్షుడు నల్లప్రభాకర్ వివిధ గ్రామాల మాజీప్రజాప్రతి నిధులు వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీగ్రామశాఖ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు

## డాక్టర్ రాధా కుసుమకు డా.బి.ఆర్. అంబేద్కర్ జాతీయ జీవన సాఫల్య పురస్కారం

**వెలుతురు, రవీంద్రభారతి నవంబర్ 28 :**



దళితాభ్యుదయం కోసం పోరాడిన తొలి తెలుగు దళి త కవి, మధ్యపాన నిషేధం కోసం అ హర్నిశలు శ్రమించిన సంఘసంస్కర్త కుసుమ ధర్మన్న అని పలువురు వక్తలు అన్నారు. వేము సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ రజతోత్స వ సందర్భంగా సాహితీ సభ రవీం ద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై రాధా కుసుమకు పుర స్కారం ప్రదానం చేసి మాట్లాడారు. మాకొద్దీ నల్లదొర తనమంటూ నినదించిన ఉద్యమసారధి, సమానత కోసం జయభేరి మ్రోగించిన కవనధీరుడు,హరిజన శతకాన్ని రాసి కలంతో కుల వ్యవస్థ పునాదులు పెకలించిన కలం యో ధుడు కుసుమ ధర్మన్న అన్నారు. అటువంటి వైతాళికుని వారస త్వాన్ని అందిపుచ్చుకుని కుసుమ ధర్మన్న కళాపీఠాన్ని స్థాపించి సాహితీ సేవలు అందిస్తు న్న డా రాధా కుసుమకు అంబేద్కర్ జాతీయ జీవన సాఫల్య పురస్కా రం అభినందనీయమని అని కొని యాడారు. సంస్థ వ్యవస్థాపక అధ్య క్షులు వేము వందనం మాట్లాడు తూ డా రాధా కుసుమ కుసుమ ధర్మన్న కళాపీఠాన్ని స్థాపించి ఉభ య తెలుగు రాష్ట్రాల్లో క్రమం తప్ప కుండా ప్రముఖులకు కుసుమ ధర్మ న్న జాతీయ సాహితీ పురస్కారాన్ని అందిస్తున్నారని ఇప్పటివరకు ప్ర ముఖ సాహితీ వేత్తలైన మల్లె తీగ పత్రికా వ్యవస్థాపకులు కలిమిశ్రీ, ప్రముఖ సాహితీ వేత్తలైన నన్నయ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ గారు, ప్రముఖ కవి వాగ్గేయకారులైన గోరటి వెంకన్న, ప్రముఖ కవి సభా సామ్రాట్ డా బిక్కి కృష్ణ పురస్కారాలు అందించడం వారి సాహితీ సేవకు నిదర్శనమన్నారు. సహస్ర కవి సమ్మేళనాలను నిర్వహించి, శతాధిక సత్కారాలను సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్ర మంలో సాహిత్య అకాడమీ కార్య దర్శి బాలా చారి, కవి విమర్శకులు రామకృష్ణ చంద్రమౌళి, గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షుడు చంద్ర ప్రకాష్ రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ యుగంధర్ రెడ్డి , సీనియర్ జర్నలిస్ట్ శ్రీమాన్, ప్రజ్ఞా రాజు, ప్రముఖ కవి గంటా మనోహర్ రెడ్డి, బత్తిని మొగలయ్య, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బడే సాహెబ్, పాలడుగు కళాపీఠం అధ్యక్షులు సరోజినీ దేవి, పీవీపీ అంజనీ కుమారి కొనియాడారు.

## తపస్ నల్లగొండ మండల రూరల్ కమిటీ ఎన్నిక



అన్నెబోయిన శ్రీనివాస్



నిమ్మనగోటి రామకృష్ణ

**నల్లగొండ రూరల్ వెలుతురు నవంబర్ 28:**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నల్లగొండ మండల రూరల్ శాఖ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నెబోయిన శ్రీనివాస్, (దోమలపల్లి ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్), ప్రధాన కార్యదర్శిగా నిమ్మనగోటి రామకృష్ణ (నర్సింగ్ భట్ల ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్) ని ఎన్నుకున్నట్లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్ గౌడ్ తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన వారికి మండల శాఖ తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

## హెూంగార్డ్ ఉపేందర్ భార్యకు ఆర్థిక సాయం అందజేత



**రామన్నపేట వెలుతురు నవంబర్ 28:**
మీడియా మిత్రులకు తెలియజేయునది ఏమనగా! రామన్నపేట పోలీస్ స్టేషన్ లో పనిచేసే కూరెళ్ళ ఉపేందర్ హెచ్ జి -987 తేది 09.10.2025 రోజు తెల్లవారుజముల తానూ విదులు నిర్వహిస్తున్న సమయం లో లారీ కంటైనర్ %ఎ= 55~ూశ% 0565 డ్రైవర్ తన లారీ ని అజాగ్రత్తగా, నిర్లక్షం మరియు అతివేగంగా నడిపి హెూం గార్డ్ ఉపేందర్ ను డికోట్టడం తో ఆతను అక్కడికక్కడే చనిపోవడం జరిగింది. అట్టి విషయమై చౌటుప్పల్ డివిజన్ పరిదిలో పని చేసే సిబ్బంది (హెచ్ జి సిఐ) అందరు కలిసి తమకు తోచిన ఆర్దిక సహాయం చేయడం జరిగింది అట్టి మొత్తం 1,47,000/- లను పోస్టు ఆఫీసు రామన్నపేట నందు తన కూతురు అద్య శ్రీ పేరుమీద ఫిక్స్ డిపాజిట్ చేసినాము. ఇట్టి పాస్ బుక్ ను రామన్నపేట సీఐ ఉపేందర్ భార్య అయిన కూరెళ్ళ శోభ కి ఇవ్వడం జరిగింది. భవిష్యతు లో కూడా ఎలాంటి సహాయం కావాలన్నా ఉపేందర్ కుటుంబానికి ఆదుకుంటామని రామన్నపేట సీఐ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపినారు. ఇట్టి కార్యక్రమంలో రామన్నపేట సీఐ తో పాటు డి .నాగరాజు, ఎస్సై రామన్నపేట పిఎస్ , సిబ్బంది మల్లికార్జున్, రాంబాబు,వెంకటేశ్వర్లు, స్వామి, రమణ, హనుమంత రావు, రవి, నరసింహ, నాగరాజు, మరియు కవిత మరియు ఉపేందర్ కుటుంబ సభ్యులు లు పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్యమే ధ్యేయం.. కాంగ్రెస్ గెలుపే మన లక్ష్యం.

**- కాంగ్రెస్ సైనిక.**

**- యుద్ధానికి సిద్ధం కావాలిక.**



**రామన్నపేట వెలుతురు న్యూస్ నవంబర్ 28:**
కోమ్మాయిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు తెలియజేయునది ఏమనగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా నాయకులు మారేపల్లి మల్లారెడ్డి ఆదేశానుసారం, గ్రామశాఖ అధ్యక్షులు మోటే మారయ్య ఆధ్వర్యంలో శనివారం అనగా 29-11-2025 రోజున సాయంత్రం 06:00 గంటలకి వారి స్వగృహం నందు పార్టీ కార్యకర్తల సమావేశం ఉన్నది., ఇట్టి సమావేశం లో రానున్న స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డ్ సభ్యులని నిర్ణయించడం జరుగుతుంది.. కావున కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు మరియు ప్రతి ఒక్క కార్యకర్త హాజరై, స్థానిక ఎన్నికలో పకడ్బందీగా సైనికులు సిద్ధం కావాలని మనవి చేస్తూ, ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మారేపల్లి మల్లారెడ్డి విచ్చేయుచున్నారు..

## పల్లివాడ గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా.

**- కంభంపాటి శ్రీనివాసులు గౌడ్**

**- మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్**

**- రామన్నపేట టిఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి**

**రామన్నపేట వెలుతురు న్యూస్ నవంబర్ 28:**



పల్లివాడ గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా అని టిఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ పత్రికా ప్రకటనలో తెలిపినారు. నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆశీస్సులతో కెసిఆర్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ గ్రామంలో అందరినీ కలుపుకొని ఐక్యమత్యంగా గ్రామ అభివృద్ధి కోసం పనిచేస్తానని గత 30 సంవత్సరాల నుంచి గ్రామాన్ని మాత్రమే నమ్ముకుని గ్రామ ప్రజలే దేవుళ్ళు అనుకొని ఏ లాంటి వ్యాపారాలు లేకున్నా ఆర్థిక వనరులు లేకున్నా పార్టీ ని నమ్ముకుని పల్లివాడ గ్రామ ప్రజలే నా ఆత్మీయ బంధువులు అనుకొని ముందుకు సాగుతున్న ఒక్కసారి పల్లివాడ గ్రామ సర్పంచ్ గా అవకాశం కల్పించాలని గ్రామ ప్రజలను గ్రామ పెద్దలను నా అక్క చెల్లెలను అన్నదమ్ములను ఆత్మీయ బంధువులను మనస్పూర్తిగా కోరుకుంటూ పల్లివాడ గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇవ్వండి మీ ఆత్మీయ సోదరుడు కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ తెలిపినారు.

# కేంద్ర నిధులకోసమే పంచాయతీ ఎన్నికలు...!

**- బీజేపీ అభ్యర్థులను గెలిపించండి.**

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాస సత్యనారాయణ**



**కరీంనగర్ వెలుతురు నవంబర్ 28:**
కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకోసమే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాస సత్యనారాయణ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోటీ చేస్తున్న ఆశావహులతో బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా నగర్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అసలు పంచాయతీ ఎన్నికలు ఎందుకోసం జరుగుతున్నాయి,ఏం ఆశించి అభ్యర్థులను గెలిపించాలనే విషయాన్ని ప్రజలు గమనించాలని అన్నారు. ఊరు అభివృద్ధి కావాలంటే కావాల్సిన నిధులు ఇచ్చే సత్తా ఉన్న పార్టీ ఏది? ఆ నిధులను తెచ్చే సత్తా ఉన్న నాయకుడెవరనే విషయం గమనించాలని అన్నారు.ప్రజల తరపున నిరంతరం పోరాడుతున్న పార్టీ ఏది? ఊరు సమస్యలపై నిరంతరం కొట్లాడుతున్న నాయకుడెవరని ఒక్కసారి ప్రజలు ఆలోచించాలని అన్నారు. కేంద్ర నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయని, గ్రామాల అభివృద్ధి కోసం నిధులిస్తున్నది కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ప్రతి పనికి పైసలు ఇచ్చింది కేంద్రమేనని,ఇంట్లో పొయ్యి వెలిగించే ఉజ్వల గ్యాస్ కనెక్షన్, తినే రేషన్ బియ్యం నుండి బయటకు వెళితే రోడ్లు, వీధి లైట్లు సహా ఆ పనులన్నింటికీ నిదులిస్తున్నది కేంద్రమేనని అన్నారు.జాతీయ ఉపాధి హామీ పథకం కింద 100 రోజులు పని కల్పించి పైసలిస్తోంది కూడా మోదీ ప్రభుత్వమేనని అన్నారు. అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, కందకాల తవ్వకాలు,ఊరికి అవసరమైన అన్ని రకాల పనులకు కేంద్రం నుంచి వచ్చే ఉపాధి హామీ (నరేగా) నిధులే సహాయ పడుతున్నాయని పేర్కొన్నారు.ఎక్కడా లేని విధంగా బండి సంజయ్ ఎంపీ ల్యాడ్స్ నిధులతో కమ్యూనిటీ భవనాలు, సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లు, బోర్లు, డ్రైనేజీల నిర్మాణానికి వినియోగిస్తున్నారని తెలిపారు. ఊరు బాగు కోసం వ్యాపారులు, పారిశ్రామికవేత్తలను కలిసి సీఎస్సార్ నిధులను తీసుకొచ్చి మన పిల్లలు చదువుకునే ప్రభుత్వ స్కూళ్లలో, మనం వెళ్లే ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నారని తెలిపారు. టెన్త్ క్లాస్ విద్యార్థులకు 20 వేల బ్రాండెడ్ సైకిళ్లను అందించారని తెలిపారు. పదవ తరగతి చదివే విద్యార్థులకు,పరీక్ష ఫీజులను చెల్లించారని తెలిపారు. మోడీ గిఫ్ట్ పేరిట కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యాధునిక టెక్నాలజీతో వైద్య పరికరాలు అందించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా రూపాయి ఖర్చు చేసిందా అని ప్రశ్నించారు. ఊరిని బాగు చేయడానికి ఎమ్మెల్యేల కు సొంత నిధులు ఉన్నాయా అని ప్రశ్నించారు.గత ప్రభుత్వం లో పైసలు రాక సర్పంచులు పడ్డ బాధలు, ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు మనం చూస్తున్నామని అన్నారు.అందుకే బీజేపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు.జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర,బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి చాడ అనితా రెడ్డి, జిల్లా ఈసి మెంబర్ బూట్ల శ్రీనివాస్, బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్, బుర్ర శ్రీనివాస్, రామిడి మహేందర్ రెడ్డి, బండి స్వామి,ఉప్పునూటి సాగర్, జంగ సునీల్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# లంచాల మత్తులో ఏ ఈ ప్రదీప్....!?

**- కోర్టు లో కేసులా మాకు అనవసరం...!**

**- - కోర్టులతో మాకు పనిలేదు...!**

**- మా ఇష్టం మీరెవరు మమల్ని అడగటానికి...!**

**- మా అధికారులకు మొత్తం తెలుసు..!**

**- ఏంచేసుకుంటారో చేసుకోండి...!**

**- ప్రదీప్ లంచాల లీలపై దౌర్జన్యం పై అనేక పిర్యాదులు...!**

**- చర్యలు తీసుకొని జిల్లా అధికారులు**


**- విజిలెన్స్ లో పిర్యాదు చేసుకోపోతే ఏమైనా పీక్కోండి...!**

**- కోడేరు గ్రామ సెక్రటరీ పర్మిషన్ ఉందంటూ అబద్ధం...**

**- దొంగ కరెంట్ కు సైతం ప్రోత్సాహం...!**

**- డబ్బులిస్తే బలాధార్ అంటూ డిపార్ట్మెంట్ ను భ్రష్టు పట్టిస్తున్న వైనం...**





**కోడేరు వెలుతురు నవంబర్ 28, 2025:**
నాగర్ కర్నూల్ జిల్లా, కోడేరు మండలం, కోడేరు గ్రామ పరిధిలో ఇన్చార్జి ఏఈ గా నియామకమైన ప్రదీప్ లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. లంచం ఇస్తే చాలు కోర్టులో కేసులున్నా కరెంటు స్తంభాలకు వైర్లు తగిలించినా, కరెంటు దొంగతనం చేసిన ఏం చేసినా మనోడికి ముడుపులు ముడితే చాలు ఉన్నతాధికారులను సైతం మేనేజ్ చేస్తానంటూ ప్రగల్బాలు పలుకుతూ వింత ధోరణికి నాంది పలికాడు. ఈ అంశంపై కొందరు ప్రజాప్రతినిధులు నిలదీయగా మీరెవరు నాకు ఫోన్ చేసేందుకు అంటూ రెచ్చిపోవటం మనోడు స్టైల్. ఇదే అంశంపై ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు అందిన చర్యలకు నోచుకోకపోవడం ఇతగాడి ప్రవర్తనకు అధికారుల కొమ్ము కాయటం వల్లే ఈ పరిణామాలు అంటూ కుండ బద్దలు కొట్టినట్టుగా అర్థమవుతుంది. ఒక్కో మీటర్ బిగించేందుకు 5000 నుండి 10000 మామూలు వసూలు చేయడంలో మనవడు దిట్ట అంటూ పెద్ద కొత్తపల్లి మరియు కోడేరు మండలాల పరిధిలో ప్రతి ఒక్కరి నోట్లో నానడం విశేషం. మరి ఇంత పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగం జరుగుతుంటే ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండటం దేనికి నిదర్శనం అంటూ విమర్శలు వెలువెత్తుతున్నాయి. అదేవిధంగా కోర్టు ఆదేశాలను సైతం పక్కన పెట్టడం. ధిక్కరించటం కిందకి వర్తిస్తుంది కావున ఉన్నతాధికారులు సైతం కోర్టు ముందు దోషులుగా నిలబడక తప్పదని బాధితులు కోర్టును మరోసారి ఆశ్రయించారు. మరి ఈ పరిణామాలకు ప్రజలకు కరెంటును దోచుకోండి ఏ ఈ లకు లంచాలు ఇవ్వండి అని ఓ నినాదాన్ని బహిరంగంగా ప్రకటించినట్టుగా భావించాలని పరోక్షంగా తెలియజేస్తున్నట్టుగా ఉందని చెప్పకనే చెబుతున్నారు. మరి ఈ ప్రదీప్ పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా లేదా కోర్టు ముందు దోషులుగా నిలబడతారా అనేది వచ్చే వారం మరో కథనంలో చూద్దాం. పంచాయతీ సెక్రటరీ వివరణ కోర్టు ఆదేశాలు వచ్చినప్పటి నుండి నేను ఏ విధమైన పర్మిషన్ ఇవ్వలేదు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు అలా చెబితే నాకు సంబంధం లేదు అని అంటున్నారు.

## కాంగ్రెస్ కీలక నాయకుడు అల్లిపురం సురేష్ బీఆర్ఎస్ లో చేరిక




**జహీరాబాద్ వెలుతురు, నవంబర్ 28:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు అల్లిపురం సురేష్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు మరియు డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ గులాబీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల దిశగా బీఆర్ఎస్ పార్టీ బలపడటానికి గ్రామ స్థాయి నాయకుల చేరికలు ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే మాణిక్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేక మంది నాయకులు ప్రజాభిమానంతో బీఆర్ఎస్ వైపు వచ్చేందుకు సిద్ధమవుతున్నారని ఆయన చెప్పారు. చేరిక కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింలు, మాజి సర్పంచ్ కృష్ణ, మాజి ఎంపీటీసీ బాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్సింలు, మాజి వార్డ్ మెంబర్లు ఆడివయ్య, ప్రవీణ్, డైరెక్టర్ సాయిలు, బీఆర్ఎస్ నాయకులు తల్లారి రవికుమార్, ఆనందం, సురేష్, గోపాల్, మల్లేశం, అశోక్, యాదవులు తదితరులు పాల్గొన్నారు.


## కొత్తూరు "డి " గ్రామంలో బీఆర్ఎస్ కు ఎదురు దెబ్బ

**- భారీగా కాంగ్రెస్ లో చేరికలు...**

**జహీరాబాద్ వెలుతురు, నవంబర్ 28:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలం కొత్తూరు "డి" గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మల్లన్న పటేల్ మరియు ఇక్బాల్ పాషా ఆధ్వర్యంలో పలువురు నేతలు బిఆర్ఎస్ ని వీడి భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రంగయ్య తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పించుకుని పార్టీ లో చేరికను ప్రకటించారు. ప్రజల అభిరుచి కాంగ్రెస్ వైపు మళ్లుతుండటం సత్యమని, గ్రామ అభివృద్ధికి కాంగ్రెస్ పాలనలోనే స్థిరత్వం ఉంటుందని ఆయన ఈ సందర్భంలో తెలిపారు. రంగయ్యతో పాటు డిప్యూటీ సర్పంచ్ షఫీ, సంగమేష్ పటేల్, గౌసొద్దీన్, హుస్సేన్, మౌలానా తదితరులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరికలతో పార్టీ గ్రామస్థాయిలో మరింత బలపడిందని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



## నేటి నుండి మాణికనగర్ జాతర షురూ



**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 28 :**
సంగారెడ్డి జిల్లా :- మాణిక్ నగర్లో ఈనెల 29 నుండి దత్త జయంతి సందర్భంగా జాతర ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మాణిక్ ప్రభు ఆలయ కమిటీ బాధ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలోని మాణిక్ ఇ నగర్లో వెలసినమాణిక్ ప్రభు ఆలయంలో ఈనెల 29 నుంచి దత్త జయంతి మహెూత్సవాలను నిర్వహించనున్నారు. 29న తీర్థ స్నానం, యోగ దండముల పూజ, 30న గణపతిపూజ, చండీపాఠం, డిసెంబరు 1న శ్రీ ప్రభువుల 160వ పుణ్యతిథి, డిసెంబరు 2న శ్రీ ప్రభువుల వారి ద్వాదశి, డిసెంబరు 3న దక్షణ దర్బార్, గురుపూ, డిసెంబరు 4న ప్రభువుల వారి 208వ జయంతి, డిసెంబరు 5న ప్రభు దర్బార్తో పాటు ప్రభు జన్మోత్సవం, సంగీత కచేరి, కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. ఈ జాతర ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రంలోని సం గారెడ్డి, కామారెడ్డి, రంగారెడ్డి, మహబూబ్ నగర్, తదితర జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రతి రోజు మహా ప్రసాదం కూడా ఉంటుందని వారు తెలిపారు.

## జ్యోతిబాపూలే 135వ వర్ధంతి ని ఘనంగా నిర్వహించిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్




**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 28:**
శుక్రవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ చౌరస్తాలో ఉన్న జ్యోతిబాపూలే స్థూపం దగ్గర తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతిబాపూలే 135వ వర్ధంతి కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు శ్రీహరి రాములు మరియు ఇతరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్, రాజేంద్రప్రసాద్, జాకీ, ప్రియ రాజ్, పూర్ణచందర్, ఓం ప్రకాష్, ప్రదీప్ రెడ్డి, బాలకిషన్, జోసెఫ్, శేఖర్, పురుషోత్తం, సుజాత, అభిషేక్, ఆదర్శ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ వెలుతురు నవంబర్ 28**
కుత్బుల్లాపూర్ పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లి శివాలయం గుడి వద్ద ఆగం పాండు షాపూర్ నగర్, సంజయ్ గాంధీ నగర్ లో కూన సంజయ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ లిమాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ అయ్యప్ప స్వాములు భగవద్గీత పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో నేమూరి రాములు గౌడ్, సత్యనారాయణ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్ , చెన్నారెడ్డి , షాకీర్ , గార్లతో పాటు అయ్యప్ప స్వాములు , భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి: ఘన నివాళులు అర్పించిన ఎన్.ఎం.సి. బిఆర్ఎస్ పార్టీ నాయకుల



**కుత్బుల్లాపూర్ వెలుతురు నవంబర్ 28**
భారతదేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు విశేషంగా కృషి చేసి, సమసమాజ స్థాపనలో భావితరాలకు నిత్య స్ఫూర్తిగా నిలిచిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని పేర్కొన్నారు, వర్ధంతి సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంసి) పరిధిలోని బాచుపల్లి సాయి నగర్ లో మహాత్మా పూలే విగ్రహానికి నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్.ఎం.సి. బి.ఆర్.ఎస్. పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, నాయకులు సాంబశివరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ, మహాత్మా పూలే ఆశయాలను, ఆయన చూపిన బాటను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, అప్పుడే ఆయనకు సరైన నివాళులు అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జలగం చంద్రయ్య,రామ్ నరసయ్య, ఆంజనేయులు,కురుమూర్తి, నర్సింగ్, నాయకురాలు భారతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## నమ్మకానికి మారుపేరు అల్ట్రాటెక్ సిమెంట్




**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 28 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలోని బైపాస్ రోడ్ లో గల కార్తికేయ రెస్టారెంట్ లో ప్రముఖ సిమెంట్ కంపెనీ దిగ్గజం అల్ట్రాటెక్ కంపెనీ ఆధ్వర్యంలో హౌస్ ఓనర్స్ మీటింగ్ ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నికల్ మేనేజర్ పవన్,సేల్స్ ఆఫీసర్ శశి కిరణ్ రెడ్డిలు మాట్లాడుతూ దేశంలో సిమెంట్ అమ్మకాల్లో అల్ట్రాటెక్ కంపెనీ మొదటి స్థానంలో ఉందని ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ రోజు రోజుకు నూతన టెక్నాలజీతో నూతన ఒరవడి సృష్టిస్తుందన్నారు. కార్యక్రమంలో డీలర్లు సత్యం సేట్,అమర్ నారాయణఖేడ్ పట్టణ అల్ట్రాటెక్ కంపెనీ వినియోగదారులు పాల్గొన్నారు.



## భక్త మార్కండేయ ఆలయంలో గీతా శ్లోకాల పోటీలు

**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 28 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలో గీతా జయంతిని పురస్కరించుకొని వెంకటాపూర్ చౌరస్తాలో గల శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు గీతా శ్లోకాల కాంపిటీషన్, డ్రాయింగ్ కాంపిటీషన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. పై కార్యక్రమంలో నారాయణఖేడ్ పట్టణంలోని వివిధ ప్రభుత్వ,ప్రవేట్ శాలల విద్యార్థులు,మహిళలు,భక్తులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కమిటీ బాధ్యులు మాట్లాడుతూ భగవద్గీత మానవుని జీవన ప్రయాణానికి దిక్సూచని, ప్రతి ఒక్కరు భగవద్గీతను చదవడం అలవాటు



చేసుకోవాలని చెప్పారు. గీతా జయంతి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చంద్రమౌళీశ్వరుడి



కృపాకటాక్షాలు పొందగలరు.

## బిఆర్ఎస్ లోకి నాయకుల చేరికలు



**కొల్చారం వెలుతురు న్యూస్ నవంబర్ 28,**
మండల పరిధిలోని పైతర గ్రామానికి చెందిన పలువురు బిజెపి, కాంగ్రెస్ నాయకులు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత



లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. నర్సాపూర్ లోని ఎమ్మెల్యే నివాసగృహం వద్ద పైతర మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, వార్డు మెంబర్లు మల్లేశం, రామ్ చందర్, సీనియర్ నాయకులు మోహన్, నర్సింలు, నాగరాజులతో కలిసి సుమారు 20 మంది నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి శాలువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్, యువత అధ్యక్షుడు సంతోష్ రావు, యువ నాయకులు రవితేజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబర్పేట్ అలీ కేఫ్ చౌరస్తాలో జ్యోతిరావు పూలే కు నివాళులర్పించిన సిపిఎం నాయకులు



**బషీర్ బాగ్ వెలుతురు 28 నవంబర్ :**
అంబర్పేట్ అలీ కేఫ్ చౌరస్తాలో 135వ వర్ధంతి సందర్భంగా జ్యోతిరావు పూలే కు పూలమాలవేసి నివాళులర్పించిన అంబర్పేట్ సీనియర్ సిపిఎం నాయకులు మహేందర్ కార్యకర్తలు

## స్థానిక సమరానికి కాంగ్రెస్ సన్నాహక సమావేశం

**కొల్చారం, వెలుతురు న్యూస్ నవంబర్ 28:**
మండల కేంద్రమైన కొల్చారంలో బస్టాండ్ సమీపంలో గల దర్గా వద్ద కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్నికల సమరంలో పోటీ చేయనున్న నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఆయా గ్రామాలలో సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్ స్థానాలకు పోటీ చేయకూరు అభ్యర్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్





మాట్లాడుతూ రేవంత్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఉచిత కరెంటు, ఫ్రీ బస్, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలు, రైతు రుణమాఫీ, సన్నాలకు బోనస్, నూతన రేషన్ కార్డుల మంజూరి వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ధీమాగా ఓట్లు అడగాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎల్లు గారి శ్రీనివాసరెడ్డి, శేఖర్ రెడ్డి, అల్లు మల్లారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, గోవర్ధన్, మధుసూదన్ రెడ్డి, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి: కిషన్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్28( వెలుతురు):**
సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వచ్చే ఏడాదిలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి శుక్రవారం కేంద్రమంత్రి పరిశీలించారు. హైదరాబాద్‌లోని అన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది అందుబాటులోకి తెస్తామన్నారు. హైటెక్ సిటీతో పోటీపడే విధంగా అక్కడి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రూ.35 కోట్లతో రెండు విడతలుగా పనులు జరుతున్నాయని, వచ్చే ఫిబ్రవరిలోపు తొలి విడత పూర్తవుతాయన్నారు. సంక్రాంతి సందర్భంగా 16 ప్రత్యేక రైళ్లు ఇక్కడ ఆపుతామని పేర్కొన్నారు.

## డిస్కం దక్షిణలో ఉద్యోగుల పదోన్నతులు, పోస్టింగ్ల విషయాల్లో పారదర్శకంగా జరిగింది

- **అర్హులకే ప్రమోషన్లు వచ్చాయి, అక్రమాలు, లంచాల భాగోతాలు జరగలేదు**
- **ప్రత్యర్థి యూనియన్ సంస్థను అప్రతిష్ఠ పాలుసేందుకే విష ప్రచారం**
- **పైరవీలు, సూచించిన వారికి పోస్టింగులు దక్కలేదు. అదే అక్కసుతో సంస్థపై గుప్పిస్తున్న విష ప్రచారాన్ని ఖండించిన తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ 1535 యూనియన్ నాయకులు**



**బషీర్ బాగ్ వెలుతురు 28 నవంబర్ :**
విద్యుత్ శాఖ దక్షిణ డిస్కం ఉద్యోగుల పదోన్నతులు, పోస్టింగ్ విషయాల్లో యాజమాన్యం నిజాయితీగా, పారదర్శకంగా వ్యవహరించి అర్హులకే న్యాయం చేసిందని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 స్వాగతించింది. గత 14 ఏళ్ల తర్వాత పెండింగ్లో ఉన్న ప్రమోషన్ల ప్రక్రియను టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ముషార్ ఫారూఖీ సారథ్యంలో పాలకులు,డైరెక్టర్లు అన్ని కోణాలను పరిగణనలోకి తీసుకుని నిజాయితీగా. నిబంధనల ప్రకారమే 94 మంది ఉద్యోగులకు పదోన్నతులు కట్టబెట్టిందని యూనియన్ అధ్యక్షుడు కర్ణం ప్రమోద్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ 1535 కార్యాలయంలో అధ్యక్షుడు కె. ప్రమోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, వర్కింగ్ అధ్యక్షులు పులి కోటి, ఎన్.సాయికుమార్, ఉపాధ్యక్షులు సురేశ్రాజు, వసంత లక్ష్మీ, కోశాదికారి కె.లింగం స్వాతి, సాగర్,మల్లేష్ లతో కలసి విలేకరులతో మాట్లాడారు. చాన్నాళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పోస్టింగ్,పదోన్నతులను కట్టబెట్టినందుకు డిస్కం మేనేజ్మెంట్ కు ధన్యవాదాలు తెలిపారు.. పెండింగ్లో ఉన్న ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందని, ఇది గొప్ప కార్యమని, ప్రమోషన్లు పొందిన వారు సంతోషంగా ఉన్నారని, ఈ మేరకు డిస్కం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగాలకు పదోన్నతుల్లో అక్రమాలు, డబ్బుల భాగోతం జరిగిదంటూ ప్రత్యర్థి యూనియన్లు చేస్తున్న విష ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదని అధ్యక్షుడు కర్ణం ప్రమోద్ కుమార్ వారు గుప్పించిన ఆరోపణలు అన్ని కూడా అవాస్తవాలని కొట్టిపారేశారు. పైరవీలను పక్కనబెట్టినందుకు, సూచించిన వారికి పదోన్నతులు దక్కనందుకు కేవలం అక్కాసుతో దక్షిణ డిస్కం మేనేజ్మెంట్పై విష ప్రచారం చేసి విద్యుత్ సంస్థను అప్రతిష్ఠ చేస్తున్నారని, వారి అసత్య ప్రచారం వాస్తవం లేదని తీవ్రంగా ఖండించారు. ఫారూఖీ ముషారఫ్ సారథ్యంలో సంస్థ పాలనపరంగా అద్భుతంగా పనిచేస్తోందని, విధి నిర్వహణలో ఉద్యోగులకు భద్రతకు సంబంధించి పరికరాలు, సామగ్రిలు అందుబాటులో ఉన్నాయని వారు వివరించారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు మంజూరు, గంటల వ్యవధితో జరిగిపోతుందని, ప్రజలకు నిరంతర ప్రక్రియగా 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ అందించడంలో ఉన్నతాధికారులు పనితీరు, పర్యావేక్షణ భేష్ అని కితాబిచ్చారు.

## కాలోజి నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ ఉపకులాపతి డాక్టర్ పీవీ నంద కుమార్ రెడ్డి పై వస్తున్న ఆరోపణలను అవాస్తమని అయన ఖండించారు

**బషీర్ బాగ్ వెలుతురు 28 నవంబర్ :**
కార్యాలయంలో ఫర్నిచర్ ఎత్తుకెళ్లానని. డబ్బులు తీసుకొని మార్కులు వేస్తున్నారని వస్తున్న అసత్య ప్రచారాలను. కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ ఉపకులపతి డా.పివి నంద కుమార్ రెడ్డి ఖండించారు. వాస్తవాలు తెలుసుకొని రాయాలని.ఓ పత్రిక ( ఆంధ్రజ్యోతి)ని కోరారు. ఈ విషయంలో రాజకీయ ప్రయోజనాల కోసమే మాజీ మంత్రి హరీశ్ రావు కాళోజీ నారాయణరావు యూనివర్సిటీపై ఆరోపణలు చేస్తున్నారని... యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.పివి నంద కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ కోఠి డిఎంఈ ప్రాంగణంలోని విసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన



సమావేశంలో ఆయన జరిగిన వాస్తవాలను వెల్లడించారు. ఆధారాలు లేకుండా హరీష్ రావు ఆరోపణలు చేస్తున్నారని... గత బిఆర్ఎస్ హయాంలో జరిగిన తప్పిదాలని... కాంగ్రెస్ ప్రభుత్వం పై నెట్టడం సబబు కాదన్నారు. యూనివర్సిటీలో డబ్బులు తీసుకొని మార్కులు వేశామని అసత్య ప్రచారం చేస్తున్నారని. ఓ పిజి విద్యార్థిని (వికలాంగురాలు) సంబంధించిన ఆన్సర్ షీట్ ను కొట్టివేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆన్సర్లు కరెక్ట్ గా రాసినప్పటికి కొట్టివేయడంతో... ఆ విద్యార్థినికి మార్కులు వేశామని తెలిపారు. తాను వీసీగా కొనసాగడం కొంతమందికి ఇష్టం లేదని... అందుకే తాను కార్యాలయంలో ఫర్నిచర్ ను ఎత్తుకెళ్లానని దృష్ప్రచారం చేస్తున్నారన్నారు. తాను ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని... తనపై ఎలాంటి విచారణ వేసిన సిద్ధంగా ఉన్నానని వీసీ నందకుమార్ రెడ్డి తెలిపారు.

## అధికారాలను హరించేదిగా కేంద్ర విత్తన బిల్లు

● రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్,నవంబర్ 28( వెలుతురు):

రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు ఉందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. కేందప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన ముసాయిదా బిల్లుపై మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు.. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు-2025 రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. విత్తన ముసాయిదా బిల్లుపై సర్టిఫికేషన్ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రించాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విత్తన ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. జిల్లాల వారీగా రైతు సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారులు అభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశించారు. పంట నష్ట పరిహారం విషయంలో విత్తన ముసాయిదా బిల్లులో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన కేంద్ర ముసాయిదా విత్తన బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు గట్టిగానే తెలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

# తాగి వచ్చి నిత్యం వేధింపులు

- తట్టుకోలేక హత్య చేసిన భార్య

హైదరాబాద్,నవంబర్28( వెలుతురు):

రోజూ మద్యం తాగి వచ్చి వేధిస్తున్న భర్తను వదిలించుకునేందుకు అతడిని భార్య అంతమొందించింది. కుమారుడు, మరొకరితో కలిసి మెడకు టవల్ బిగించి హత్య చేసింది. ఈ ఘటన మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ దేవేందర్‌నగర్‌కు చెందిన బండారు అంజయ్య (55) ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్. అతనికి భార్య ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. నిత్యం మద్యం తాగివచ్చి భార్య, పిల్లలను వేధింపులకు గురి చేస్తున్నాడు. గురువారం రాత్రి భార్య బుగమ్మ, కుమారుడు రాజు, బంధువు శేఖర్‌తో కలిసి అంజయ్య మద్యం తాగారు. అర్ధరాత్రి భార్య, కుమారుడు, బంధువు కలిసి అంజయ్య మెడకు టవల్ బిగించి ఊపిరాడకుండా చేసి చంపేశారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన అంజయ్య కుమార్తెను గదిలో బంధించారు. జరిగిన విషయం కుమార్తె చెప్పడంతో పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోలవరం వద్ద ఐకానిక్ బ్రిడ్జి

- మంత్రులతో సిఎం చంద్రబాబు



అమరావతి,నవంబర్28( వెలుతురు):

పోలవరం వద్ద ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పోలవరం పూర్తికి వేగంగా పనులు సాగుతున్నాయని అన్నారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత.. వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. 2027 మే నాటికి పోలవరం పూర్తి చేయాలనేది లక్ష్యమని, గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజధాని రైతులు సంతృప్తికరంగా ఉన్నారని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేసేందుకు కేంద్రం సహకరిస్తోందని చెప్పారు. పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, పాడేరు వైద్య కళాశాలలు త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు.

# వెంటనే వరిధాన్యం సేకరించాలి

- కోత మిషన్లు అందుబాటులోకి తేవాలి


- కౌలురైతు సంఘం నేతల డిమాండ్

అమరావతి,నవంబర్28( వెలుతురు):

రైతుల నుంచి ధాన్యాన్ని వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. వరి పండే ప్రాంతాల్లో కోతలు చేపట్టేందుకు కోత మిషన్లు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరిగిన పెట్టుబడులు, మొంథా తుపాను కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ధాన్యాన్ని నూర్పిడి చేస్తే, 22 శాతం వరకూ తేమ ఉన్నందున ఇంకా ఆరబెట్టాలని రైతు సేవా కేంద్రం సిబ్బంది వెనక్కి పంపుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదన్నారు. ధాన్యంలో తేమ 22 శాతం ఉంటే మిల్లర్లతో మాట్లాడుకోవాలని, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు, కాటా కూలీ రైతే భరించాలని కొందరు సిబ్బంది ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంచులు కూడా అందుబాటులో లేవన్నారు. ఒకవైపు వాతావరణం, మరోవైపు ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడం వల్ల రైతులు తమ ధాన్యాన్ని తెగనమ్ముకోవాల్సి వస్తుందని వెల్లడించారు. దీంతో మిల్లర్లు రూ.1,770 చెల్లించాల్సిన బస్తాకు రూ.1,300 నుంచి రూ.1,400 మాత్రమే రైతులకు చెల్లిస్తున్నారని తెలిపారు. రైతులను దళారులు ఈ విధంగా దోపిడీ చేస్తున్నా అధికార యంత్రాంగం నిద్ర నటిస్తుందన్నారు. పర్యటనలు, ప్రకటనలు చేస్తే రైతాంగానికి ఊరట కలగదని, తేమ శాతం ఎక్కువగా ఉన్నా నిబంధనలు సడలించి కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నెల్లూరులో సిపిఎం కార్యకర్త దారుణ హత్య

నెల్లూరు,నవంబర్28( వెలుతురు):



నెల్లూరు పట్టణం వేదాయపాళెం సమీపంలో ఆర్ డి టీ కాలనీలో సిపిఎం కార్యకర్త, యువనాయకుడు, కళాకారుడు కె. పెంచలయ్యను కొంతమంది దుండగులు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. నెల్లూరు జనరల్ హాస్పిటల్ మార్చురీలో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉంచారు. సిపిఎం నాయకత్వం, కార్యకర్తలు నెల్లూరు జనరల్ హాస్పిటల్ కు పెద్ద ఎత్తున చేరుకొన్నారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు. పెంచలయ్య హత్యను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. అసాంఘిక గంజాయి గూండాల దాడిలో హత్యకు గురైన పెంచలయ్య మృతికి సంతాపం ప్రకటించారు. హత్య చేసిన గూండాలను పట్టుకుని కట్టినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేసారు. ఆ ప్రాంతంలో గంజాయి బారిన పడకుండా యువతను చైతన్య పరుస్తున్నందున ఓర్చుకోలేని గంజాయి వ్యాపారం చేస్తున్న ముఠా ఈ అఘాయిత్యానికి పాల్పడిందని పేర్కొన్నారు. ఇలాంటి ముఠాలను కఠినంగా అణచివేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

# అమరావతి పునర్నిర్మాణం సంతోషదాయకం

బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు ఉండటం అభినందనీయం అని నిర్మల అన్నారు.రాజధాని నిర్మాణంలో రైతుల త్యాగాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదు. బ్యాంకులన్నీ రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవటం బాధ్యత.

బ్యాంకులు కేవలం కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు ఇవ్వడానికే పరిమితం కావొద్దు. దానిని మించి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని సూచించారు. 25 కోట్ల మందిని ఇప్పటి వరకూ దేశంలో దారిద్ర్యరేఖ నుంచి బయటకు వచ్చారు. ధృతరగతి ఆస్పిరేషన్స్ కూడా పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి.రైతులు దేశానికి పౌష్టికాహారం అందిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి అరటి, తమిళనాడు నుంచి కొబ్బరి ఢిల్లీ , ముంబై లాంటి ప్రాంతాలకు రైళ్లలో తరలుతున్నాయి. అలాగే ఇతర పంటలకూ ఈ తరహా మార్కెటింగ్ సౌలభ్యాలు ఉంటే వారికి ఆర్థిక ప్రయోజనాలు అందుతాయన్నారు. రాయలసీమలో ఉన్న 9 జిల్లాల నుంచి ఉద్యాన ఉత్పత్తులు ఇతర రాష్ట్రాల మార్కెట్ లకు తరలించడానికి బ్యాంకులు సహకరించాలి.కేవలం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణం ద్వారా ఇది సరిపోదు. ప్యాకింగ్, కోల్డ్ చెయిన్ లాంటి పరిశ్రమల్ని కూడా ప్రోత్సహించాలని గుర్తుంచుకోండి. భవిష్యత్ ఆలోచనలు, సమీకృత ఐడియాలను బ్యాంకులు కలిగి ఉండాలి.గతంలో మహిళల్ని బీమా ఏజెంటుగా మార్చేందుకు మహిళా సఖి పేరిట కార్యక్రమం ప్రారంభిస్తే అద్భుత ప్రయోజనాలు వచ్చాయి.ఎప్పుడు ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడినా ప్రధాని మోదీ తక్షణం అమోదిస్తారు. విభజన తర్వాత ఇబ్బందులు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిగా సహకరించాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. క్వాంటం వ్యాలీ, ఏఐ ప్రాజెక్టుల కోసం జిల్లాల్లో ఏఐ శిక్షణ పొందేలా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. కేవలం ఐటీ గురించే కాదు ఆస్ట్రో ఫిజిక్స్ గురించి కూడా కేంద్రం ఆలోచిస్తోంది.. ఏపీ ప్రభుత్వంతో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ సంస్థ ఇవాళ ఒప్పందం చేసుకోవటం సంతోషకరం. ఏడాదిన్నరలో ఏపీ ఫ్యూచరిస్టిక్ కేపిటల్ నగరం అవుతుంది. అమరాతిలో కాస్మోస్ ఎ÷-లానెటోరియం నిర్మించాలని కోరుతున్నా. ఆచార్య నాగార్జునుడు లాంటి శాస్త్రీయ పరిశోధకులు నివసించిన ప్రాంతం ఇదని గుర్తు చేశారు.రేర్ ఎర్త్ మినరల్స్ పై కూడా కేంద్రం ఓ కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ రంగంలో కూడా ఏపీ పనిచేయాలని కోరుతున్నానని ఆమె అన్నారు.

## ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పనితీరు అద్భుతం

రూ.1,334 కోట్లతో బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేయడం సంతోషదాయకం. బ్యాంకులు, బీమా కంపెనీల ఏర్పాటుతో 6,556 మందికి ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. ఫైనాన్షియల్ డిస్టిక్ట్ పేరిట బ్యాంకులు, ఆర్థిక సంస్థల కోసం అమరావతిలో స్థలం కేటాయించాం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, కెనరాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడీబీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఆప్కాబ్, నాబార్డ్, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ లు వచ్చాయని అన్నారు. సంస్థలన్నీ తమ ప్రధాన కార్యాలయాలను అద్భుతంగా నిర్మించాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ప్రతీ ఇంట్లో మహిళలే ఆర్థిక మంత్రులు. మన దేశానికి కూడా మహిళా ఆర్థిక మంత్రే ఉన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంలో ఆమె అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు. దేశాన్ని ప్రధాన మంత్రి అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే...ఆర్థికమంత్రి ఆదేస్థాయిలో సహకరిస్తున్నారు. జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ పెరగటంతో పాటు సామాన్యులకూ లబ్ది కలిగిందని బాబు అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ సంస్థ ఓ కాస్మోస్ ప్లానెటోరియం నిర్మాణానికి ఒప్పందం జరిగింది. ప్లానెటోరియం ఏర్పాటు చేసేందుకు అమరావతిలో స్థలం కూడా కేటాయించాం. ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థ, గతంలో విభజన వల్ల జరిగిన నష్టాల నుంచి ఇప్పుడే గాడిన పడుతున్నాం. ఇంకా ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి సాధించగలం అన్న విశ్వాసం మాకు ఉంది. త్వరలోనే సీడ్ యాక్సెస్ రహదారి కూడా పూర్తి అవుతుంది. 2028 కల్లా నిర్మాణాలు పూర్తి అవుతాయి. 7 జాతీయ రహదారులు, రైల్వేలైన్లు అమరావతికి కనెక్టు అవుతాయి. అమరావతి పూర్తిగా గ్రీన్, బ్లూ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. భారతదేశం గర్వపడేలా అమరావతిని నిర్మాణం చేస్తాం. విట్,ఎస్ఆర్ఎం, బిట్స్ పిలానీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు అమరావతికి వచ్చాయి. క్వాంటం వ్యాలీలో క్వాంటం కంప్యూటర్ కూడా ఏర్పాటు చేయబోతున్నాం. ఫైనాన్షియల్ డిస్టిక్ట్ ద్వారా ఆర్థిక లావాదేవీలు పెద్ద ఎత్తున జరిగేలా ప్రణాళిక చేశాం. 2047కి భారత్ అగ్రస్థానంలో ఉంటుంది. అందులో ఏపీది కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఆశ వదులుకున్న పోలవరాన్ని మళ్లీ రీస్ట్రక్చర్ చేసేందుకు కేంద్రం సహకరించింది. రూ.400 కోట్లతో కట్టిన డయాఫ్రాం వాల్ ధ్వంసం అయితే మళ్లీ రూ.1,000 కోట్లు ఇచ్చి డయాఫ్రాం వాల్ నిర్మాణం చేసేందుకు నిధులిచ్చారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అలాగే 2028 నాటికి కూడా అమరావతి నిర్మాణాలు పూర్తి అవుతాయి. పరిశ్రమలు రాకుండా పారిపోయిన ఏపీకి మళ్లీ కూటమిపై భరోసాతో పెట్టుబడులు వస్తున్నాయి. రూ.1.37లక్షల కోట్ల పెట్టుబడులతో గూగుల్ విశాఖకు వస్తోంది. గోదావరి, కృష్ణా నదుల నుంచి వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో వృధాగా కలుస్తున్నాయి.పోలవరం నుంచి నల్లమల సాగర్ లింక్ ద్వారా నీళ్లు తీసుకెళ్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుంది. సముద్రంలోకి వెళ్లే మిగులు జలాలు వాడుకుని దేశసంపద పెంచేలా రాయలసీమకు నీళ్లు పారించాలని భావిస్తున్నాం అని వివరించారు. ఈ ప్రాజెక్టుకు నిధులు ఇచ్చి ఆదుకోవాలని ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దటంలో ఈ నీరు కీలకం అవుతుంది. ఆ ప్రాంతం అభివృద్ధి అవుతుంది. పూర్వోదయ ప్రాజెక్టు కింద ఉదారంగా నిధులు ఇస్తే రాయలసీమ, ఉత్తరాంధ్ర, మిగిలిన ప్రాంతాలు అభివృద్ధి అవుతాయి. కేంద్ర సహకారం వల్ల చాలా వరకూ రాష్ట్రం రికవర్ అవుతోంది. నిలదొక్కుకుని దేశప్రగతికి, సంపదకు బ్యాక్ బోన్ గా ఏపీ నిలబడుతుందని హామీ ఇస్తున్నాను. కేంద్ర సహకారంతో అమరావతి అన్ స్టాపబుల్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### రైతుల త్యాగం.. అమరావతి

దేవతల రాజధాని.. రైతుల త్యాగం.. అమరావతి అని మంత్రి నారా లోకేష్ అన్నారు. అమరావతిలో బ్యాంకుల కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం విధ్వంసం చేయాలని చూసిందని ఆరోపించారు. మూడు రాజధానులని చెప్పి ఒక్క ఇటుక కూడా వేయలేదని విమర్శించారు. ఒక్క వ్యక్తి నివాసానికి రూ.700 కోట్లు పెట్టి విశాఖలో ప్యాలెస్ కట్టారని ఎద్దేవా చేశారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా జై అమరావతి నినాదంతో ముందుకెళ్లామన్నారు. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని అని ఆనాడు పోరాటం చేశామన్నారు. జై అమరావతి అన్నందుకు రైతులపై కేసులు పెట్టారు అని తెలిపారు. 1631 రోజులు అమరావతి ఉద్యమం నడిచింది. 270 మంది రైతులు ప్రాణాలు కోల్పోవడం చూశాం. సుమారుగా 3 వేల మంది రైతులపై ఆనాడు కేసులు పెట్టారు. రాజధాని కోసం స్వచ్ఛందంగా రైతులు భూములు ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో అమరావతి పనులు వేగంగా సాగుతున్నాయి. స్త్రీ శక్తి అంటే నాకు గుర్తొచ్చే మొదటి వ్యక్తి నిర్మలా సీతారామన్. ఆమె పార్లమెంటులో ప్రతిపక్ష సభ్యులకు సరైన సమాధానం చెబుతారు. వరుసగా 8 కేంద్ర బడ్జెట్‌లు ప్రవేశపెట్టారు. ఆమె జీవితం మనకు ఒక పాఠం అని లోకేశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పనులు పునఃప్రారంభించి జెట్ స్పీడ్ లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సింప్లిసిటీకి హ్యాట్సాఫ్ మంగళగిరి చేనేత వస్త్రాలను ధరించి ప్రమోట్ చేసినందుకు ఆమెకు ధన్యవాదాలు. ఏపీ ఏ సాయం కోరినా ఆర్థిక మంత్రి సహకారం అందిస్తున్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వటంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ ను కూడా ఆదుకున్నారు. భారత్ లో అతిపెద్ద డేటా సెంటర్ గూగుల్ విశాఖకు వస్తోంది. దీనికి అండగా ఆమె నిలిచారు.15 బ్యాంకులు, బీమా కంపెనీలు రూ.1334 కోట్లతో తమ ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నాయి. రాజధానిలోన్ని÷నాన్షియల్ డిస్టిక్ట్ లోని బ్యాంక్ స్ట్రీట్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా లావాదేవీలకు ఈ కార్యాలయాలు పనిచేస్తాయని చెప్పుకొచ్చారు.

### అభివృద్ధి కనిపించేలా కూటమి కృషి

పరుగులు తీస్తున్న అభివృద్ధి ప్రజలందరికీ కనిపించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆర్థిక లావాదేవీల కేంద్రంగా అమరావతి ఫైనాన్షియల్ డిస్టిక్ట్ లో బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేయటం శుభసూచికం అన్నారు. బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఒకే చోట ఉండటం అరుదు. అది అమరావతి సాధించింది. ఈ కేంద్ర కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండటం ఆర్థికంగా అందరికీ ప్రయోజనం కూడా అని అన్నారు. రూ.1334 కోట్ల వ్యయంతో ఈ ప్రధాన కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయి. బ్యాంకులు వేస్తున్న ఈ పునాదులు అమరావతి ఆర్థిక భవిష్యత్ నిర్మాణానికి కీలకం. సీఎం చంద్రబాబుపై ఉన్న విశ్వాసంతో రైతులు రాజధాని కోసం భూములు ఇచ్చారని గుర్తు చేశారు. అమరావతి పునర్నిర్మాణం కోసం, పోలవరం కోసం, స్టీల్ ప్లాంట్ కోసం నిధులు ఇచ్చి సహకరించిన కేంద్రానికి ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్ ను అడుగడుగునా ఆదుకుంటున్న ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రికి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజధాని రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఈగిల్ భారీ ఆపరేషన్

- డ్రగ్స్ ముఠాలో 2వేలమంది పెడ్లర్లు

- 50మంది నైజీరియన్ల అరెస్‌తో కదులుతున్న డొంక

హైదరాబాద్,నవంబర్28( వెలుతురు):



డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ఈగల్ టీమ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీమ్, ఎన్‌సీబీ, ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. న్యూఢిల్లీలోని 20 ప్రాంతాల్లో.. గడువు తీరిన 50 మందికిపైగా నైజీరియన్లు ఉంటున్నట్లు గుర్తించింది. వారిని ఈ టీమ్ అదుపులోకి తీసుకుంది. నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నం తదితర నగరాల్లో ఈ డ్రగ్స్‌తో సంబంధాలు ఉన్న కీలక నిందితులను అరెస్ట్ చేసింది. నాలుగు ప్రాంతాల్లో 5,340 ఎక్స్ సిటీ మాత్రలు, 250 గ్రాముల కొకైన్, 109 గ్రాముల హెరాయిన్, 250 గ్రాముల మెథాంఫెటమైన్‌ను సీజ్ చేసింది. ఢిల్లీలోని 59 మ్యూల్ ఖాతాలతోపాటు 16 డ్రగ్స్ కేంద్రాలను గుర్తించింది. ఇక నైజీరియాకు చెందిన 107 బ్యాంకు ఖాతాలు ఈగల్ టీమ్ స్తంభింప జేసింది. మల్నాడు రెస్టారెంట్, మహీంద్రా యూనివర్సిటీ కేసులో నైజీరియన్ నిక్‌ను అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా ఈ ముఠాతో దాదాపు 2 వేలకు పైగా డ్రగ్స్ వినియోగదారులు,పెడ్లర్లు ఉన్నట్లు ఈగల్ టీం గుర్తించింది. ఢిల్లీ నుంచి డ్రగ్స్ పార్శిళ్లు.. బూట్లు, దుస్తులు, కాస్మోటిక్ వస్తువులు, చెప్పులు మధ్యలో డ్రగ్స్ పెట్టి కొరియర్ ద్వారా సప్లై చేసినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. శ్రీ మారుతి కొరియర్స్, డీటీడీసీ, ప్రొఫెషనల్ కొరియర్స్, షిప్ రాకెట్, ఇండియా పోస్ట్, ఢిల్లీ వేరీ, బ్లూ డార్ట్, ట్రాక్ ఆన్ తదితర కొరియర్స్ నెట్‌వర్క్‌ను ఈ నైజీరియన్ ముఠా ఉపయోగించినట్లు ఈ కేసు విచారణలో బహిర్గతమైంది. రికొద్ది రోజుల్లో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోల్‌కు ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ డ్రగ్స్ ఆపరేషన్‌ను ఛేదించింది. ఢిల్లీలో అరెస్ట్ చేసిన 50 మందిని హైదరాబాద్‌కు తరలించేందుకు ఈ టీమ్ ఇప్పటికే చర్యలు చేపట్టింది. వీరిని హైదరాబాద్‌కు తరలించిన తర్వాత కోర్టులో హాజరుపరచనుంది. అనంతరం వీరిని మరింత లోతుగా విచారణ జరపనుందని తెలుస్తోంది. ఈ విచారణలో మరిన్నీ కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని ఈగల్ టీమ్ భావిస్తోంది. ఈ విచారణలో వీరు చెప్పే కీలక ఆధారాలతో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశం ఉందని సమాచారం.

# సిసిఐ పత్తి కొనుగోళ్లలో నిర్లక్ష్యం

- అధికారుల తీరుకు నిరసనగా రైతుల ఆందోళన

నంద్యాల,నవంబర్28( వెలుతురు):

నంద్యాల జిల్లా కేంద్రంలోని మురారి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతుసంఘం నేతలు ఆరోపించారు. నాణ్యత ప్రమాణాల పేరుతో గత రెండు రోజుల నుండి పత్తి కొనుగోలు చేయకుండా రైతుల్ని ఇబ్బంది పెడుతున్నారు. దీంతో రైతులు ఆగ్రహించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిపిఎం పార్టీ నాయకులను కలిశారు. విషయం తెలుసుకున్న నాయకులు సీసీఐ కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఉదయం నుండి సీసీ ఐ అధికారులను బయటికి వెళ్ళనివ్వకుండా లోపలనే అడ్డగించి, ఎలాంటి షరతులు లేకుండా, కొనుగోలు కేంద్రానికి తెచ్చిన మొత్తం పత్తిని రైతుల నుండి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి, రమేష్ కు మార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి .రామచంద్రుడు, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు నరసింహ నాయక్, వి .బాల వెంకట్, పి.నరసింహ, కృష్ణ తదితరులు రైతులకు అండగా నిలబడి రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా టి.రమేష్ కుమార్, టి. రామచంద్రుడులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పత్తి కొనుగోలు కోసం పెట్టిన షరతుల వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతున్నదని, స్లాట్ బుకింగ్ పేరుతో పది రోజులు కాలయాపన జరిగిందని తీరా కొనుగోలు కేంద్రాలకు పత్తిని తెచ్చిన తర్వాత నాణ్యత పేరుతో అధికారులు వెహికల్స్ వెనక్కి తిప్పి పంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. సిసిఐ అధికారులు మధ్య దళారులు ఇచ్చే కమిషన్లకు ఆశపడి నాణ్యతగా ఉన్న పత్తిని కూడా బాగోలేదంటూ రిజెక్ట్ చేస్తుండడం దుర్మర్గమైనచర్యగా అభివర్ణించారు. సుదూర ప్రాంతాల నుంచి కొనుగోలు కేంద్రంకు వచ్చిన వెహికల్ బాడుగలు, భోజనం ఖర్చులు, లోడింగ్ అన్లోడింగ్ ఖర్చులు, వీటన్నిటితో పాటు స్లాబుల పేరుతో రేటులో మోసం ఫలితంగా రై తాంగం తీవ్రంగా నష్టాల పాలవుతున్నారన్నారు.కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు నిబంధనలను సడలించాలని, సిసిఐ పెట్టే నిబంధనలన్నింటిని




రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కేంద్రంతో మాట్లాడి రద్దు చేయించాలని, రైతాంగం పండించిన మొత్తం పత్తిని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని రైతు సేవ కేంద్రం ఉపయోగించుకొని స్లాట్ బుకింగ్ సమయంలోనే నాణ్యతను పరిశీలించి అక్కడే రైతులకు అర్థమయ్యేలా చెప్పి పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద కు పత్తి రైతులు తీసుకొని వెహికల్స్ వెళ్లాలా లేదా వంటి నిర్ణయాన్ని సిసిఐ అధికారులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. చాలా సమయం వరకు అధికారులు రైతులు పట్టు విడవకుండా సమస్య పరిష్కారం అయ్యేవరకు వెళ్లే ప్రసక్తి లేదని కూర్చోవడంతో చివరకు అధికారులు జోక్యం చేసుకొని వెంటనే కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. చివరకు అధికారులకు కూడా రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని వెంటనే సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, ఓర్వకల్, డోన్, క్రిష్ణగిరి మండలాల ప్రత్తి రైతులు ఉన్నారు.

# సమస్యలు పరిష్కరించని కాంగ్రెస్

- నగరంలో అధ్వాన్న రోడ్లను పట్టించుకోరా
- మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



హైదరాబాద్,నవంబర్28( వెలుతురు):
కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా ఏదైనా చిన్న సమస్యను కూడా పరిష్కరించలేదని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి నేత ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ అన్నారు. ఉప్పల్ హైదరాబాద్ రోడ్డును రెండేళ్లయినా బాగు చేయడంలో విఫలం అయ్యారని అన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం లో ఉండగా జాతీయ రహదారిని బాగు చేయాలన్న ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదన్నారు. గత రెండేళ్లుగా ఎందుకు దీనిపై అశ్రద్ధగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. నగరంలో అనేక రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎంతసేపు ఎలక్షన్లు కలెక్షన్లు అన్న రీతిలో పాలన సాగుతోందని ప్రభాకర్ మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల పేరుతో ఓట్ల కోసం ఆ పార్టీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్లపై వెనక్కి తగ్గినందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తమకు అన్యాయం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలు ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. హైదరాబాద్‌లో నాడు బీఆర్ఎస్ భూములు లాక్కున్నట్టే నేడు కాంగ్రెస్ పార్టీ లాక్కుట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న భూములను అప్పనంగా కొట్టేసే ప్రయత్నం సాగుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ భూ కుంభకోణాలకు హద్దు లేదు.. దీనికి మూల్యం చెల్లించక తప్పదంటూ హెచ్చరించారు. భూముల కోసమే జీహెచ్‌ఎంసీ పరిధి విస్తరించినట్లుగా ఉందని అన్నారు. వసతుల కల్పన లేకుండా పరిధి విస్తరిస్తే ఏం లాభమని అన్నారు.

# టిటిడి పరకామణి కేసు

- సిఐడి విచారణకు వైవి సుబ్బారెడ్డి హాజరు



విజయవాడ, నవంబర్28(వెలుతురు):
పరకామణి కేసులో సీఐడీ విచారణకు మాజీ టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం విజయవాడలోని సీఐడీ కార్యాలయానికి హాజరయ్యారు. వైవీ సుబ్బారెడ్డిని అడిషనల్ డీజీ రవి శంకర్ అయ్యన్నర్ విచారించారు. రెండు గంటల పాటు విచారణ సాగగా.. వైవీ సుబ్బారెడ్డి స్టేట్‌మెంట్‌ను సీఐడీ అధికారులు రికార్డ్ చేశారు. రెండు రోజుల క్రితం టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి, సీఎస్‌వో నరసింహ కిషోర్‌లను సీఐడీ ప్రశ్నించిన విషయం తెలిసిందే. తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి కేసు డాక్యుమెంట్లను సీఐడీ కార్యాలయానికి అధికారులు తెప్పించుకున్నారు. డిసెంబర్ 2వ తేదీలోపు ఏపీ హైకోర్ట్‌లో కేసు నివేదికను సమర్పించాల్సి ఉంది. దీంతో ఈ కేసుకు సంబంధించి సీఐడీ కసరత్తు ముమ్మరం చేసింది. కాగా.. విచారణ అనంతరం వైవీ మీడియాతో మాట్లాడుతూ.. పరకామణి విషయంలో తనను సీఐడీ ప్రశ్నించిందని.. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పానని తెలిపారు. తన హయాంలో దొంగతనం జరిగిందని అడిగారని అన్నారు. తన పిరియడ్ అయ్యాక ఇది బయట పడిందని ఆయన తెలిపారు. ఆరోజు ఈ విషయం ఎవరు దాచారో తనకు తెలియదని చెప్పుకొచ్చారు. ఈ విచారణను రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. టీటీడీ లడ్డూ, పరకామణి విషయంలో దోషులుగా చూడొద్దన్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేసి దోషులను శిక్షించాలని కోరారు. విచారణకు అన్నివిధాలా సహకారం అందిస్తామని సీఐడీ అధికారులకు చెప్పామని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

# అంబర్‌పేట ఎస్ఐ గన్ మిస్ కేసు

- కొనసాగుతున్న విచారణ



హైదరాబాద్, నవంబర్28(వెలుతురు):
అంబర్‌పేట్ ఎస్ఐ గన్ మిస్సింగ్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. గన్ మిస్సింగ్‌పై ఎస్ఐ భానుప్రకాష్ రెడ్డి పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ పెట్టానో గుర్తులేదు అంటూ సమాధానాలు ఇస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భాను ప్రకాష్ ఐదు నెలల క్రితమే గన్‌ను మిస్ చేశాడు. జర్నీలో ఎక్కడో బ్యాగ్ పోగొట్టుకున్నా అని చెబుతూ వచ్చాడు. అయితే గత ఐదు నెలల నుంచి గన్ మిస్ అయిన విషయాన్ని పై అధికారులకు చెప్పకుండా ఎస్ఐ దాచిపెట్టినట్లు తెలుస్తోంది. మరొక ఉద్యోగం రావడంతో ఏపీకి వెళ్లేందుకు ఎన్వోసీని ఎస్ఐ అడుగగా.. సర్వీస్ రివాల్వర్ ఇవ్వాలని వారు సూచించారు. దీంతో అసలు బండారం బయటపడింది. ఎస్ఐ భానుప్రకాష్ తన గన్‌ను మిస్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో అంబర్‌పేట్ పోలీసులు ఇన్వెస్టిగేషన్ కొనసాగుతోంది.రోవైపు పోలీసు శాఖకు మచ్చ తెచ్చే విధంగా ఎస్ఐ ప్రవర్తించినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లను ఆపాల్సిన ఎస్ఐ.. విపరీతంగా బెట్టింగ్‌లు ఆడి లక్షలు పోగొట్టుకున్నట్లు సమాచారం. అంతే కాకుండా బెట్టింగ్ కోసం ఏకంగా తన పొలాన్నే అమ్ముకున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కడప జిల్లాలో ఉన్న రాయచోటిలో పొలాలను ఎస్ఐ అమ్ముకున్నాడు. దాదాపు రూ.96 లక్షలకు పైగా డబ్బులను ట్రాన్సాక్షన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.


# సర్‌తో అంతం కాదు..ఆరంభం

- ముమ్ముందు అన్నీ తొలగిస్తారు: అఖిలేశ్

లక్నో,నవంబర్28( వెలుతురు):
ఎన్నికల సంఘం చేపడుతోన్న ఎస్ఐఆర్ ప్రజలను వలసపాలనలో కంటే దారుణమైన స్థితిలోకి నెడుతుందని సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్‌యాదవ్ శుక్రవారం వ్యాఖ్యానించారు. ఇది దేశ ప్రజలకు వ్యతిరేకంగా పెద్ద కుట్ర అని అన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని మోసం చేయడమేనని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నేడు ఓట్లకు కోత పెడుతున్నారు. రేపు భూమి రికార్డులు, రేషన్ కార్డులు, కులధ్రువీకరణపత్రాలు, రిజర్వేషన్లు, అనంతరం మధ్యతరగతి ప్రజల బ్యాంక్ ఖాతాలు, లాకర్ల నుండి కూడా వారి పేర్లు తొలగించబడతాయని అన్నారు. ఇది దేశ ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతోన్న పెద్ద కుట్ర అని, దీంతో వలసపాలనలో కన్నా దారుణమైన పరిస్థితికి దారితీస్తుందని అన్నారు. మనమంతా మేల్కొని ప్రతి ఓటును రక్షించుకోవాల్సిన సమయమని ప్రతిపక్షపార్టీలకు సూచించారు. ఎస్ఐఆర్ కింద జరుగుతున్న మోసాన్ని ఆపాలని పౌరులకు విజ్ఞప్తి చేశారు.

# బెదరింపులకు ఆధునిక భారత్ లొంగదు

- మన రక్షణ కవచం సుదర్శన చక్రం
- ఉడిపి పర్యటనలో ప్రధాని మోడీ




బెంగళూరు,నవంబర్28( వెలుతురు):
ఆధునిక భారత్ ఎలాంటి బెదిరింపులకు తలొగ్గదని, పౌరుల రక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. కర్ణాటక పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. శుక్రవారం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొని గీతా పారాయణం చేశారు. అనంతరం భక్తులు, గాయకులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. గతంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వాలు ఏమీ చేయకుండా చూస్తుండిపోయాయి. కానీ, నయా భారత్ అలా కాదు. ఎవరి ముందు తలవంచదు. దేశ రక్షణ విషయంలో ఎన్నటికీ వెనుకడుగు వేయదు. ఆపరేషన్ సిందూర్‌లో మన సంకల్పాన్ని ప్రపంచం చూసింది. మన మిషన్ సుదర్శన చక్ర.. శత్రువులను నాశనం చేస్తుందని మోదీ వెల్లడించారు. శ్రీకృష్ణుడి స్ఫూర్తితో దేశానికి సుదర్శన చక్ర భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గతంలో ప్రధాని తెలిపిన సంగతి తెలిసిందే. రాబోయే పదేళ్లలో దేశంలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా పూర్తిస్థాయి సురక్షా కవచం ఏర్పాటు చేయడమే ఈ మిషన్ ఉద్దేశం. గీతలో శ్రీకృష్ణుడి బోధనలు ప్రతి యుగానికి సంబంధించినవి. మన జాతీయ విధానాన్ని అవి నిర్దేశిస్తాయి. ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని కృష్ణుడు బోధించాడు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్', 'సర్వజన్ హితయ' అనే నినాదాలు గీత నుంచి స్ఫూర్తి పొందినవే. మహిళల రక్షణపై శ్రీ కృష్ణుడి సందేశమే.. రిజర్వేషన్ల చట్టానికి మార్గనిర్దేశనం అన్నారు.. శాంతి, సత్యాన్ని సాధించడం కోసం అవసరమైతే దురాగతాలకు పాల్పడే వారిని అణచివేయాలని గీత మనకు బోధిస్తుందని మోదీ తెలిపారు.అంతకుముందు ఉడుపిలో మోదీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం కృష్ణ ఆలయానికి చేరుకున్న ప్రధానికి పుతిగే మఠాధిపతి సుగుణెళింద్ర తీర్థుల ఆధ్వర్యంలో అష్ట మఠాధిపతులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కనకన కిండి నుంచి శ్రీకృష్ణుడి మూలవిరాట్‌ను మోదీ దర్శించుకున్నారు. అనంతరం లక్ష కంఠ భగవద్గీత పారాయణంలో ప్రధాని పాల్గొన్నారు. గీతలోని 10 శ్లోకాలను ఆయన అలవోకగా పఠించారు. ఈ సందర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. మోదీ అర్జునుడంటూ కొనియాడారు. ప్రధాని సేవలను ప్రశంసిస్తూ.. 'భారత భాగ్య విధాత' అనే బిరుదును ప్రదానం చేశారు.

# ఇమ్రాన్ మరణంపై పుకార్లు

- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- జైలుకు అనుమతించకపోవడంపై హకోర్టులో పిటిషన్లు



ఇస్లామాబాద్,నవంబర్28( వెలుతురు):
పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మరణ పుకార్ల వేళ ఆయన సోదరి అలీమా ఖాన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జైల్లో ఉన్న తన సోదరుడు ఇమ్రాన్ ఖాన్‌ను కలవడానికి అనుమతి నిరాకరించడంతో అడియాలా జైలు సూపరింటెండెంట్, ఇతరులపై ఇస్లామాబాద్ హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. రావల్పిండిలోని అడియాలా జైల్లో ఇమ్రాన్ ఖాన్‌ను వారానికి రెండుసార్లు కలిసేందుకు మార్చి 24న కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఆమె న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి మంగళ, గురువారాల్లో కలిసేందుకు అనుమతి ఇవ్వాలని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇప్పటినప్పటికీ జైలు అధికారులు వాటిని పాటించడం లేదని పేర్కొన్నారు. తన సోదరుడి శ్రేయస్సు, అతని చట్టపరమైన హక్కులు, జైల్లో అతని పట్ల అమానవీయంగా వ్యవహరించడం గురించి తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. న్యాయస్థానం ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా అమలు చేయకపోవడంతోనే కోర్టు ధిక్కార చర్యలను కోరినట్లు ఆమె పిటిషన్‌లో స్పష్టం చేశారు. వెంటనే తన సోదరుడిని కలిసేందుకు అనుమతించేలా అడియాలా జైలు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అధికార దుర్వినియోగం, అవినీతి కేసుల్లో 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉన్న ఇమ్రాన్ ఖాన్ కొన్ని వారాల నుంచి బయటికి కనిపించడం లేదు. భద్రతా కారణాలు చెబుతూ జైలు అధికారులు అతని కుటుంబీకులను కూడా కలవనివ్వడం లేదు. దీంతో ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లో చంపేశారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్ ముగ్గురు సోదరీమణులు అలీమా ఖాన్, నోరీన్ నియాజీ, డాక్టర్ ఉజ్మా ఖాన్‌తో పాటు పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పిటిఐ) మద్దతుదారులు అతన్ని కలవడానికి చాలాసార్లు ప్రయత్నించారు. కానీ జైలు అధికారులు ఒక నెలకు పైగా అనుమతిని నిరాకరిస్తూ వస్తున్నారు. చివరకు ఖైబర్-పఖ్తున్ఖ్వా ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది కూడా జైల్లో ఇమ్రాన్‌ను కలవడానికి ప్రయత్నించినా అనుమతి ఇవ్వలేదు. దీంతో ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళనలు పెరిగిపోయి పీటీఐ కార్యకర్తలు రోడ్డు ఎక్కడంతో పాక్‌లో ఉద్రిక్తతలు చెలరేగాయి. ఈ క్రమంలో ఇమ్రాన్ ఖాన్ చనిపోలేదంటూ అతడి మరణ పుకార్లను అడియాలా జైలు అధికారులు తీవ్రంగా ఖండించారు. అతడు ఆరోగ్యం ఉన్నారని వివరణ ఇచ్చారు. డిసెంబర్ 2వ తేదీన కుటుంబ సభ్యులను ఇమ్రాన్ కలిసేందుకు అనుమతి ఇస్తామని తెలిపారు. అయినప్పటికీ ఇమ్రాన్ మరణ పుకార్లు పాకిస్తాన్ను కుదిపేస్తున్నాయి. తమ నాయకుడిని చూపించాలని డిమాండ్ చేస్తూ పీటీఐ మద్దతుదారులు అడియాలా జైలు దగ్గరకు భారీగా చేరుకుంటుండటంతో జైలు పరిసరాలు హై టెన్షన్ నెలకొంది. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఇమ్రాన్ ఖాన్ ఉన్న జైలు వెలుపల దాదాపు 700 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు.

# బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

- 42శాతం రిజర్వేషన్ల పేరుతో మోసం
- కామారెడ్డి డిక్లరేషన్ తుంగలో తొక్కిన అధికార పార్టీ
- బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ విమర్శ



హనుమకొండ,నవంబర్28( వెలుతురు):
బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. ఓట్ల కోసం ఆ పార్టీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లపై వెనక్కి తగ్గినందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన డిమాండ్ చేశారు. తమకు అన్యాయం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలు కత్తులు నూరుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామాల్లో పూర్తి వ్యతిరేకత ఉందని.. ఇక, భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు గెలిచే అవకాశమే లేదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం నిధులతోనే జరుగుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి జరగాలంటే భాజపాతోనే సాధ్యం. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం సరిగా చేయలేదు. కుల ధ్రువీకరణ పత్రం కోసం సర్వర్లు పని చేయక అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కింది. బీసీ రిజర్వేషన్లపై డ్రామాలాడింది. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ ఈటల తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులకు గుర్తులు ఉండవని.. గెలిచిన వారిని కాంగ్రెస్ నుంచి గెలిచారని చెప్పుకుందామని భావిస్తున్నారేమో అంటూ సందేహం వ్యక్తం చేశారు. కానీ కాంగ్రెస్ చేసిన మోసానికి బీసీలు కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని...హామీ ఇచ్చేటప్పుడు తెలియదా? అంటూ అధికార పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. బీసీల జనాభా ఎంతో తేల్చకుండా రిజర్వేషన్లు ఎలా చేస్తారంటూ కాంగ్రెస్ సర్కారును ఆయన సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నాడు బీఆర్ఎస్ భూములు లాక్కున్నట్టే నేడు కాంగ్రెస్ పార్టీ లాక్కుట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ భూ కుంభకోణాల కు హద్దు లేదు.. దీనికి మూల్యం చెల్లించక తప్పదంటూ ఎంపీ ఈటల హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోనే అధిక భూములు లాక్కుంటున్నారంటూ సోదాహరణగా వివరించారు. భూముల కోసమే జీహెచ్‌ఎంసీ పరిధి విస్తరించినట్లు అయితే.. దాని కంటే దరిద్రం ఇంకోటి లేదని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# రాజధాని కోసం మరో 16వేల ఎకరాలు

- ల్ఆయండ్ పూలింగ్‌లో చేపట్టడానికి సిద్ధం
- ఎపి కేబినేట్ భేటీలో నిర్ణయం
- రైతుల అనుమతితోనే సేకరిస్తామన్న మంత్రి నారాయణ



అమరావతి,నవంబర్28( వెలుతురు):
చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి ప్రాంతంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ చేపట్టాలని రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదం తెలిపింది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినేట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వివిధ అవసరాలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ దశలో మరో16 వేల ఎకరాల సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన పక్రియపై ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. మొదటి దశలో ప్రభుత్వ భూమి16 వేల ఎకరాలు సీఆర్డీఏకు ప్రభుత్వం అప్పగించింది. రాజధాని అమరావతి కోసం మొత్తం 50 వేల ఎకరాలు రైతుల నుంచి భూ సమీకరణ చేపట్టాలని ప్రభుత్వం భావించింది. మొదటి దశలో రైతుల నుంచి 34 వేల ఎకరాల సమీకరణ.. రెండో దశలో మరో 16 వేల ఎకరాలపై కసరత్తు చేస్తోంది. త్వరలో ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను సీఆర్డీఏ విడుదల చేయనుంది. మొత్తం ప్రభుత్వ భూమి, రైతుల వద్ద నుంచి తీసుకున్న భూమితో కలిపి 74 వేల ఎకరాలలో రాజధాని నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టనుంది. రెండో విడత భూ సమీకరణకు సంబంధించి 7 గ్రామాల్లో భూ సేకరణ చేయనుంది. వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు, ఎంద్రాయిలో 2,166 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, వడ్డమానులో 1,913 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాల భూ సమీకరణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ అసైన్డ్ భూములతో కలిపి మొత్తం 20, 494 ఎకరాల భూ సేకరణ ద్వారా సీఆర్డీఏ తీసుకోనుంది. రాజధాని విస్తరణలో భాగంగానే మలిదశ భూ సమీకరణ చేపడుతున్నామని మంత్రి నారాయణ తెలిపారు. కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వే స్టేషన్, స్పోర్ట్స్ సిటీ, విమానాశ్రయం, స్మార్ట్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్‌కు 16,666 ఎకరాలు సమీకరిస్తున్నట్టు చెప్పారు. ఒలింపిక్స్ నిర్వహించే స్థాయిలో అంతర్జాతీయ క్రీడానగరం నిర్మిస్తామని తెలిపారు. రైతుల అంగీకారంతోనే భూ సమీకరణ చేస్తామని స్పష్టం చేశారు. 5వేల ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించనున్నట్లు వివరించారు. గతంలో ఇచ్చిన ప్రయోజనాలనే రైతులకు అందిస్తామని అన్నారు. కొండప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూమి కూడా తీసుకుంటామన్నారు. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తామన్నారు. అమరావతి రైతుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్టు నారాయణ తెలిపారు.

## ఐటిలో విదేశాల్లో ఆస్తులను లెక్కచూపని వారెందరో

**- వారి జాబితాను రెడీ చేసిన ఐటి శాఖ**

**- త్వరలనే నోటీసులు ఇచ్చేందుకు రెడీ**




**న్యూఢిల్లీ,నవంబర్28( వెలుతురు):**

విదేశాల్లో ఆస్తులను కలిగివున్న వారు అలాంటి వాటి వివరాలను ఐటీ రిటర్నుల్లో వెల్లడించని వారిపై ఆదాయ పన్ను మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. 2025-26 ఏడాదికి గాను వ్యక్తిగతంగా ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసిన వారిలో తమకు విదేశాల్లోవున్న ఆస్తులను వెల్లడించని వారిని గుర్తించినట్టు వెల్లడించింది. ఇందుకు సంబంధించి 25 వేల మందికి ఈ-మెయిల్ లేదా ఎస్ఎంఎస్ రూపంలో హెచ్చరికలు పంపనున్నట్లు తెలిపింది. విదేశాల్లోని ఆస్తులను ఐటీ రిటర్నుల్లో వెల్లడించని వారికి ఈ నెల 28 నుంచి ఎస్ఎంస్, ఈ-మెయిల్ ద్వారా సమాచారం ఇవ్వనున్నట్టు ఐటీ శాఖ ప్రకటించింది. ఈ జాబితాలో ఉన్నవారు తమ ఐటీఆర్ని సవరించి డిసెంబర్ 31లోగా తిరిగి సమర్పించాల్సి వుంటుందని సూచించింది. అప్పటిలోగా చేయకపోతే చట్ట పరమైన చర్యలు ఎదుర్కొవాల్సి వుంటుందని హెచ్చరించింది. ఇందుకోసం ఐటీ శాఖ పెద్ద సంస్థలను కూడా సంప్రదించి వారి ఉద్యోగుల జాబితాను సేకరించింది. గత ఆర్థిక సంవత్సరం 2024-25 లో 24, 678 మంది తమ ఐటీ రిటర్నులను సవరించి తిరిగి దాఖలు చేశారు. వీరి విదేశీ ఆస్తులు రూ. 29,208 కోట్లుగా ఉన్నాయి. కాగా, తుది గడువు లోపు విదేశీ ఆస్తులను ప్రకటించని వారు నల్లధన నిరోధక చట్టం ప్రకారం, రూ. 10 లక్షల జరిమానా, 30 శాతం పన్ను, చెల్లించాల్సిన పన్నులో 300 శాతం వరకు అదనపు జరిమానాను ఎదుర్కోవాల్సి రావచ్చు.

## రెండ్రోజుల లాభాలకు బ్రేక్

**- స్వల్ప నష్టాలతో ముగిసిన సూచీలు**

**న్యూఢిల్లీ,నవంబర్28( వెలుతురు):**

గత రెండ్రోజుల్లో భారీగా లాభపడిన దేశీయ సూచీలు శుక్రవారం నేల చూపులు చూశాయి. విదేశీ మదుపర్లు 1, 225 కోట్ల రూపాయల విలువైన షేర్లను అమ్మేయడం నెగిటివ్ ప్రభావాన్ని చూపించింది. అలాగే క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, గరిష్టాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణ సూచీలను వెనక్కి లాగింది. దీంతో ఈ రోజు సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాలతో రోజును ముగించాయి. గత సెషన్ ముగింపు (85, 720)తో పోల్చుకుంటే శుక్రవారం ఉదయం దాదాపు 50 పాయింట్ల లాభంతో మొదలైన ఉదయమంతా లాభనష్టాలతో దోబూచులాడింది. అయితే చివరి గంటల్లో అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టాల బాట పట్టింది. చివరకు సెన్సెక్స్ 13 పాయింట్ల నష్టంతో 85, 706 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 12 పాయింట్ల నష్టంతో 26, 202 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఎస్ఆర్ఎఫ్, వరుణ్ బేవరేజెస్, లారస్ ల్యాబ్స్, హిందుస్థాన్ జింక్, కల్యాణ్ జువెల్లర్స్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. గెయిల్ ఎమ్‌సీఎక్స్ ఇండియా, ఏంజెల్ వన్, ఆస్ట్రాల్ లిమిటెడ్, ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ మొదలైన షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 69 పాయింట్ల నష్టంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 15 పాయింట్లు లాభపడింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 89.46గా ఉంది.

## సిసిఐ నిబంధనల మార్పు

**- రాష్ట్ర విజ్ఞప్తిపై స్పందించని కేంద్రం**




**గుంటూరు,నవంబర్28( వెలుతురు):**

పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన నిబంధనలు సడలించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఇప్పటి వరకు సానుకూల స్పందన రాలేదు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో రైతులకు సంబంధించి అనేక విజ్ఞప్తులు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఈ ఏడాది మార్చిలోనే మిర్చి రైతులకు సాయం అందిస్తామని చెప్పిన కేంద్రం ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదు. ధరలు తగ్గి ఒక్కో రైతు సగటున రూ.లక్ష వరకు నష్టపోయారు. కానీ, ఇటీవల గుంటూరు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాత్రం రాష్ట్రంలో మిర్చి రైతులను ఆదుకున్నామని గొప్పగా ప్రకటించారు. తాజాగా, రాష్ట్రంలో 11 మార్కెట్ కమిటీల పరిధిలో 64 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను సిసిఐ ప్రారంభించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలో 5.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. దాదాపు ఎనిమిది లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. సిసిఐ ద్వారా ఇప్పటి వరకు నాలుగు వేల మంది రైతుల నుంచి 90 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. వర్షాలకు దెబ్బతిన్న పత్తిని కొనుగోలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, సిసిఐ నిబంధనల సడలింపునకు కేంద్రంతో చర్చలు వేగవంతం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న యాప్ విధానం మార్చాలని, 12 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయాలని కోరామని మంత్రి ప్రకటించినా ఇప్పటి వరకు కేంద్రం నుంచి స్పందన లేదు.

## సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నాం

**- జనవరి 1న ఆయుధాలు వదిలి వస్తాం**

**- ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖ**



**రాయపూర్,నవంబర్28( వెలుతురు):**

మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర- మధ్యప్రదేశ్- ఛత్తీస్‌గఢ్ ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖను విడుదల చేశారు. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు బదులుగా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు. మిగతావారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామన్నారు. ఆయుధాలు అప్పగించి ప్రభుత్వ పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని కోరారు. జనజీవన స్రవంతిలో కలిసేందుకు తమకు కొంత సమయం కావాలని గతవారం మావోయిస్టులు లేఖ రాసిన సంగతి తెలిసిందే.

# యంగ్ ఇండియా స్కూల్స్ కాదు..

**- పురుగలన్నం లేకుండా కాపాడండి**

**- ఎక్స్ వేదికగా హరీష్ రావు డిమాండ్**

**హైదరాబాద్,నవంబర్ 28( వెలుతురు):**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకుంటూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా నాణ్యమైన ఆహారం అందించలేని పరిస్థితి నెలకొన్నదని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పురుగులతో కూడిన అన్నం అందించిన ఘటనను గుర్తుచేస్తూ, ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పురుగులు లేని అన్నం పెట్టండని సీఎం రేవంత్ రెడ్డిని హరీష్ రావు ప్రశ్నించారు. సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నిసార్లు సమీక్షలు జరిపారో, విద్యార్థులకు కల్తీ ఆహారం పెడుతున్న వారిపై ఇప్పటిదాకా ఎన్ని చర్యలు తీసుకున్నారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామని అన్న మాటలు ఎక్కడికి పోయాయి? మీ మాటలకు విలువ లేదు, ఆచరణలో దిక్కులేదని హరీష్




రావు విమర్శించారు. పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేస్తూ, బడిలో చదువుకోవాల్సిన విద్యార్థులే రోడ్ల మీదకు వచ్చి 'పురుగులన్నం మాకు వద్దు' అని నిలదీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్కాంలతోనే నిండిపోయిందని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టలేదని హరీష్ రావు ఆరోపించారు. కొమరం భీం ఆసిఫాబాద్ ఘటనపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## ప్రేమించిన యువతికి మరో యువకుడితో వివాహం

**ఆత్మహత్య చేసుకున్న ప్రేమికుడు**

**నిజామాబాద్,నవంబర్ 28( వెలుతురు):**

ప్రేమించి మోసపోయానని గ్రహించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. నిజామాబాద్ జిల్లా దొంచందకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి.. ఏరుగట్లకు చెందిన ఓ యువతితో ఆరేళ్లుగా ప్రేమలో పడ్డారు. ఇరువురు ఎంతో అన్యోన్యంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీకాంత్‌రెడ్డి తాను ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకునేందుకు లండన్ నుంచి నిజామాబాద్ వచ్చారు. అయితే.. సదరు యువతి తల్లిదండ్రులు ఆమెకు మరో యువకుడితో పెళ్లి జరిపించారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్‌రెడ్డి పురుగుల మందు తాగి



ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శ్రీకాంత్‌రెడ్డి మృతిచెందారు. ఈ ఘటనతో శ్రీకాంత్ కుటుంబం.. నిజామాబాద్ పట్టణంలో మృతదేహంతో ఆందోళనకు దిగింది. ఇంతలో పోలీసులు వీరి ఆందోళనను అడ్డుకున్నారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. శ్రీకాంత్‌రెడ్డి మృతిపై నిజామాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని అతడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

## జోగుగూడెంలో సర్పంచ్ పదవికి వేలం

**- 20లక్షలకు దక్కించుకున్న వ్యక్తి**

**- ఆంజనేయ ఆలయానికి వినియోగిస్తామని వెల్లడి**

**ఖమ్మం,నవంబర్28( వెలుతురు):**

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సర్పంచి పదవి దక్కించుకోవడం కోసం పలువురు నేతలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. పలు చోట్ల వేలం పాటలు సాగుతున్నాయి. గ్రామపంచా యితీ అభివృద్ధి కోసం అంటూ గ్రామ పెద్దలు ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ క్రమంలోనే పలు చోట్ల ఆ పదవిని బహిరంగ వేలం వేస్తున్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం జోగుగూడెం పంచాయతీ సర్పంచి పదవికి బహిరంగ వేలం వేశారు. వేలంలో ఏడుగురు అభ్యర్థులు పోటీపడగా.. వారిలో అత్యధికంగా ఒకరు రూ.20 లక్షలకు సర్పంచి పదవిని దక్కించుకున్నారు. గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయం నిర్మాణా నికి వేలంలో వచ్చిన నగదు ఖర్చు చేయనున్నట్టు గ్రామస్థులు తెలిపారు. పూర్తిగా గిరిజన గ్రామమైన జోగుగూడెంలో 1350 మంది జనాభా ఉండగా. 800 మంది ఓటర్లు ఉన్నారు. రెండో దశలో ఈగ్రామంలో పోలింగ్ జరగనుంది. ఈనెల 30 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. సర్పంచి పదవికి వేలం పాట అనంతరం గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు.

## అయ్యప్ప భక్తులకు శుభవార్త

**- ఇరుముడితో ప్రయాణానికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ అనుమతి**

**న్యూఢిల్లీ,నవంబర్28( వెలుతురు):**

అయ్యప్ప స్వామి భక్తులకు ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శుభవార్త తెలిపింది. శబరిమలకు వెళ్లే మాలధారులు విమానాల్లో 'ఇరుముడి' తో ప్రయాణించొచ్చని తాజాగా వెల్లడించింది. విమానంలో కొబ్బరికాయలను స్వాములు తమ వెంట తీసుకెళ్లొచ్చని చెప్పింది. అయ్యప్ప స్వాముల నుంచి వచ్చిన వినతుల మేరకు, వారి సౌకర్యార్థం నిబంధనలను సడలించామని ఏఏఐ పేర్కొంది. ఈ నిబంధన అక్టోబర్ 28 శుక్రవారం నుంచి అమల్లోకి వస్తుందని ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఈ నిబంధనల సడలింపు అనేది వచ్చే ఏడాది జనవరి 20 వరకు అమలులో ఉంటుందని తెలిపింది. అయ్యప్ప స్వాముల ప్రయాణం సాఫీగా, సేఫ్‌గా జరగడానికి కొబ్బరికాయలను క్యాబిన్?లోకి తీసుకెళ్లే ముందు ఎక్స్ రే, ఎక్స్‌ఎ÷-లోజివ్ ట్రేస్ డిటెక్షన్ (ఈటీడీ), భౌతిక తనిఖీలు ఉంటాయని పేర్కొంది.

# ఢిల్లీ పేలుడు కేసులో ఎన్ఐఎ దర్యాప్తు ముమ్మరం

**- అల్-ఫలా విశ్వవిద్యాలయానికి డాక్టర్ షాహిన్**

**- సీన్ రిక్రియేషన్‌తో మూలాలు గుర్తిచే యత్నం**

**న్యూఢిల్లీ,నవంబర్28( వెలుతురు):**

ఢిల్లీ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ దర్యాప్తు ముమ్మరం గా సాగుతోంది. అన్ని కోణాల్లో దర్యాప్తును విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహిన్ ను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సీన్ రీక్రియేషన్ కోసం నిందితులతో సంబంధమున్న అల్-ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లారు. ఫరీదాబాద్ మాడ్యూల్ తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు డాక్టర్ షాహిన్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. తామంతా కలిసి దాదాపు రెండేళ్ల నుంచి అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు ఆమె అంగీకరించింది. వీటిని ఉపయోగించి పాక్‌కు చెందిన జైషే ఉగ్ర సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిపింది. గురువారం విచారణలో భాగంగా డాక్టర్ షాహిన్ తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. అల్-ఫలా యూనివర్సిటీ సమీపంలోని మతపరమైన ప్రదేశంలో వారి వివాహం జరిగినట్లు తెలిపాడన్నారు. ఉగ్రకుట్ర దర్యాప్తులో భాగంగా ఈ కేసులో అరెస్టు చేసిన ఏడుగురు నిందితులను లఖ్‌నవూ, కాన్పూర్, సహరన్‌పూర్, ఫరీదాబాద్, జమ్మూకశ్మీర్‌లకు తీసుకువెళ్లనున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు షాహిన్ ఆన్‌లైన్ కోర్సులు




ప్రారంభించినట్లు నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించడంతో అల్-ఫలాలోని ఇతర మహిళా వైద్యులను కూడా ఆమె ప్రభావితం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. యూనివర్సిటీలో ఎవరైనా ఉగ్ర మద్దతుదారులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని.. వారిని గుర్తించడానికి నిఘా వర్గాలు పని చేస్తున్నాయన్నారు. అల్-ఫలాలో దర్యాప్తు తర్వాత తదుపరి విచారణ కోసం షాహిన్‌ను లఖ్‌నవూ, కాన్పూర్‌లకు తీసుకువెళ్లనున్నారు. అనుమానితులకు ఆయా ప్రదేశాల్లోని వ్యక్తులతో ఉన్న పరిచయాలు, ఎవరెవరు వారికి సహకరించారు అనే విషయాలను తెలుసుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఉగ్ర నెట్‌వర్క్‌తో మరికొందరు వైద్యులకు కూడా సంబంధాలు ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఉగ్ర మాడ్యూల్ ఆసుపత్రులు, క్లినిక్‌ల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోందని.. సహాయం కోసం విద్యావంతులైన వ్యక్తులను నియమించుకుంటున్నట్లు గుర్తించామన్నారు.

# థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసల నిషేధం

**- అధ్యక్షుడు ట్రంప్ మరో కీలక ప్రకటన**

**వాషింగ్టన్,నవంబర్28( వెలుతురు):**

అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పుల ఘటన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పేద దేశాల నుంచి అగ్రరాజ్యానికి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తామని ప్రకటించారు. దీనిపై ఇప్పటికే అమెరికా యంత్రాంగం చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. మరోవైపు, వలసదారులకు అన్నిరకాల ప్రభుత్వ సబ్సిడీలు, ఫెడరల్ బెనిఫిట్స్‌ను కూడా నిలివేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అమెరికా సాంకేతికంగా ముందుకెళు న్నప్పటికీ.. మన ఇమిగ్రేషన్ విధానం ఆ ప్రయోజనాలను, చాలామంది జీవన పరిస్థితులను దెబ్బతీస్తోంది. అందుకే.. అమెరికా వ్యవస్థ పూర్తిగా కోలుకునేందుకు వీలుగా.. థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. జో బైడెన్ ఆటోపెన్‌తో సంతకం చేసిన లక్షల మంది అక్రమ అడ్మిషన్లను రద్దు చేయనున్నట్లు తెలిపారు. అమెరికాకు ఆస్తి కాని లేదా మన దేశాన్ని ప్రేమించని వ్యక్తులను ఇక్కడి నుంచి పంపించేస్తాం. అమెరికాయేతర



పౌరులందరికీ ఫెడరల్ ప్రయోజనాలు, సబ్సిడీలను నిలిపివేస్తాం అని అన్నారు. దేశ ప్రశాంతతకు భంగం కలిగించే, మన భద్రతకు ముప్పుగా మారే వారిని బహిష్కరిస్తాం. తిరోగమన వలస విధానంతోనే ఈ లక్ష్యాలను సాధించగలం అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. శ్వేత సౌధానికి రెండు బ్లాకుల దూరంలో బుధవారం మధ్యాహ్నం అమెరికా కాలమానం ప్రకారం కాల్పులు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నేషనల్ గార్డ్‌కు చెందిన ఓ సభ్యురాలు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు గాయపడ్డారు. నిందితుడిని అఫ్గాన్‌కు చెందిన రెహ్మనుల్లా లకన్‌వాల్‌గా గుర్తించారు. సీఐఏ మద్దతు ఉన్న అఫ్గాన్ ప్రత్యేక సైనిక విభాగంలో అతడు కొన్నాళ్లు పనిచేసి అమెరికాకు వలస వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ వలసలపై తాజా నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు.. అఫ్గాన్‌తో సహా మరో 18 దేశాలకు చెందిన గ్రీన్ కార్డ్ హోల్డర్స్‌ను అధికారులు సమీక్షించనున్నారు. పేద, అభివృద్ధి అంతగా లేని దేశాలను థర్డ్ వరల్డ్ కంట్రీస్‌గా పిలిచేవారు. దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని అనేక దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం వీటిని తక్కువ ఆదాయం కలిగిన దేశాలుగా పేర్కొంటున్నారు. దక్షిణ సూడాన్, సోమాలియా, నైగర్, బుర్కినా ఫాసో, బురుండి, అఎ÷-గానిస్థాన్, మడగాస్కర్, ఇథియోపియా, లైబీరియా, పాకిస్థాన్, సిరియా, ఉగాండా వంటి దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. దీంతో ఇప్పటికే అక్కడ నివాసం ఉంటున్న వారిని వెనక్కి పంపడం ఖాయమని తెలుస్తోంది

https://epaper.velthuru.com

# వెలుతురు

cinema


# స్పిరిట్ షూట్‌లో ప్రభాస్ బిజీ



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్' షూటింగ్ మొదలైంది. స్పిరిట్' కోసం రంగంలోకి దిగారు కథానాయకుడు ప్రభాస్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ముస్తాబవుతున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. ఇటీవలే లాంఛనంగా మొదలైన ఈ సినిమా హైదరాబాద్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. దీనికోసం ప్రభాస్ గురువారం సెట్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం ఆయనపై ఓ భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో ఈ షూట్ నిర్విరామంగా కొనసాగనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా భారీ హంగులతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. ప్రభాస్ ఇందులో శక్తిమంతమైన ఐపీఎస్ అధికారిగా సరికొత్త లుక్‌తో కనువిందు చేయనున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. హీరో ప్రభాస్ శుక్రవారం నుంచి నేరుగా 'స్పిరిట్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు. ప్రభాస్ తన షెడ్యూల్‌లో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లో తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేయనున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత, చిత్ర బృందం న్యూ ఇయర్ విరామం తీసుకోనుంది. కొత్త సంవత్సరం ప్రారంభంలోనే 'స్పిరిట్' చిత్ర యూనిట్ అంతా విదేశాలకు పయనం కానుంది. సినిమా రెండో షెడ్యూల్ వచ్చే ఏడాది ప్రారంభంలో మెక్సికోలో మొదలుకానుంది. మెక్సికోలో చిత్రీకరించే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తనదైన మార్కుతో ఈ చిత్రాన్ని ఎలా రూపొందిస్తారనే దానిపై ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.


# భారీ అంచనాల మధ్య 5న వస్తోన్న దురంధర్

బాహుబలి, పుష్ప2 లాంటి భారీ సినిమాల దెబ్బకి బాలీవుడ్ కూడా పూర్తిగా మారిపోయింది. ఇప్పటి దాకా లవ్ రొమాంటిక్ ఎంటర్ టైనర్స్ తో ఆకట్టుకున్న రణవీర్ సింగ్ కూడా ఇప్పుడు భారీ యాక్షన్ వైపు టర్న్ తీసుకుని,'ధురంధర్'అనే మాస్ యాక్షన్ థ్రిల్లర్ తో వస్తున్నాడు. రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ కాంబినేషన్ లో డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వస్తోంది దురంధర్. ట్రూ ఇన్సిడెంట్స్ ఆధారంగా రూపొందించబడిన ఈ సినిమాను 'ఉరి' దర్శకుడు ఆదిత్య ధర్ 250 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కించాడు. ఇప్పటి కే రిలీజ్ అయిన ట్రయిలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంది. బి-టౌన్‌లో ఇప్పుడు పెద్ద చర్చ నడుస్తోంది. ఈ సినిమా మేజర్ మోహిత్ శర్మ బయోపిక్ అని రూమర్స్ రావడంతో దర్శకుడు క్లారిటీ ఇస్తూ 'మోహిత్ శర్మ త్యాగం గొప్పది కానీ దానికి దురంధర్‌కి సంబంధం లేదు. టైమ్ వచ్చాక ఆయన బయోపిక్‌ను గొప్పగా చేస్తాం అని అన్నారు. ఇదిలా ఉండగా ఈ సినిమా 3 గంటల 32 నిమిషాల రన్‌టైమ్ తో వస్తోంది. దాంతో దురంధర్ కూడా ఇండియా లాంగెస్ట్ రన్‌టైమ్ మూవీస్ లిస్ట్‌లోకి ఎంటర్ అవుతుంది. పాన్ ఇండియా వేవ్‌లో భాగంగా ఆర్ఆర్ఆర్, పుష్ప 2, కల్కి, బాహుబలి ఎపిక్ లాంటి సినిమాలు లాంగ్ రన్‌టైమ్ తోనే రిలీజ్ అయ్యాయి. పాన్ వరల్డ్ హైప్ తో వచ్చి ఘన విజయం సాధించాయి కూడా. ఈ నేపథ్యంలో బాలీవుడ్ కూడా ఆ రూట్లో అడుగు వేస్తోందా అనే చర్చ బలంగా వినిపిస్తుంది.




# వారణాసిలో చిన్నప్పటి మహేశ్‌గా దర్శన్

దర్శక దిగ్గజం రాజామౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు నటిస్తున్న భారీ చిత్రం వారణాసి. ఈ పాన్ వరల్డ్ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన 'రుద్ర' గ్లిమ్స్ కు భారీ స్పందన లభించింది. ప్రస్తుతం హైదరాబాద్ లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో షూట్ జరుగుతోంది. ఈ షెడ్యూల్ లో మహేశ్ చిన్నప్పటి సన్నివేశాలు తీస్తున్నారు. అయితే మహేశ్ చిన్నప్పటి రోల్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొడుకు భార్గవ్ నటిస్తున్నాడని రెండు రోజుల నుండి సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేశాయి. ఈ విషయమై వారణాసి టీమ్ ను సంప్రదించగా అసలు అటువంటిది ఏమి లేదని తేల్చి చెప్పారు. ఎన్టీఆర్ కొడుకు నటిస్తున్నాడనేది పక్కా ఫేక్ న్యూస్. ఇక్కడే మరో ఆసక్తికర విషయం తెలిసింది. సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు ప్రిన్స్ మహేశ్ బాబు బావ హీరో సుధీర్ బాబు కుమారుడు దర్శన్ నటిస్తున్నాడు. అందుకు సంబంధించి షూట్ కూడా చేస్తున్నారు. సుధీర్ బాబు చిన్న కొడుకు దర్శన్ ఆల్రెడీ అడివి శేష్ గూఢచారి, మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా కనిపించాడు. దర్శన్ నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. అలాగే హను రాఘవపూడి డైరెక్షన్ లో వస్తున్న ఫౌజీలోను ప్రభాస్ చిన్నప్పటి రోల్ లో దర్శన్ నటించబోతున్నాడు.




# మీ అభిమానాలే నన్నునిలబెట్టాయి: నవీన్

టాలీవుడ్‌లో తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో నవీన్ పోలిశెట్టి మళ్లీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధమయ్యాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో కెరీర్‌కు బ్రేక్ రాగా, ఆ తర్వాత వచ్చిన 'జాతిరత్నాలు'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఇటీవల అనుష్కతో చేసిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' కూడా మంచి విజయం సాధించడంతో ఆయన స్టార్ ఇమేజ్ మరింత పెరిగింది. ఇప్పుడీ క్రమంలో తన నాలుగో సినిమాగా 'అనగనగా ఒక రాజు'ని తెరపైకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నాడు. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించిన కొద్ది రోజులకే జరిగిన ప్రమాదం నవీన్ కెరీర్‌కు పెద్ద బ్రేక్ ఇచ్చింది. చేతికి, వెన్నెముకకు తీవ్ర గాయాలవడంతో దాదాపు ఏడాది పాటు షూటింగ్‌కు దూరమయ్యాడు. దీర్ఘ విరామం తరువాత ఈ సినిమాను పూర్తిచేసిన నవీన్ ఇప్పుడు సంక్రాంతి 2026 కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ 'అనగనగా ఒక రాజు' ఫస్ట్ సాంగ్‌ను విడుదల చేశారు. నాది సైలెంట్ బ్యాచ్ కాదు.. అల్లరి చేసే బ్యాచ్. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అది మీ అందరి సపోర్ట్ వల్లే. ఏజెంట్ ఆత్రేయ, జాతిరత్నాలు, మిస్ శెట్టి సినిమాలను మీరు ఎంత ప్రేమించారో తెలుసు. ఈ సినిమాను కూడా అదే ప్రేమతో ఆదరిస్తారని నమ్మకం ఉందన్నాడు. ఈ సినిమాలో పాట పాడాను, డ్యాన్స్ చేశాను? ఈ సారి పండగకి మీ ముందుకు రానున్నాను' అని అన్నారు. నవీన్ భావోద్వేగ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు 'అనగనగా ఒక రాజు'పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రమాదాన్ని జయించి, ప్రేక్షకుల ముందుకు వస్తున్న నవీన్ ప్రయాణం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



# రివాల్వార్ రీటాగా వచ్చిన కీర్తి సురేశ్

ఓ వైపు కథానాయికగా కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య చిత్రాలతోనూ జోరు చూపించే ప్రయత్నం చేస్తోంది కీర్తి సురేశ్. ఇప్పుడామె నుంచి వచ్చిన యాక్షన్ సినిమా 'రివాల్వర్ రీటా'. పాండిచ్చేరిని అడ్డాగా చేసుకుని ఓ నేర సామ్రాజ్యాన్ని సృష్టిస్తాడు డాన్ డ్రాకులా పాండ్యన్ (సూపర్ సుబ్బరాయన్). అతన్ని ఎలాగైనా హత్య చేసి తన సోదరుడి చావుకు ప్రతీకారం తీర్చుకోవాలని నర్సింహారెడ్డి (అజయ్ ఘోష్) ఓ ముఠాతో రూ.5 కోట్లకి ఒప్పందం కుదుర్చుకుంటాడు. దీనిలో భాగంగా పాండ్యన్‌ను హనీట్రాప్ చేసి చంపేందుకు ప్రణాళిక రచించగా.. అతను డ్రగ్స్ మత్తులో ఓ ఇంటికి వెళ్లబోయి పొరపాటున పక్క వీధిలో ఉన్న రీటా (కీర్తి సురేశ్) ఇంటికి వెళ్తాడు. అక్కడ అనుకోకుండా జరిగిన గొడవలో రీటా తల్లి (రాధికా శరత్ కుమార్) కొట్టిన దెబ్బకు పాండ్యన్ అక్కడిక్కడే ప్రాణాలు విడుస్తాడు. మరి ఆ తర్వాత ఏమైంది? డ్రాకులా పాండ్యన్ హత్య వల్ల రీటా కుటుంబం ఎలాంటి చిక్కుల్లో పడింది? పాండ్యన్‌ను హత్య చేసి రూ.5కోట్లు కొట్టేయాలనుకున్న మార్టిన్ ముఠా వల్ల రీటాకి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? తన తండ్రి జాడ వెతుక్కుంటూ వేట మొదలు పెట్టిన బాబీ పాండ్యన్ (సునీల్)కి రీటా కుటుంబం చేసిన పని గురించి తెలిసిందా? లేదా? అన్నది చిత్ర కథ. ఇది పగ, ప్రతీకారాలతో ముడిపడి ఉన్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్. కర్మ ఎవరినీ విడిచి పెట్టదు.. దాని ఫలితాన్ని అనుభవించక తప్పదనే కోణంలో సాగుతుంది. కథానాయిక కుటుంబంలో జరిగిన ఓ అన్యాయానికి కాలం కర్మ రూపంలో ఎలా బదులు తీర్చుకునే అవకాశమిచ్చిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది. లైన్‌గా చూసినప్పుడు ఈ కథ ఆసక్తిరేకెత్తించేలాగే ఉన్నా.. దాన్ని తెరపై ఆవిష్కరించిన విధానం ఏమాత్రం మెప్పించదు. ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌లో ఇటు నవ్వులు.. అటు థ్రిల్ ఏదీ సరిగ్గా పండలేదు. కథా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ సినిమాను మొదలు పెట్టిన దర్శకుడు.. డ్రాకులా పాండ్యన్ ప్రాణాలు కోల్పోవడంతో కీలక మలుపు తిప్పాడు. ఇక అక్కడి నుంచి ఇంట్లో శవాన్ని మాయం చేసేందుకు ఇటు రీటా కుటుంబం పడే పాట్లు.. అటు ఆ శవాన్ని దక్కించుకునేందుకు మార్టిన్ గ్యాంగ్ చేసే ప్రయత్నాలతో కథ ముందుకు సాగుతుంది. రీటా పాత్రలో కీర్తి సురేశ్ తెరపై అందంగా కనిపించింది. నటిగా ఇది ఆమెకు సవాల్ విసిరే పాత్రేమీ కాదు. సినిమా మొత్తం దాదాపు ఒకే ఎక్స్‌ప్రెషన్‌లో కనిపిస్తుంది. ద్వితీయార్ధంలో తనలోని యాక్షన్ కోణాన్ని రుచి చూపించింది. తల్లి పాత్రలో రాధికా శరత్ కుమార్ నటన అక్కడక్కడా నవ్వులు పూయించింది. ప్రతినాయకుడిగా బాబీ పాండ్యన్ పాత్రలో సునీల్ ఆద్యంతం సీరియస్ లుక్‌లోనే కనిపించారు. తన ఆహార్యం కొత్తగా ఉంది. జాన్ విజయ్, సూపర్ సుబ్బరాయన్, అజయ్ ఘోష్ తదితరుల పాత్రలు పరిధి మేరకు ఉంటాయి.




# గందరగోళంగా విష్ణు విశాల్ ఆర్యన్


తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన కథానాయకుడు విష్ణు విశాల్ కీలక పాత్రలో నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ 'ఆర్యన్'. ఇప్పుడు ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఓ న్యూస్ ఛానల్‌లో జరుగుతున్న ఇంటర్వ్యూకు ప్రేక్షకుడిలా హాజరవుతాడు ఆత్రేయ (సెల్వ రాఘవన్). నయన (శ్రద్ధా శ్రీనాథ్) వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఆ షోకు వచ్చిన సెలబ్రిటీని కాలిపై తుపాకీతో కాల్చి లైవ్‌లో యావత్ ప్రపంచానికి ఓ సందేశాన్ని ఇస్తాడు. తాను ఒక రచయితనని,




జీవితంలో ఫెయిల్ అయినట్లు చెబుతాడు. వచ్చే ఐదు రోజుల్లో ఐదు హత్యలు చేస్తానని.. గంట ముందు వారి పేరు చెబుతానని, ఈ హత్యలను ఎవరూ ఆపలేరని చెబుతూ తనని తాను కాల్చుకుని చనిపోతాడు. దీంతో పోలీస్‌శాఖ ఈ కేసును సీరియస్‌గా తీసుకుంటుంది. ఆత్రేయ చెప్పిన వాళ్ళెవరో కనిపెట్టి కాపాడాలని భావిస్తుంది. పనిలో నిజాయతీగా ఉండే పోలీస్ ఆఫీసర్ నంది (విష్ణు విశాల్)కి ఈ బాధ్యతలు అప్పగిస్తుంది. చనిపోయిన తర్వాత కూడా ఆత్రేయ వరుస హత్యలు ఎలా చేశాడు? వాటిని అడ్డుకునేందుకు నంది అతడి టీమ్ ఏం చేసింది? ఈ క్రమంలో వాళ్లకు ఎదురైన సవాళ్లు ఏంటి? కేవలం ఐదుగురినే హత్య చేయడంలో ఆంతర్యం ఏంటన్నది కథ. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులను విశేషంగా అలరిస్తాయి మర్డర్ మిస్టరీ థ్రిల్లర్స్. హత్యలను ఛేదించడానికి లేదా సీరియల్ కిల్లర్ నుంచి వాటిని తప్పించడానికి కథానాయకుడు చేసే సాహసాలు, వేసే ఎత్తులు, పైఎత్తులు అన్నీ అలరిస్తాయి. 'ఆర్యన్' విషయంలో దర్శకుడు కొంతవరకూ సఫలం అయ్యారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా 'ఆర్యన్'ను ఆరంభించిన తీరు మెప్పిస్తుంది. అసలు చనిపోయిన వ్యక్తి మిగిలిన నలుగురిని ఎలా చంపుతాడా? అన్న ఆసక్తి సినిమా చూసే ప్రేక్షకుడిలో కలుగుతుంది. అదే సినిమా చూసేలా ప్రేక్షకుడిని సమాయత్తం చేస్తుంది. ఆత్రేయ సవాల్‌ను స్వీకరిస్తూ పోలీసులు నందిని రంగంలోకి దింపడం వెంటనే అతడు ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టడంతో కథ, కథనాలు మరింత ఆసక్తికరంగా నడుస్తాయి. ఆ తర్వాత హత్యకు గురయ్యే వ్యక్తుల వివరాలు వెల్లడించేందుకు ఆత్రేయ ఎంచుకున్న మార్గం, వాడుకున్న టెక్నాలజీ పోలీసులతో పాటు ప్రేక్షకుడినీ థ్రిల్‌కు గురిచేస్తుంది. ఈ పోలీసులు సాగించే ఇన్వెస్టిగేషన్ మాత్రం రొటీన్ ఫార్మాట్‌లో ఉంటుంది. చివరిగా పోలీస్ ఆఫీసర్ నంది పేరును ఆత్రేయ ప్రస్తావించడంతో కథ ఒక్కసారిగా ఆసక్తికరంగా మారుతుంది. దర్శకుడు ఎంచుకున్న ఆ పాయింట్, దాన్ని విష్ణు విశాల్ అంగీకరించడం ఏంటో ఎవరికీ అర్థం కాదు. కొత్తదనం ఉండాలి కానీ, మరీ ఇంత కొత్తగా ఉంటే కష్టమే.

# వేగంగా కదులుతున్న దిత్వా తుఫాన్

**- తమిళనాడులో భారీ వర్షాలు కురిసే ఛాన్స్**




**చెన్నై,నవంబర్28( వెలుతురు):**
ప్రస్తుతం శ్రీలంక తీరప్రాంతం, దాన్ని ఆనుకని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన 'దిత్వా తుఫాను' వేగంగా కదులుతోంది. ఈ వారాంతంలో ఉత్తర తమిళనాడువైపుకి కదులుతోందని, దీంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రామనాథపురం, తంజావూరు సహా ఐదు దక్షిన తీరప్రాంత, డెల్టా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తుఫాను మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున ఆర్ఎంసి శుక్రవారం డెల్టా, దాని పరిసర జిల్లాలైన అరియలూర్, కడలూర్‌లకు ఆరెంజ్ అలర్ట్, ఎల్లో అలర్ట్ హెచ్చరికలను జారీ చేసింది.దిత్వా తుఫాను తమిళనాడు మరియు ఆంధ్రప్రదేశ్‌కు దగ్గరగా కదులుతుందని , నవంబర్ 29,30 మరియు డిసెంబర్ 1 తేదీల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్‌లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. తమిళనాడు విపత్తు ప్రతిస్పందన దళం (టిడిఆర్ఎఫ్) చెందిన 30మంది సిబ్బంది శుక్రవారం తంజావూరుకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. మరో 30మంది టిఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది తిరువారూర్ చేరుకున్నారని అన్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లవద్దని తంజావూరు కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు కూడా ఒడ్డుకు తిరిగి వచ్చారని తెలిపారు.

# దిత్వా తుఫాన్‌తో అప్రమత్తం

**- కలెక్టర్లు,ఎస్పీలకు హోంమంత్రి ఆదేశం**



**అమరావతి,నవంబర్28( వెలుతురు):**
'దిత్వా' తుపాను నేపథ్యంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావం ఎక్కువగా చూపే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు హోంమంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు. శని, ఆదివారాల్లో వచ్చే భారీవర్షాలతో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని సూచించారు. ప్రమాదకరమైన హోర్డింగ్స్‌ను వెంటనే తొలగించాలని తెలిపారు. జిల్లాలు, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో 'దిత్వా' తుపాన్ ఏర్పడింది. ప్రస్తుతానికి ఇది ట్రింకోమలీకి 80 కి.మీ, పుదుచ్చేరికి 480 కి.మీ, చెన్నైకి 580 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన 6 గంటల్లో 8 కి.మీ వేగంతో తుపాన్ కదిలింది. ఆదివారానికి నైరుతి బంగాళాఖాతం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరుకునే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. దిత్వా తుపాన్ ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురవనున్నాయి. దిత్వా తుపాన్ ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవనున్నాయి. శని, ఆది, సోమవారాల్లో కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. శనివారం నాడు నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అతి భారీ వర్షాలు.. శ్రీసత్యసాయి, అనంతపురం, కడప, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు భారీ వర్ష సూచన ఉంది. ఆదివారం, సోమవారాల్లో కూడా కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# దుబాయ్ తేజస్ ఘటన దురదృష్టకరం

**- యధావిధిగా భవిష్యత్ ప్రణాళికలు**

**- హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఛైర్మన్ వెల్లడి**

**బెంగళూరు,నవంబర్ 28( వెలుతురు):**



దుబాయ్ ఎయిర్ షో చివరి రోజున భారత యుద్ధ విమానం తేజస్ కూలిపోవడాన్ని దురదృష్టకర సంఘటనగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డీకే సునీల్ అభివర్ణించారు. ఈ సంఘటన తేజస్ కార్యక్రమం భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపదని ఆయన స్పష్టం చేశారు. తాజాగా నిర్వహించిన జాతీయ భద్రతా సదస్సులో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డీకే సునీల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తేజస్ యుద్ధ విమానంలో ఎటువంటి లోపాలు లేవని ఆయన వెల్లడించారు.జాతీయ భద్రతా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. తేజస్‌లో ఎటువంటి సమస్యలు లేవు. ఈ వేదిక నుంచి, ఇది అద్భుతమైన యుద్ధ విమానం అని నేను ప్రకటిస్తున్నాను. ఇది పూర్తిగా సురక్షితమైనది. ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రతా రికార్డును కలిగి ఉందని ఆయన వెల్లడించారు. దుబాయ్‌లో తేజస్ విమానం కూలిపోవడం దురదృష్టకరమని, ఈ ప్రమాదం తేజస్ భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపదని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. తేజస్ యుద్ధ విమానం విదేశీ గడ్డపై కూలిపోవడం ఇదే తొలిసారి. అయితే ఈ ÷టైర్ జెట్ ఇప్పటి వరకు రెండుసార్లు మాత్రమే కూలిపోయింది.ఒక దేశం ముందుకు సాగుతూ.. దాని సొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినప్పుడు, అది అనేక దశలను దాటవలసి ఉంటుందని ఆయన అన్నారు. నేడు మేము ఈ 4.5-తరం విమానాన్ని కొత్త సామర్థ్యాలతో అభివృద్ధి చేసామని, ఇది భారీ విజయం అని వెల్లడించారు. ప్రస్తుతం మా దగ్గర 180 తేజస్ విమానాలు ఉన్నాయి, భవిష్యత్తులో ఈ సంఖ్య పెరుగుతుంది. ఈ విమానానికి ప్రపంచ వ్యాప్తంగా రక్షణ రంగంలో పెద్ద ఎగుమతి మార్కెట్ కూడా ఉంటుందని ఆయన అన్నారు. భవిష్యత్తు ఆర్డర్ల గురించి ఆయన మాట్లాడుతూ.. అన్‌మ్యాన్డ్ కంబాట్ ఏరియల్ వెహికల్ త్వరలో పూర్తవుతుందని అన్నారు. ఇవి 2026 నాటికి సిద్ధంగా ఉంటాయని, 2027 నాటికి ఆకాశంలో ఎగురుతాయని వెల్లడించారు.

# పిన్నెల్లి సోదరులకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ

**- మధ్యంతర బెయిల్‌ను రద్దు చేస్తూ .. లొంగిపోవాలని ఆదేశం**

**- రెండు వారాల్లో లొంగిపోవాలని వార్నింగ్**

**న్యూఢిల్లీ,నవంబర్28( వెలుతురు):**
పల్నాడు జంట హత్యల కేసులో వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వారు దాఖలు చేసిన రెండు పిటిషన్లను కొట్టివేసింది. అంతేకాకుండా మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ఆదేశాలు జారీ చేశారు. హత్య కేసులో పిన్నెల్లి సోదరులకు ముందస్తు బెయిల్‌కు అర్హత లేదని జస్టిస్ సందీప్ మెహతా ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అయితే సరెండర్ కావడానికి కొంత సమయం కావాలని పిన్నెల్లి తరపు లాయర్లు కోర్టును కోరారు. దీంతో సరెండర్ అయ్యేందుకు రెండు వారాల సమయాన్ని న్యాయస్థానం ఇచ్చింది. పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. విచారణకు సహకరించాలని సుప్రీంకోర్టు చెప్పినా... సహకరించలేదని, సాక్షులను బెదిరించారని, సాక్ష్యాలు ట్యాంపర్ చేసే ప్రయత్నం చేశారని రాష్ట్ర ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఇద్దరిని చంపిన వ్యవహారంలో ముందస్తు బెయిల్ పొందేందుకు పిన్నెల్లి సోదరులకు ఏమాత్రం అర్హత లేదని జస్టిస్ సందీప్ మెహతా వ్యాఖ్యానించారు. వెంటనే అరెస్టు చేయడానికి ఎలాంటి అనుమతులు అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే లొంగిపోవడానికి రెండు వారాలు సమయం ఇవ్వాలని పిన్నెల్లి సోదరుల తరపు న్యాయవాదులు కోరారు. ముందస్తు బెయిల్ విషయంలో లొంగిపోయేందుకు సమయం ఎలా ఇస్తారని జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. సెక్షన్ 161 కింద నమోదు చేసిన డాక్యుమెంట్లు నిందితులకు ఎలా అందాయని ప్రభుత్వాన్ని జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. నిందితుల 161 స్టేట్‌మెంట్‌ను పోలీసులు నిందితులకే ఎలా ఇస్తారని జస్టిస్ నిలదీశారు. పోలీసులు కూడా నిందితులకు పూర్తిగా సహకరిస్తున్నట్లు ఉందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై కూడా పూర్తిస్థాయి దర్యాప్తు అవసరం అవుతుందేమోనని కూడా జస్టిస్ సందీప్ మెహతా అన్నారు. 161 స్టేట్‌మెంట్ కూడా తమకు అనుకూలంగా ఉందని, పోలీసుల విచారణలో పూర్తిగా సహకరిస్తున్నారని సుప్రీంకు పిన్నెల్లి సోదరుల తరపు న్యాయవాదులు తెలిపారు.



# ఐసియూలో ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్

**- అమ్మలాగే ఆర్థిక మంత్రి అవసరం మేరకు కేటాయింపులు**

**- చంద్రబాబు కారిన్యం కూడా అభివృద్ధికి దోహదం**

**- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి**

**అమరావతి,నవంబర్28( వెలుతురు):**
రాజధాని బ్యాకుల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..గత పాలకుల వల్ల ఐసీయూలో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం ఆక్సిజన్ అందించిందన్నారు. దీనికి రాష్ట్ర ప్రజల తరపున కేంద్రానికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాం.బ్యాంకుల ప్రధాన కార్యాలయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ అంతా ఏపీకి వచ్చినట్టు ఉంది. ఆర్థిక వనరుల విషయంలో ఆమె కాస్త కఠినంగానే ఉంటారు. మన ఇంట్లో అమ్మలాగే ఎప్పుడు ఏది అవసరమో, అప్పుడే నిధులు ఇస్తారు. ఇంత పెద్ద భారతదేశంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నిర్వహించటం మాటలు కాదు. మా రాజకీయ హెడ్ మాస్టర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఫలితాలు సాధించే విషయంలో కఠినంగానే ఉంటారు. అందుకే ప్రతిఫలాలు ప్రజలకు అందిస్తున్నారని పయ్యావుల అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ కు ఇంధనం-ధనమే. వందేభారత్ రైళ్లు, డిఫెన్స్ సెక్టార్, విద్య, వైద్య రంగాల్లో నిధుల కేటాయింపు పెరుగుతోంది.దేశం గుర్తు పెట్టుకునేలా కేంద్ర ఆర్థిక మంత్రి సేవలు అందిస్తున్నారు.జీఎస్టీ సంస్కరణల ప్రకటించినప్పుడు అత్యంత వేగంగా దానిని దేశవ్యాప్తంగా అమలు చేయటం ఆశ్చర్యపరిచింది.పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణానికి, విశాఖ ఉక్కుకు ఆర్థిక సహకారం కేంద్రం అందిస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు . కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ 8 మార్లు ఆర్థిక మంత్రిగా బ్జడెట్లు ప్రవేశపెట్టిన చరిత్ర సాధించారు నిర్మలా సీతారామన్. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను విలీనం చేసి ఖాయిలా ప్రమాదం నుంచి వాటిని కాపాడారు ఆమె. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారికి నిర్మలాసీతారామన్ స్ఫూర్తి. 34 వేల ఎకరాలను రైతులు రాజధాని కోసం త్యాగం చేశారు. అమరావతి అంటే ఆంధ్రుల ఆత్మవిశ్వాసం, రాష్ట్ర భవిష్యత్ కల అన్నారు. రాజధానిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేసారు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ , ముఖ్యమంత్రి చంద్రబాబు. మొత్తం 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేసారు. ఆయా బ్యాంకుల చైర్మన్లు, సీఎండీలు ఉన్నతాధికారులు హాజరయ్యారు.







Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com